

జనక్‌పూర్: పంటపొలాల్లో దిగిన విమానం...
వరద నీటిలోనే విమాన ప్రయాణికులు నడకబాట

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 124 • సోమవారం 14 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ సప్తమి, సా. 6.01 వరకు, అనంతరం అష్టమి; నక్షత్రం: భరణి తె. 3.14 వరకు, అనంతరం కృత్తిక; అమృతకాలం: రా. 10.45 నుండి 12.15 వరకు; వర్జ్యం: మ. 1.35 నుండి 3.06 వరకు; దుర్ముహూర్తం: మ. 12.31 నుండి 1.22 వరకు, తదుపరి మ. 3.04 నుండి 3.55 వరకు ; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు

డిసెంబర్ డెడ్‌లైన్

కాళేశ్వరం తొలిదశ పూర్తికావాల్సిందే



- 2018 జనవరి కల్లా ఎల్లంపల్లి నీళ్ళు మిడ్ మానేరులోకి
- 6,7,8 ప్యాకేజీలు షెడ్యూల్‌కన్నా ముందే పూర్తవ్వాలి
- ఎలక్ట్రికల్, మెకానికల్ పనులకు నవంబర్ డెడ్‌లైన్
- పనుల వారీగా..అధికారులు, ఏజెన్సీలకు మార్గదర్శకాలు: మంత్రి హరీష్‌రావు సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళేశ్వరం ప్రాజెక్టు 6,7,8ప్యాకేజీలను ఎట్టిపరిస్థితుల్లోనూ డిసెంబర్ కల్లా పూర్తిచేయాలని, 2018జనవరి కల్లా ఎల్లంపల్లి నీళ్ళు మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి దుంకించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశించారు. ఆదివారం జలసౌధలో కాళేశ్వ రం ఎత్తిపోతల ప్రాజెక్టుపై సమీక్షజరిపిన ఆయన ఎల్లంపల్లి, మిడ్‌మానేరులను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలోని పది పాతజిల్లాల్లో ఏడు పాత జిల్లాల రైతుల జీవితాలతో ఈ పథకం ముడిపడి ఉందన్నారు.

తెలంగాణకు జీవధార అయిన ఈ పథకం పనులను ముఖ్య మంత్రి కెసిఆర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, రాష్ట్రరైతాంగ భవిష్యత్తుకు ఇది అత్యంత కీలకమైన పథకమన్నారు. 6,7,8ప్యాకేజీల పనులను ప్రతి వారంలో రెండురోజుల పాటు సైట్‌లోనే ఉండి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమీక్షించాలని ఎత్తిపోతల పథకాల సలహాదారుడు పెంటారెడ్డిని మంత్రి ఆదేశించారు.

నవంబర్ చివరికల్లా ఎలక్ట్రికల్, మెకా నికల్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. వివిధ పనులకు సంబంధించిన డెడ్‌లైన్లను మంత్రి ఖరారు చేశారు. నవంబర్ కల్లా పంపుహౌజ్‌లు, టన్నెల్ పనులు, ఇతర నిర్మాణాలు పూర్తికావాలన్నారు. డిసెంబర్ నాటికి సర్జ్‌పూల్ పనులను పూర్తిచేసి డ్రైరన్ నిర్వహించాలన్నారు. ఆయా ప్యాకేజీలకు చెందిన టన్నెల్స్, కెనాల్స్ లైనింగ్ పనులు అక్టోబర్, నవంబర్ కల్లా పూర్తి చేయా లన్నారు. ప్రాజెక్టు పనులన్నింటినీ ఎట్టిపరి స్థితుల్లో నూ టార్గెట్‌లోగా పూర్తిచేయాలన్నారు. అధికా రులు, ఏజెన్సీలు.. అంతా సమన్వయంతో వ్యవహ రించి నిర్ణీత గడువులోగా పనుల పూర్తికి సహకరిం చాలన్నారు. మేడారం రిజర్వాయర్ పనులను వేగ వంతం చేయాలన్నారు. మేడారం రిజర్వాయర్‌కు సంబంధించి రైతులకు పంట పరిహారం వెంటనే ఇవ్వాలని హరీష్ అన్నారు. క్రాప్ హాలిడేకు సంబంధించిన ఫైలును వెంటనే క్లియర్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్‌ను మంత్రి కోరారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వస్పెషల్ సిఎస్ జోషి, ఇరిగేషన్ ఈఎన్‌సి మురళీధర్‌రావు, ఎత్తిపోతల పథకాల ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి, కాళేశ్వరం సిఈ ఎన్‌వెంకటేశ్వర్లు, భూసేకరణ సలహాదారు జి.మనోహర్, ఈఈ నూనె శ్రీధర్, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ ఏమైంది!?

- 2013లో రూ.3,275 కోట్లతో మంజూరు... నేటికి విడుదల కాని నిధులు
- ప్రాజెక్టు ఉన్నట్టా? లేనట్టా? స్పష్టత ఇవ్వండి
- కేంద్ర ఐటీ మంత్రికి కేటీఆర్ లేఖాస్త్రం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: "ఐటీఐఆర్ ప్రాజెక్టుపై స్పష్టత కొరవడింది. నాలుగేళ్ల క్రితం కేంద్రం హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల కాలేదు. కేంద్రం నుండి సహకారం లేనప్పటికీ ఐటీ రంగం పురోభివృద్ధిలో తెలంగాణ విజయవంతంగా ముందుకు సాగుతోంది. పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం కోసం ఐటీఐఆర్ విషయంలో కేంద్రం సత్వర చర్యలు తీసుకొనవలసి ఉంది" అంటూ కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రాసాద్‌కు మంత్రి కేటీఆర్ లేఖ రాశారు. 2013 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన హైదరాబాద్ ఐటీఐఆర్‌కు ఆర్థిక తోడ్పాటు అందించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నదని కేంద్ర మంత్రికి వివరించారు. 2010లో రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎండీఏ పరిధిలో ఐటీఐఆర్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. అనంతరం రెండు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించామని వివరించారు. రెండు విడతల్లో హైదరాబాద్ ఐటీఐఆర్‌ను అభివృద్ధి పర్చడానికి రూ. 4863 కోట్ల సహాయం కోరిందన్నారు. తొలి విడత రూ. 942 కోట్లు, రెండవ విడత రూ. 3921 కోట్ల సహాయం

➪ 3వ పేజీలో...

ఇక పక్కాగా భూ లెక్క



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

- పున: సర్వేకు శ్రీకారం చుట్టిన రెవెన్యూ అధికారులు
- ప్రయోగాత్మకంగా సిద్దిపేట, రంగారెడ్డి జిల్లాల్లో సర్వే
- నమూనా సర్వే విశ్లేషించాక రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో భూముల లెక్కలను పక్కాగా తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. భూముల లెక్కలను ఖరారు చేయాలని, ఇందుకు గ్రామాల వారీగా సర్వే నిర్వహించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇటీవల ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అధికారుల బృందం రంగంలోకి దిగి భూముల లెక్కలను గణించే పనిలో నిమగ్నమైంది. రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఆయా జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ రెండు జిల్లాలలో వచ్చిన ఫలితాలను విశ్లేషించాకే మిగిలిన 29 జిల్లాలలో సర్వే చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. భూముల పునఃసర్వేపై అధ్యయనం చేస్తున్న

➪ 8వ పేజీలో...



రోబో ఆర్మీ వచ్చేస్తోంది!

- త్వరలో భారత సైన్యంలోకి
- క్లిష్ట పరిస్థితుల్లో సైన్యానికి రోబోల సహాయం
- కాశ్మీర్ లోయలో ఉగ్రవాద నిర్మూలనకు రోబోల సహకారంతో అడ్డుకట్ట
- సరిహద్దులో చొరబాటుదారుల కట్టడి...ఉగ్రవాదంపై రోబోలతో పోరాటం



2

మనిషి మేధస్సుతో పురుడుపోసుకున్న రోబో యంత్రం ఇప్పుడు ప్రపంచాన్ని శాసించే శక్తి సామర్థ్యాలను సముపార్జించుకుంది. కృత్రిమ మేధస్సుతో పనిచేసే రోబో మనిషి కన్న ఎన్నో రెట్లు అధిక వేగంతో.. అత్యంత తేజంతో పనిచేయగలదు. రోబోల సేవలను భారత సైన్యం... ప్రధానంగా ఉగ్రవాదం నిర్మూలనలో వినియోగించుకోవాలని యోచిస్తోంది.

చేతులే శాపం!



- బెలూన్ వేళ్లతో బాలుడి నరకయాతన

లక్నో: అసలే నిరుపేద కుటుంబం.. ఆపై జన్యు లోపం.. విధి రాత అతడికి శాపంగా మారింది.. కాళ్లు చేతులు అన్నీ ఉన్నా తన పనులు తాను చేసుకోలేని దుర్భర స్థితి.. ఇదిలావుంటే ఊరుఊరంతా దెయ్యం పిల్లాడు అని పేరుపెట్టేయడం అతడిని, కుటుంబ సభ్యులను తీవ్ర మనోవ్యధకు గురిచేస్తోంది. స్నానం చేయడం, బట్టలు వేసుకోవడం, చివరకు తినడం కూడా అతనికి ఇబ్బందికరంగానే ఉంటుంది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన తారిఖ్‌కు పుట్టుకతోనే జన్యు లోపం కారణంగా చేతులకున్న మూడు వేళ్లు అసాధారణ సైజులో ఏర్పడ్డాయి. బొటన, చూపుడు, మధ్యవేలు ఇలా బెలూన్ మాదిరిగా ఉబ్బిపోయినట్లు ఉన్నాయి. మిగతా రెండు వేళ్లు సాధారణ

➪ 3వ పేజీలో...





కొండచరియలు విరిగిపడి
50 మంది సజీవ సమాధి

46 మృతదేహాల వెలికితీత... హిమాచల్‌లో దుర్ఘటన

- రెండు బస్సులపై పడిన మట్టిపెళ్లలు
- లోయలోకి జారిపోయిన బస్సులు
- ప్రధాని దిగ్భ్రాంతి
- రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో కొండ చరియలు విరిగిపడగా, రెండు బస్సుల్లో 50 మంది జనం గల్లంతయారు. వీరందరూ మరణించి ఉంటారని భావిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 12.15 గంటలకు జరిగిన ఇతర వాహనాలు, కూలిపోయిన ఇళ్లలోని జనంతో కూడా కలిపితే మృతుల సంఖ్య 50కి చేరవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఈ మేరకు రాష్ట్ర రవానా శాఖ మంత్రి బీఎస్ బాలి ప్రకటించారు. కడపటి వార్తలందే సమయానికి 46 మృతదేహాలను వెలికి తీసారు. ఒక దశలో కొండ చరియలు విరిగి పడుతుండడంతో సహాయ కార్యక్రమా లకు విఘాతం కలిగింది. జరిగిన జన నష్టానికి ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. జాతీయ విపత్తు దళం (ఎన్డీఆర్ఎఫ్) దళాలను సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడానికి మండికి పంపారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ మృతుల కుటుంబాలకు రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో కొండచరియల ధాటికి రెండు బస్సులు కొండ కిందకు పడిపోయాయి. ఒక బస్సు కిలోమీటర్ కిందకు పడిపోగా, మరో బస్సును మీద కొండ చరియ శిథిలాలు కప్పేసాయి. ఇంకా డజన్ చిన్న వాహనాలు కూడా కొండచరియల్లో చిక్కుకున్నాయి. ఈ ధాటికి నాలుగు అంతస్తుల ఒక భవనమూ నేలకూలింది. మండి గుండా వెళ్లే జాతీయ రహదారి 21 మీద కొంత ప్రాంతంలో కొండచరియలు విరిగి పడే ప్రమాదం భారీగా ఉంది.



షోపియాన్‌లో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మిలిటెంట్లు హతం
- ఇద్దరు జవాన్లు వీర మరణం
- మరో ముగ్గురికి గాయాలు
- 20 గంటలపాటు కొనసాగిన ఎదురు కాల్పులు

9



భారత్‌లో భారత్‌పై ఐసిస్ యుద్ధం?

- యువతను రెచ్చగొట్టి దారుణాలు చేయిస్తున్న ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్లు
- ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడి


9

ఔరా..!



గాలి..వెలుతురు..అగ్నిపర్వతాలే
చీలీ బిజిలీ

- సంప్రదాయేతర ఇంధన వనరుల్లో లాటిన్ అమెరికా అగ్రపథం
- పవన, సౌర విద్యుదుత్పత్తితోపాటు జియోథర్మల్‌కు చిలీ శ్రీకారం
- భూ పొరల్లోని ఉష్ణతాపం విద్యుత్ వెలుగులుగా రూపాంతరీకరణ
- నాటి ప్రాణాంతక అగ్నిపర్వతాలే..నేడు ప్రధాన జీవనాధారం




సెర్రొపాబెలాన్: సముద్ర మట్టానికి 14,760 అడుగుల ఎత్తులో.. ఒంటిపై బ్లూ యూనిఫారం, తలపై తెల్లని హెల్మెట్లతో భారీ యంత్రాల మధ్య కార్మికుల జీవన పోరాటం. దూరంగా గమనిస్తే అదేదో ఆయిల్ రిగ్గు పరిశ్రమలా అనిపిస్తుంది. కానీ వాస్తవానికి అక్కడ జరిగేది చమురు మదింపు కాదు.. ఉష్ణతాప మదింపు. మంచుతో కప్పబడిన అగ్నిపర్వతాల మధ్య జియోథర్మల్ (భూఉష్ణ) విద్యుత్ ప్లాంట్ వద్ద దృశ్యమిది.

ద.అమెరికా ప్రాంతంలోనే తొలి జియో థర్మల్ విద్యుత్ ప్లాంట్ చిలీ పర్వత ప్రాంతాల్లో నెలకొల్పారు. సాంప్రదాయేతర ఇంధన వనరుల్లో ఇదొక విప్లవాత్మక ప్రయోగం. 1.65 లక్షల నివాసాలకు ఈ ప్లాంటు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. పవన, సౌర విద్యుత్ రంగంలో ప్రపంచంలో మేటిగా దూసుకెళ్తున్న చిలీ జియోథర్మల్ ప్లాంట్ ద్వారా శిలాజ ఇంధన విద్యుత్‌కు పూర్తిగా స్వస్తిచెప్పే ప్రయత్నం చేస్తోంది. కరవు, వరదలు వంటి అసాధారణ వాతావారణ పరిస్థితుల మూలంగా హైడ్రోపవర్‌పై ఎక్కువగా ఆధారపడలేము. అందుకే ఇక్కడి ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారిస్తున్నాయి అని ప్రపంచబ్యాంకు ఎనర్జీ నిపుణుడు గాబ్రియెలా ఎలిజొండొ వ్యాఖ్యానించారు.

జియోథర్మల్‌తో వెనుకబాటు మాయమైంది

ఈశాన్య ఎడారి పొడవునా 2653 మైళ్ల తీర ప్రాంతం ఇప్పుడు జాతీయ పవర్ గ్రిడ్‌కు అదనపు శక్తిగా మారింది. పవన, సౌర విద్యుత్‌కు బ్రేక్ పడొచ్చేమోగానీ, జియోథర్మల్ మాత్రం

➪ 8వ పేజీలో...



భారత రణ క్షేత్రంలోకి రోబో సైన్యం

రోబో... మనిషి మేధస్సుతో పురుడుపోసుకున్న ఈ యంత్రం ఇప్పుడు ప్రపంచాన్ని శాసించే శక్తి సామర్థ్యాలను సమపార్జించుకుంది. కృత్రిమ మేధస్సుతో పనిచేసే రోబో మనిషి కన్న ఎన్నో రెట్లు అధిక వేగంతో.. అత్యంత తేజంతో పనిచేయగలదు. అయితే మనిషి కనుసన్నల్లో పనిచేసేంత వరకు దీని ప్రవర్తన బాగానే ఉంటుంది కానీ..పూర్తి స్థాయిలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకునేలా రూపొందిస్తే మాత్రం మానవాళికి పెనుసవాళ్లను విసురుతుంది. అందుకే రోబోను సందర్భానుసారంగా మాత్రమే వినియోగించుకునేలా ప్రస్తుతం రూపకల్పన జరుగుతోంది.

● త్వరలో భారత సైన్యంలోకి ప్రవేశం ● సరిహద్దుల్లో సైన్యానికి తోడ్పాటు ● చొరబాట్లు, ఉగ్రవేటలో కీలకం ● కాశ్మీర్ లోయలో.. గస్తీ విధుల్లోనూ ముఖ్యపాత్ర ● రక్షణ శాఖ వ్యూహాత్మక నిర్ణయం

రోబో ను భారత ఆర్మీ సేవల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్న నేపథ్యంలో దీని ప్రభావం ఎలా ఉండబోతుంది.. ఏఏ సందర్భాల్లో వినియోగిస్తారు అనే అంశాలను ఒక్కసారి పరిశీలిద్దాం.

మందుగుండు సామాగ్రి తరలింపులో


దేశంలో తిరుగుబాటు దారుల సంఖ్య పెరిగి పోయినప్పుడు వారిని అణిచివేసేందుకు రోబోలు అత్యంత ఆవశ్యకం. జమ్ము కశ్మీర్ లోనిరోజురోజుకూ పెచ్చుమీరుతున్న తిరుగుబాటు దారుల ఆగడాలను అడ్డుకోవాలంటే రోబోలు తప్పనిసరి.. ఇదే అంశంపై ఆర్మీ నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన రక్షణ శాఖ రోబోలను రంగంలోకి దించేందుకు రెడీఅవుతోంది. మందుగుండు సామాగ్రి తరలింపు సందర్భంగా ఒక్కోసారి అవి పేలి ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోవ డమో..తీవ్ర గాయాలపాలవ డమో జరుగు తుంది. అలాంటి ఘటనల నివారణకు రోబోలను మందు గుండు సామాగ్రి తరలింపుకు వాడవచ్చు.

ఎలాంటి వాతారవణంలోనైనా పనిచేసేలా

కొన్ని విపత్కర పరిస్థితుల్లో మనిషి పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోవడం సర్వ సాధారణం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ విపత్తు సమయాల్లో, పెను గాలులు వీచే సమయాల్లో, భారీ వర్షాలు కురు స్తున్న సమయంలో శత్రువు లను నిలువరించడం కొంత కష్టతరమౌతోంది. అలాంటి పరిస్థితులను అనుకూలంగా మార్చుకుం టున్న మిలిటెంట్లు భారత్ లో చొరబాట్లు కు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా పనిచేయ గలిగే సామర్థ్యాన్ని రోబోలకు కల్పించి రంగంలోకి దించాలని రక్షణ శాఖ భావిస్తోంది.అందుకే నేలపై, ఆకాశంలో, భవనంపై నుంచి, భవనం లోపలి నుంచి ఇలా ఎక్కడైనా పనిచేసేలా రోబోల రూపకల్పన సాగుతోంది.

నిఘా విభాగంలో రోబో

రోబోలను నిఘా వర్గాల్లో వినియోగించడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. సెక్యూరిటీ కెమెరాల ద్వారా వివిధ రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్టుల్లో అనుమానితుల కదలికలను నిఘా వర్గాలు పసిగడుతాయి. అయితే కొన్ని సందర్భాల్లో సెక్యూరిటీ కెమెరాలు పనిచేయకపోవడమో..లేక వాటిని మానిటర్ చేస్తున్న వ్యక్తులు నిర్లక్ష్యం చేసినప్పుడు సంఘ విద్రోహ శక్తుల నుంచి పెను సవాళ్లు ఎదుర్కోవాల్సి రావచ్చు.. ఇలాంటి సమస్యలు రాకుండా ఆయా కెమెరాలకు రోబోలకు అనుసంధానం చేస్తే చాలు మనుషులు చేయాల్సిన మిగతాపనులన్నీ అవే చూసుకుంటాయి. కెమెరాలు అమర్చిన ప్రాంతాల్లో ఏదైన అనుమానపు వస్తువు కనిపించిన, అనుమానంగా సంచరించే వ్యక్తులు వెళ్తున్నా ఇట్టే పట్టేసి..సమాచారాన్ని సదరు అధికారులకు క్షణాల్లో చేరవేస్తాయి. దీంతో నేరాలను తగ్గించడమే కాకుండా ఉగ్రవాదుల, సంఘ విద్రోహ శక్తులను అణిచివేయడం పోలీసులకు చాలా సులువౌతుంది. ఇక ఇటీవల కాలంలో ఉపయోగిస్తున్న డ్రోన్ కెమెరాలు, మౌంట్ స్మార్ట్ కెమెరాలకు రోబోటిక్ టెక్నాలజీ వినియోగిస్తే...నిర్ణిత ప్రదేశంలో జరిగే కదలికకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు సదరు వ్యక్తులకు చేరవేస్తాయి. కొన్నికొన్ని సమయాల్లో మనుషులు చేయలేని పనులను రోబోలే సులువుగా చేసేస్తాయి. బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు సదరు ప్రదేశంలో ఉన్న పరిస్థితులను మనుషులు తెలుసుకునేందుకు చాలా సమయం పడుతుంది. అదే రోబోను వినియోగిస్తే తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని సేకరించి ప్రమాదాలను ముందే పసిగట్టి అరికట్టవచ్చు.



ఉగ్రవాదుల ఏరివేతకు

రోజురోజుకూ పెచ్చుమీరుతున్న ఉగ్రవాదాన్ని నిలువరించేందుకు రోబోల సహాయం తప్పనిసరి. చొరబాటుదారుల రూపంలో భారత్‌లో అడుగు పెడుతున్న ఉగ్రవాదులు దేశంలో వివిధ ప్రాంతాలే లక్ష్యంగా పేలుళ్లకు కుట్రలు చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చొరబాటు యత్నాలను సైన్యం ఎప్పటి కప్పుడు భగ్నం చేస్తున్నప్పటికీ..ఆర్మీ కన్నుగప్పి దేశంలో అడుగుపెడుతున్న వారిని వెంటనే గుర్తించి తుదుముట్టించేందుకు రోబోలు సిద్ధమౌతున్నాయి. ఉగ్రవాదులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చెక్ పెట్టేందుకు ఇప్పటికే రక్షణ శాఖ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. డ్రోన్ కెమెరాలను రోబోలకు అనుసంధానం చేయడం..సరిహద్దుప్రాంతాల్లో రోబోలను మొహరించడం ద్వారా ఉగ్రవాదుల ఆటలు కట్టించాలని నిర్ణయించారు. ఉగ్రవాద నిర్మూలనపై ప్రపంచ దేశాలను ఏకం చేస్తున్న ప్రధాని మోడీ కూడా రోబోల రూపకల్పన అత్యంత ఆవశ్యకంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రోబోలను మొదటిసారిగా ఉపయోగించిన జర్మన్ సైన్యం


మిలిటరీలో రోబోలను వినియోగించడం ఇప్పుడే కొత్తకాదు. రెండోప్రపంచ యుద్ధ సమ యంలో, జర్మనీ, రష్యామధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధాల్లో ఉపయోగించారు. ఎంక్యూబీ-1 ప్రిడేటర్ డ్రోన్‌ను అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఉపయోగించింది. వైమానిక రోబోల ద్వారా వారి పాతకాలపు ఊహాచిత్రాల గుడచర్యాన్ని తెలుసు కునేందుకు వాడారు. రోబోలను యుద్ధ సమయా ల్లోనే కాకుండా, వైజ్ఞానిక కల్పనలోనూ ఉపయోగిం చేందుకు ఎన్నోరకాల ప్రయత్నాలు జరుగుతున్నా యి. ఇప్పటికే పలుదేశాలు తమమిలిటరీలో వివిధ రకాల సేవల కోసం రోబోలను వాడుతున్నాయి.

అమెరికాయే పెద్దన్న

భవిష్యత్‌లో జరిగే యుద్ధాల్లో రోబోలదే కీలక పాత్ర అని దశాబ్దాల క్రితమే ఊహించిన అమెరికా తమ సైన్యంలో రోబోల వినియోగంలో అమెరికా పెద్దన్న పాత్రను పోషిస్తోంది.

ఇప్పటికే అమెరికా సైన్యానికి అవసరమైన పలు రకాల సేవలను రోబొలు అందిస్తున్నారు. కొన్ని కొత్త రకాల వాటి కోసం ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వైమానికసేవలు అందిస్తున్న రోబో వాహనం ఐఏఐ పియోనీర్ మరియు ఆర్‌క్యూ-1 ప్రిడేటర్. ఇది ఆకాశం నుంచి నేలపైకి మిస్సైల్ ప్రయోగించగలదు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఇది పనిచేస్తుంది.




డీఆర్‌డీవో దక్ష్

భారత్‌లో రోబోటిక్ మిలిటరీ వాహనాల తయారీ 2011 నుంచి ప్రారంభమైంది.డీఆర్డీవో రూపొందిం చిన దక్ష్ అనే వాహనం బ్యాటరీ ఆధారంగా పని చేస్తుంది. దీనికి రిమోట్ కంట్రోల్ ద్వారా ఆదేశాలి స్తారు. ఇది మెట్లపై ..ఏటవాలు ప్రాంతాల్లో, నౌకా కారిడార్లలో ప్రయా ణిస్తూ ప్రమాదకర వస్తువులను పసిగట్ట మేకాకుండా.. లక్ష్యాన్ని చేధించగలదు. దక్షలో అమర్చిన ప్రత్యేక పరికరాల ద్వారా దూరం నుంచి అనుమానపు వస్తువులు, కదలికలను స్కాన్ చేసి రిపోర్టు చేస్తుంది. పేలుడు పదార్థాలను ముందే పసిగట్టి ఆ సమాచారాన్ని క్షణాల్లో కమాండ్ కంట్రో ల్ సెంటర్‌కు పంపిస్తుంది. అయితే దీని లక్ష్యపరిధి చాలా తక్కువ. 500 మీటర్ల వరకు గల లక్ష్యాలను దక్షచేధిస్తుంది.



రోబోల రూపకల్పనలో సీఏఐఆర్, డీఆర్డీవోలు



ఆర్మీకి అవసరమైన రీతిలో రోబోలను అందించేందుకు సీఏఐఆర్,డీఆర్డీవో ల్లో కృత్రిమ మేధస్సుతో పనిచేసే రోబోల రూపకల్పనకు ప్రయోగాలు జరుగుతున్నాయి. వీటి రూపకల్పన పూర్తయితే రోబోలన్ని పరస్పర సహకారంతో రాళ్లు రువ్వేవారిని, మిలిటెంట్లను క్షణాల్లో ఏరివేయగలవు. ప్రస్తుతం భారత ఆర్మీ ఎదుర్కొంటున్న సమస్యలన్నిఇటికీ పరిష్కారం లభించేలా ఈ రోబోల రూపకల్పన చేయాలని ప్రయోగాలు చేస్తున్నారు.

కొండలు, గుట్టలు, దట్ట మైన అటవీ ప్రాంతాల్లో జవాన్లు వెళ్లడం అంత సులువు కాదు. ఇదే అదు నుపు భారత్ సరిహద్దుల్లో చొరబాటు యత్నాలు జరుగుతున్నాయి.వీటిని నిలువరించేందుకు సైనికులు అహర్నిశలు శ్రమిస్తున్నప్పటికీ చిన్న ఏమర పాటు వారి ప్రాణాల మీదకు తెస్తోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో రోబోలను వినియోగిస్తే అత్యంత క్లిష్టమైన ప్రాంతాలకు కూడా రోబోలు చొచ్చుకుని వెళ్లిపోగలవు. అంతే కాదు శత్రువుల జాడను కనిపెట్టి వారిని హత మార్చగలవు. అందుకే భారత

క్లిష్టప్రాంతాల్లో రోబోల సేవలు



ఆర్మిలో రోబో సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. సరిహద్దుల్లో రోబోల సేవలు తీసు కోవడం వల్ల సమయాభావం తగ్గుతుంది..ఆర్మీ ప్రాణాలుగాల్లో కలవకుండా శత్రువులను సులువుగా నిలువ రించవచ్చు. మనుషుల కంటే వేగంగా కొండ, గుట్టల్లోకి చొచ్చుకునిపోయి నిర్దేశించిన లక్ష్యాలను చేధించగలవు. శత్రువులు కొండ, గుట్ట ప్రాంతాల్లో దాక్కొని సరైన సమయం కోసం ఎదురుచూసే ఉగ్రమూకల జాడలను ఆకాశం నుంచే పసిగట్టి..చిత్రాలను పంపించే రోబోలు ఆర్మీకి అత్యంత ఆవశ్యకం. ఈ నేపథ్యంలో అలాంటి రోబోలను సైన్యానికి సహకారం అందించేందుకు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

వేర్పాటువాదులను నిలువరించేందుకు



రోబోలను సైన్యంలోకి తీసుకోవాలన్న ముఖ్య ఉద్దేశం జమ్ము కశ్మీర్‌లోని వేర్పాటువాదు లను నిలువరించేందుకే. ముఖ్యంగా పోలీసులు, ఆర్మీ సిబ్బందిపై రాళ్లు రువుతూ వారిని గాయ పరుస్తున్న వారి పనిపట్టాలంటే కృత్రిమ మేధస్సుతో పనిచేయగల రోబోలు కావాలని రక్షణశాఖ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. సాధారణ ప్రజల్లో ఉంటూనే వేర్పాటువేదాన్ని పెంచిపోషిస్తున్న వారి కదలికలను తెలుసుకోవ డం అంత సులువైన విషయం కాదు. అలాంటి పరిస్థితుల్లో రోబోలను వినియోగిస్తే అనుమానపు కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తాయి కాబట్టి వేర్పాటు వాదులను పసిగట్టడం సులవైపోతుంది. కశ్మీర్ లోయలో వేర్పాటువాదులు పదేపదే సైన్యంపై రాళ్లు రువ్వడంతో అధికారులు రక్షణశాఖకు తమ గోడును వెల్లబోసుకున్నారు. దీంతో తిరుగుబాటుదారులు, మిలిటెంట్లను అణిచివేసేందుకు రక్షణ శాఖ రోబోలను రంగంలోకి దింపాలని భావిస్తోంది. రోబోలు క్షేత్రస్థాయిలోకి వస్తే ఆర్మీ సిబ్బందికి రాళ్లదాడి వల్ల కలిగే గాయాల నుంచి దాదాపుగా విముక్తి లభిస్తుంది. ప్రస్తుతానికి 544రోబోలు అవసరమని ఆర్మీ పంపిన ప్రతిపాదనలకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది.

గడప గడపకూ కాంగ్రెస్

● పార్టీ పటిష్టతపై ప్రత్యేక దృష్టి ● రాహుల్‌పై దాడికి ఖండన ● యూపీలో పిల్లల మృతికి సంతాపం ● టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో కార్యాచరణ ఖారారు ● మల్లు రవి, శ్రవణ్‌కుమార్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పార్టీ పటిష్టత, 2019 లో అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు మూడు నెలల కార్యాచరణను ప్రకటించింది. కాంగ్రెస్ సిద్ధాంతాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను గడప గడపకు వెళ్లి చాటాలని తీర్మానించింది. సోషల్ మీడియా ద్వారా జనంలోకి వెళ్లేందుకు గ్రామ స్థాయిలో సమన్వయకర్తలను నియమించాలని నిర్ణయించడం ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విదానాలకు వ్యతిరేకంగా కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు ప్రణాళికను ప్రకటించింది. 12 తీర్మానాలను ఆమోదించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు , తీర్మానాలను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ముఖ్య అధికార ప్రతినిధి మల్లురవి, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ కుమార్ ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. పార్టీ పరంగా తీసుకోవాల్సిన కార్యాచరణను కూడా సమావేశంలో ఖరారు చేశారు. ఈ నెల 20 లోగా గ్రామ స్థాయిలో సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమించాలి. సెప్టెంబర్ 30 లోగా గ్రామం, బూత్ స్థాయిలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర కార్యాలయంలో పరిశోధన, విశ్లేషణ విభాగం, సాంస్కృతిక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మరొక కీలక నిర్ణయం తీసుకుంది. అంతేగాక రాహుల్ సందేశ్ యాత్రను మండల స్థాయిలో చేపడతారు.ఈ యాత్రను పురస్కరించుకుని రాహుల్ గాంధీసందేశంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, అప్రజాస్వామిక విధానాలపై చార్జ్ షీట్ విడుదల చేస్తారు. గడప గడపకు కాంగ్రెస్‌ను తీసుకువెళ్లి పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేస్తారు. పౌరసరఫరాల శాఖలోని లోపాలపై ప్రజలను చైతన్యం చేస్తారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చౌక ధరలు దుకాణాల ద్వారా 9 రకాల పంపిణీ చేసేవారమని, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోందని, ఈ విషయంపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సరకుల సంఖ్యను పెంచేలా చూడాలని నిర్ణయించింది. గుజరాత్‌లో రాహుల్ గాంధీపై జరిగిన దాడిని సమావేశం తీవ్రంగా ఖండించింది.

తీర్మానాలివే....

రాహుల్‌పై బీజేపీ గూండాలు జరిపిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించింది. ఉత్తరప్రదేశ్‌లో ఆక్సిజన్ అందక 60మంది బాలలు ఆస్పత్రిలో మృతి చెందడంపై సమావేశం సంతాపం ప్రకటించింది. బీజేపీ సర్కార్ ఆస్పత్రిలో ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచకపోవడంతోనే పసిబిడ్డల ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేసింది.సిరిసిల్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇసుకమాఫియాకు చెందిన లారీల కింద పడి చనిపోయినవారి మృతికి సంతాపం ప్రకటించింది. అదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్లకు చెందిన 8 మంది దళిత, బహుజనుల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించి చిత్రహింసలు పెట్టడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది.

నిర్బంధాన్ని ఎదిరిద్దాం

● అవినీతిపై పోరాడుదాం: ఉత్తమ్ పిలుపు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో నిర్బంధం కొనసాగుతోందని, దాన్ని ఎదిరించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సమాయత్తం కావాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమీషన్లే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని, ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీగెలుపే లక్ష్యంగా రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీగా అనుభవజ్ఞుడైన డాక్టర్ రామచంద్ర కుంతియాను అధిష్టానం నియమించిందని ఆయన నేతృత్వంలో 2019లో పార్టీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంచార్జీ కుంతియా, సహ ఇంచార్జి సతీష్ జార్కోలితో పాటు పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యేలు డీకే అరుణ, డాక్టర్ జే గీతారెడ్డి, ఎస్ఎ సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్‌కుమార్, ఎంపి రేణుకాచౌదరి, అనుబంధ సంఘాల చైర్మన్లు ఇతర కార్యాలయ బేరర్లు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి ముందు పార్టీ నేతలు ఒక్కొక్కరితో విడివిడిగా కుంతియా మాట్లాడారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. పార్టీ నాయకులు అందరినీ సమన్వయం చేసుకుని వెళ్లేలా చూడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ సూచించారు.మాజీ మంత్రి దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చంద్ర శేఖర్ తదితరులు కుంతియాతో భేటీ అయ్యారు.

దూకుడుగా వెళ్లండి

● పని చేసేవారికే పదవులు ● పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు ● కాంగ్రెస్ నేతలకు కుంతియా హెచ్చరిక



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: దూకుడుగా వెళ్లండి...పార్టీని పటిష్టం చేయండి....కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఇంచార్జీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో అనుబంధ సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క సమావేశాన్ని సమన్వయం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి , సహ ఇంచార్జీ సతీష్ జార్కోలి కూడా మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం రాత్రి 8.30 గంటల వరకు సాగింది. ఈ సందర్భంగా కుంతియా మాట్లాడుతూ, పార్టీకి జవసత్వాలు కల్పించడంపై దిశా,నిర్దేశం చేశారు. ముందుగా తన గురించి చెప్పారు. గడచిన 30 ఏళ్లుగా కార్మిక నాయకుడిగా ఉన్నానని, తమిళనాడు, పాండిచ్చేరి తప్ప అన్ని రాష్ట్రాల ఇంచార్జీగా , పరిశీలకుడిగా వ్యవహరించానని తెలిపారు. తనకు కుల,మతాలు లేవనీ, కాంగ్రెసే తనకు అంతా అని వ్యాఖ్యానించారు. మానవత్వమే తన మతమని, పార్టీయే తనకు తల్లి అని పేర్కొన్నారు. సోనియాగాంధీ నాయకత్వంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో పార్టీ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడుతోందని, సర్వమత సమన్యాయం కోసం కృషి చేస్తోందని చెప్పారు. రాహుల్ ఫార్ములా పార్టీ స్థితిగతులను పూర్తిగా మార్చివేస్తోందని, దేశవ్యాప్తంగా పార్టీ బలపడుతోందని చెప్పారు. తాను రాష్ట్ర ఇంచార్జీని అయినప్పటికీ సామాన్య కార్యకర్తనేనని,ఈ విషయం ముున్ముందు చూస్తారని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ సహ కార్యదర్శిగా రాష్ట్ర బాధ్యతలు దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలో పని చేసినందున రాష్ట్రం గూర్చి, పార్టీ నాయకులను గూర్చి తనకు బాగా తెలుసునన్నారు. సమస్యలుంటే పార్టీలోనే చర్చించుకోవాలని, బయట, మీడియాలో మాట్లా డుతామంటే సహించే ప్రసక్తిలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క , సీఎల్పీ నేత కె జానారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ గౌడ్, ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్న రేవుకు లక్ష ఎకరాలా?!

- బందరు పోర్టుకు ప్రభుత్వ సన్నాహాలు
- భారీగా భూ సమీకరణపై విమర్శలు
- సంరక్షించడం భారీ యజ్ఞమే
- పరిశ్రమలకు ప్రోత్సాహం మంచిదే
- గుప్పెట పట్టడం సమంజసం కాదు
- పోర్టు వరకే పరిమితమైతే శ్రేయస్కరం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: కొన్ని దశాబ్ధాలుగా ప్రజలు డిమాండ్ చేస్తున్న మేరకు బందరురేవుకు ప్రభుత్వం అన్ని సన్నాహాలు చేస్తోంది. అయితే రేవు పేరిట కృష్ణాజిల్లా తీరం వెంబడి లక్ష ఎకరాల భూముల్ని సమీకరించేందుకు చేస్తున్న ప్రయత్నం మాత్రం విమర్శల పాలౌతోంది. ఈ రేవు నిర్మాణ, నిర్వహణా బాధ్యతలను ప్రైవేటు సంస్థలకప్పగించాలని రాష్ట్రం నిర్ణయించింది. ఇందు కోసం సమీకరణ విధానంలో సమకూర్చుకున్న భూముల్లో కొంత భాగాన్ని ఆ సంస్థ అప్పగిస్తారు. నిర్ణీత కాల వ్యవధి వరకు నిర్వహణపై పెత్తనం కల్పిస్తారు. ఐదేళ్ళక్రితం అప్పటి కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ తరహాలోనే మరో భారీ రేవు నిర్మాణానికి ముందుకొచ్చింది. దీనికనుబంధంగా నౌకా నిర్మాణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. తగిన స్థల ఎంపిక కోసం ఓ కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటించింది. మూడ్నాలుగు ప్రాంతాల్ని పరిశీలించి తుదకు రెండు ప్రాంతాల్ని ఎంపిక చేసింది. నెల్లూరుజిల్లా దుగరాజ పట్నం, ప్రకాశం జిల్లా రామయ్యపట్నంలలో పోర్టు నిర్మాణానికి అన్ని అవకాశాలుంటాయంటూ ఈ కమిటీ తేల్చింది. ఈ మేరకు కేంద్రానికో నివేదిక కూడా సమర్పించింది. అయితే రెండింటిలో ఎక్కడ నిర్మించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఇష్టా ఇష్టాలకే వదిలేసింది. అక్కడే రాజకీయం పడగిప్పింది. అప్పటికే నెల్లూరు జిల్లాలో భారీ ఎత్తున ప్రైవేటు రంగంలో కృష్ణపట్నం పోర్టు నిర్మాణమౌతోంది. ఇదుండగా ప్రభుత్వ రేవును ఏర్పాటు చేస్తే దీని వ్యాపారం దెబ్బతింటుందని భావించిన రాష్ట్రం ప్రకాశం జిల్లా రామయ్యపట్నంలో రేవు ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించింది. ఆ వెనుకే ఈ ప్రతిపాదనపై అనేక కొర్రీలేసింది. స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ళకు తలొగ్గింది. భూసేకరణ విషయంలో సఫలం కాలేక పోయింది.చివరకు కేంద్రమిచ్చిన గడువులోగా భూముల్ని అప్పగించకపోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కేసింది. లేనిపక్షంలో విశాఖకు సరిసమాన రీతిలో మరో భారీ కేంద్రప్రభుత్వరేవు రాష్ట్రంలో ఏర్పాటై ఉండేది. దీంతో పాటు నౌకా నిర్మాణకేంద్రం కూడా వచ్చుండేది. తద్వారా వేలాదిమందికి ఉపాధి లభించుండేది. ఆ ప్రాంతంలో చిన్న తరహా పరిశ్రమ లు ఆవిర్భవించుండేవి.

ఈ అవకాశాన్ని అప్పటి ప్రభుత్వం చేజేతులా జారవిడుచుకుంది. కనీసం రాష్ట్రవిభజన తర్వాతేర్పాటైన కొత్త ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిపెట్టలేదు. పైగా మచిలీ పట్నంలో ఎప్పుడో బ్రిటీషీయులు నిర్మించగా ప్రస్తుతం శిథిలావస్తకు చేరుకున్న పోర్టు స్థానంలో భారీ నౌకాశ్రయ నిర్మాణానికి నడుంకట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇందుకోసం ఏకంగా లక్ష ఎకరాల భూముల సమీకరణే అనేక సందేహాలకు తావిస్తోంది. అమరావతి తరహాలోనే ముందుగా రైతులకు నయాపైసా చెల్లించకుండా ఈ లక్షఎకరాల్నిసమీకరించేందుకు ప్రతిపాదనలు సిద్దం చేసింది. సమీకరణతో పాటు భూములకేటాయింపునకు ప్రత్యేకంగా మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థను కూడా నెలకొల్పింది.

సహజంగా ఏ భారీ పోర్టుకైనా వెయ్యి నుంచి రెండువేల ఎకరాలు చాలు. కాకినాడలో నిర్మించిన డీప్‌వాటర్ పోర్టుకు 350ఎకరాల్ని మాత్రమే సేకరించిచ్చారు.ఆ తర్వాత 70ఎకరాల్ని ఇతర అవసరాల నిమిత్తం కేటాయించారు. అనంతరం సముద్రాన్ని కప్పెట్టి మరికొంత భూమిని పోర్టు సమీకరించుకుంది. అలాగే కృష్ణపట్నం రేవు కోసం 1315ఎకరాల్ని ఇచ్చారు. ఆ తర్వాత ఆ రేవు పరిసరాల్లో గోడౌన్లు, వ్యాపార సంస్థల నిర్మాణానికి మరికొంత భూమిచ్చారు. మొత్తం కలిసి ఇప్పటికి 4,553ఎకరాలు తేలింది. ఇకగంగవరం పోర్టు నిమిత్తం తొలుత 1700ఎకరాలు కేటాయించారు. ఆధారిత పరిశ్రమలు, గోడౌన్లకోసం మరో 1100ఎకరాలిచ్చారు. ఇలా ఇప్పుడు ఈ పోర్టు పరిధిలో మొత్తం 2800ఎకరాలున్నాయి. రాష్ట్రంలో విశాఖ తర్వాత భారీ పోర్టులు ఈ మూడే. కానీ వీటన్నింటికి మించి పోర్టు, అనుబంధ సంస్థల ఏర్పాటు కోసం ఏకంగా లక్ష ఎకరాల్నిప్పుడు మచిలీపట్నంలో సమీకరిస్తున్నారు. 2016మే 12న జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పోర్టుల వద్ద అనవసరంగా ఉన్న భూముల్ని ఇతర అవసరాలకు వినియోగించుకోవాలంటూ తీర్మానించారు. అప్పటికి దేశం మొత్తమ్మీద అన్నిరాష్ట్రాల్లోనూ పెద్దా చిన్నా అన్నిపోర్టుల్లో కలిపి మొత్తం 2.64లక్షల ఎకరాలున్నట్లుతేల్చారు. ముంబయ్ పోర్టు ట్రస్ట్‌కు741ఎకరాలున్నాయి. ఇందులో 70ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. ఈ భూముల్ని వెంటనే ఇతర అవసరాలకు లీజుకివ్వాలని కేంద్ర కేబినెట్ తీర్మానించింది. అలాగే జవహర్‌లాల్‌నెహ్రూ పోర్టు ట్రస్ట్ వద్ద 1376ఎకరాలున్నట్లు గుర్తించింది. ఇందులో ఖాళీగా ఉన్న 130ఎకరాల్ని ఇతర అవసరాలకు మళ్ళించాలని తీర్మానించింది. ముంబయ్, కోల్‌కత్తా, కాండ్లా మేజర్ పోర్టుల పరిధిలో సిబ్బంది, అధికారుల నివాస సముదాయాల నిర్మాణం నిమిత్తం 10వేల ఎకరాలుంచి మిగిలిన భూములన్నింటిని ఇతర అవసరాలకు మళ్ళించాలని నిర్ణయించింది. దేశంలోని మొత్తం రవాణాలో 61శాతం జరుగుతున్న 12భారీ రేవులైన కాండ్ల, ముంబయ్, జవహర్‌లాల్‌నెహ్రూ పోర్టు, మర్మగోవ, న్యూ మంగుళూరు, కొచ్చిన్, చెన్నై, ఎన్నోర్, చిదంబర్‌నార్, విశాఖపట్నం, పారాదీప్, కోల్‌కత్తా, హల్దియాల వద్దనున్న అదనపు భూములన్నింటిని కేంద్రం ఇతర అవసరాలకు మళ్ళించేసింది.

ఇలాంటి దశలో మచిలీపట్నం రేవు పేరిట లక్ష ఎకరాల సమీకరణపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. వాస్తవానికి ఈ రేవు నిర్మాణానికి వెయ్యిలోపు ఎకరాలు చాలు. అయితే మిగిలిన భూముల్ని పోర్టు ఆధారిత పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు కేటాయిస్తామంటూ ప్రభుత్వం చెబుతోంది. ఇందుకోసం ప్రభుత్వమే నేరుగా రైతుల్నుంచి ఇలా భూములు సేకరించి వాటికి కాపుకాయాల్సిన అవసరంలేదు. భవిష్యత్‌లో వచ్చే పరిశ్రమలు, వ్యాపార సంస్థల్ని దృష్టిలో పెట్టుకుని పోర్టు పరిధిలోని నిర్దేశిత ప్రాంతంలో భూ వినియోగచట్టంలో మార్పులు తెస్తే చాలు. అక్కడి భూముల్ని పోర్టు ఆధారిత వ్యాపార, పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు మాత్రమే వినియోగించాలంటూ నిర్దేశిస్తే ఖచ్చితంగా వాటినందుకే వినియోగించాలి. ఆసక్తిగల పారిశ్రామికవేత్తలు రైతులకు మంచిధర చెల్లించి ఈ భూముల్ని వారే కొనుగోలు చేస్తారు. అంతేతప్ప భారీ కార్యక్రమాన్ని నిర్దేశించుకుని లక్ష ఎకరాలభూముల్ని సమీకరించిన అనంతరం ఆ భూముల సంరక్షణ భారీ యజ్ఞమౌతుంది. గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో వాన్‌పిక్ సంస్థ సుమారు 35వేల ఎకరాల్ని ప్రత్యేక ఆర్థిక మండలి నిమిత్తం ప్రభుత్వం నుంచి పొందింది. ఆ తర్వాతిది అనేక వివాదాల్లో చిక్కుకుంది. అయితే ఈ సంస్థ యాజమాన్యానికి ఈ భూముల పరిరక్షణ కష్టసాధ్యమైంది. ఈ భూముల్లో ఎవరు కంచెలేయలేదని, నిర్మాణాలు చేపట్టలేదని ధృవీకరించుకోవడం కోసం ప్రత్యేకంగా హెలీకాప్టర్‌ను అద్దెకు తెచ్చుకుని దానిపై పర్యటిస్తూ పరీక్షించుకోవాల్సొచ్చేది. కాకినాడ సమీపంలో సుమారు 10,500 ఎకరాల సెజ్ ఏర్పాటైంది. ఇందులో పరిశ్రమలురాకపోయినా ఈ భూముల కోసం నెలకోసారి రైతులు, పారిశ్రామిక సంస్థల మధ్య ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. తరచూ పోలీసుల్ని పెట్టి ఈ భూముల్ని రక్షించుకోవాల్సొస్తోంది.

గతంలో ప్రభుత్వాలు మచిలీపట్నం పోర్టు మైటాస్ సంస్థకప్పగించాలని ప్రయత్నించాయి. అయితే వివిధ కారణాల్తో ఈ ప్రయత్నం ఫలించలేదు. దీంతో ఇప్పుడు మరో సంస్థను బరిలో దింపాయి. ఇంతవరకు ఆమోదయోగ్యమే అయినా చిన్న పోర్టు కోసం లక్ష ఎకరాల సమీకరణ ప్రతిపాదనను ఎవరూ జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రపంచంలోని ఎంతపెద్ద రేవుకు కూడా ఇంత భారీగా స్థలాలున్న దాఖలాల్లేవు. రేవునానుకుని రేవు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం సమంజసమేఅయినా ఇందుకోసం ఇన్ని ఎకరాల్ని ముందుగా సమీకరించి ప్రభుత్వం తన గుప్పెట పెట్టుకోవడం సమంజసంకాదు. దాన్ని రక్షించుకోవడానికి సైన్యం సాయం తీసుకోవాల్సొచ్చే ప్రమాదంకూడా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కేవలం పోర్టు నిర్మాణం వరకే పరిమితమైతే శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. నిర్దేశించిన భూముల వినియోగంలో మార్పులు చేసి నూతన మాస్టర్‌ప్లాన్‌ను అమల్లోకి తెస్తే ఆశించిన లక్ష్యం సహజసిద్దంగానే నెరవేరుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐటీఐఆర్ ఏమైంది!?



(మొదటిపేజీ తరువాయి)

ఆశించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు రూ. 3275 కోట్ల ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం 2013 నవంబర్ 13న నోటిఫికేషన్ కూడా జారీ చేసిందన్నారు. అయితే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదన్నారు. మూడేళ్లలో తెలంగాణలో ఐటీ రంగం అద్వితీయమైన ప్రగతిని సాధించిందని కేంద్ర మంత్రికి వివరించారు. రాష్ట్రం నుండి ఐటీ ఎగుమతులు దినదినాభివృద్ధి చెందుతున్నాయన్నారు. 2016 -17లో తెలంగాణ నుండి జరిగిన ఐటీ ఎగుమతుల వృద్ధి రేటు 13.85 శాతానికి పెరిగాయన్నారు. జాతీయ స్థాయి కంటే కూడా 4 శాతం అధికమని గుర్తు చేశారు. తెలంగాణ నుండి జరిగిన ఐటీ ఎగుమతుల విలువ 2013 -14లో రూ. 56,258 కోట్లు. 2016-17 నాటికి రూ. 85,470 కోట్లకు చేరుకున్నాయని మంత్రి కేటీఆర్ వివరించారు. 2013 నుండి 2016 వరకు ఐటీ రంగంలో ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు 3,23,396 నుండి రూ.4,31,891కి పెరిగిందన్నారు. టీఎస్ ఐపాస్ ఏకగవాక్ష విధానంలో పరిశ్రమలను స్థాపించడానికి సులభతరమైన అనుమతులు ఇవ్వడం ద్వారా పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఔత్సాహికులు ఉత్సాహంగా పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తున్నారని మంత్రి కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గూగుల్, ఆపిల్, అమెజాన్, సేల్స్ ఫోర్స్, డీబీఎస్, జెడ్ఎఫ్, ఊబర్ లాంటి సంస్థలు హైదరాబాద్ నుండి తమ కార్యకలాపాలు నిర్వహించడానికి ఆసక్తి కనబరుస్తున్నాయని వెల్లడించారు. పెట్టుబడులు పెట్టేందుకు, తమ సంస్థల కార్యకలాపాలను హైదరాబాద్ నుండి నిర్వహించేందుకు ఆసక్తి కనబరుస్తున్న వారి కోసం ప్రభుత్వం టీ.హబ్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అంకుర సంస్థలకు ఇది ఎంతగానో దోహదపడుతున్నదన్నారు. వేలాది సంస్థలు ప్రయోజనం పొందుతున్నాయని పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం కూడా ప్రభుత్వం టాస్క్ అనే సంస్థను ఏర్పాటు చేసి వివిధ రంగాల్లో యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదన్నారు. ఐటీ అనుబంధ సంస్థలను పెద్దఎత్తున ఆకట్టుకుంటుందని, అనేకసంస్థలుహైదరాబాద్‌లో నెలకొల్పబడుతున్నందున కేంద్రం నుండి సరైన తోడ్పాటు, సహకారం అందించవలసి ఉందని కోరారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు ద్వారా కేంద్ర సహకారాన్ని కోరుతున్నామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించి, అంగీకరించిన మేరకు ఐటీఐఆర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయవలసిందిగా కేంద్ర మంత్రిని కోరారు. ఐటీఐఆర్ పై అనేక సందేహాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నందున ప్రాజెక్టు ఏర్పాటు పైన స్పష్టత ఇవ్వాలని, కేంద్రం అంగీకరించిన మేరకు నిధులు విడుదల చేయాలని కోరారు. హైదరాబాద్ నగరం మరింతగా పెట్టుబడులను ఆకట్టుకోవడానికి ఐటీఐఆర్ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. ఆర్థికాభివృద్ధికి, ఉపాధికల్పనకు దోహదపడే ఈ ప్రాజెక్టు విషయంలో సానుకూలంగా స్పందించాలని కేటీఆర్ కేంద్ర మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

చేతులే శాపం!

(మొదటిపేజీ తరువాయి)

సైజులో ఉన్నాయి. దీంతో అతడిని అందరూ దెయ్యం పిల్లాడు అని పిలవడం మొద లు పెట్టారు. ప్రస్తుతం తారిఖ్ వయసు 12 ఏళ్లు. అతనితోపాటు ఆ వేళ్లు కూడా క్రమంగా పెరగుతూ వచ్చాయి. విచిత్ర వేళ్ల కారణంగా తన ఈడు పిల్లలెవరూ స్నేహం చెయ్యడానికి ముందుకు రావడం లేదు. దీంతో కుటుంబ సభ్యులే అతని ప్రపంచం.

చీత్కరింపులు.. బెదిరింపులు..

బొటన వేలి నుంచి చిటికెనవేలు కొన వరకు 12 ఇంచుల పొడవు ఉంది. ఇరుగుపొరుగు నుంచి బెదిరింపులు, చీత్కరింపులు ఎదుర్కొనాల్సి వస్తున్నది. చివరకు పాఠశాలలో అడ్మిషన్ కూడా నిరాకరించారు. పనికోసం తొలుత ఒక రెస్టారెంట్‌లో సప్లయర్‌గా చేరాడు. అయితే అతని వేళ్లను చూసిన కస్టమర్లు కొందరు భయపడగా, మరికొందరికి అసహ్యతా భావన కలిగింది. దీంతో రెస్టారెంటు యజమానికి తమ అభిప్రాయాన్ని చెప్పడంతో అతడిని పనినుంచి తొలగించారు. దీంతో అతడికి బిక్షాటనే జీవనాధారం అయింది.

నిత్యకృత్యాలకు సోదరుడి సాయం..

''చిన్నప్పటి నుంచి అతడి వేళ్లు అలాగే ఉన్నాయి. శరీరంతోపాటు వేళ్లు



కూడా పెరుగుతూ వచ్చాయి. వాళ్ల నాన్న బతికుండగా చికిత్సకోసం చాలా చోట్ల ప్రయత్నించాడు. ఆయన మరణించాక అతడిని పట్టించుకునే దిక్కేలేదు' అని అతడి మేనత్త పుష్ప వెల్లడించారు. నిత్యకృత్యాలకు తారిఖ్ పెద్దన్న హర్‌గ్యాన్ సాయం చేస్తుంటాడు. చిన్నప్పటి నుంచి సరైన చికిత్స చేయించక పోవడం వల్ల సమస్య అలాగే ఉండిపోయింది. దేవుడే అతని పట్ల కరుణ చూపిస్తాడు. ఎప్పటికైనా తిరిగి సాధారణ పిల్లల్లాగే తిరుగాడే రోజు వస్తుంది'' అని పుష్ప ఆశాభావం వ్యక్తంచేసింది. కాగా వైద్యం కోసం చాలా ఆసుపత్రులు తిరిగామని, ఏ డాక్టరూ తన తమ్ముడికి చికిత్స చేసేందుకు చొరవ చూపలేదని హర్‌గ్యాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. అందరూ సరైన వైద్యం చేయించండి నయం అవుతుంది అంటారే తప్ప, ఏ ఒక్కరూ సాయం చేసేందుకు ముందుకు రావడం లేదు. మా ఆర్థిక పరిస్థితులు గొప్ప వైద్యానికి సరిపడినవి కావు అని నిట్టూర్చాడు.

వేళ్లు కాదు.. పేదరికమే శాపం: తారిఖ్

''నా దుస్థితికి ఏదో శాపం కారణమని ప్రజలు అనుకుంటున్నారు. వాళ్లకేం తెలుసు ఇది వైద్యపరమైన సమస్య అని, చికిత్స చేస్తే తగ్గుతుందని. వాళ్లంతా దెయ్యం పిల్లాడు అంటూంటే బాధగా ఉంటుంది. రాన్రాను అలవాటై పోయింది. మొదట్లో నాకు కొందరు స్నేహితులు ఉండేవారు. క్రమంగా దూరమయ్యారు. ఇప్పుడు స్నేహితులనే వారెవరూ లేరు. నా చేతులు చూసి వాళ్లు భయపడుతున్నారు. నాకు చదువుకోవాలని ఉంది. కానీ ఒక్క స్కూల్లో కూడా అడ్మిషన్ ఇవ్వడం లేదు. చికిత్సకు సరిపడా మా వద్ద డబ్బులేదు. ఉండివుంటే తప్పకుండా నయం అయ్యేది' అని తారిఖ్ నిర్వేదం వ్యక్తంచేశాడు.

భాగ్యనగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

పంద్రాగస్టు నేపథ్యంలో పలుచోట్ల వాహనాల దారి మళ్లింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గోల్కొండ కోటలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాందేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట రోడ్డును మూసివేస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి తెలిపారు. వేడుకల నేపథ్యంలో గోల్కొండ, ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపు చేపట్టినట్లు తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలు హ్యాండ్ బ్యాగ్స్, బ్రీఫ్ కేసులు, కెమెరాలు, టిఫిన్స్ లాంటి వస్తువులు తీసుకురావద్దని సూచించారు. గోల్కొండ కోటలో జరిగే వేడుకల సందర్భంగా ఇలాంటి వస్తువులను తమ వెంట తెచ్చుకోవడం, పోలీసుల తనిఖీలలో పట్టుబడితే చర్యలు తప్పవని సీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు. ఇదే సందర్భంలో తనిఖీ చేసే పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



➡ ఏబీసీ స్టిక్కర్స్ ఉన్న వాహనాలను ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు వన్‌వే ఉంటుంది. పరేడ్ ప్రారంభానికి ముందు మాత్రమే రావాలి. ఆ తర్వాత తిరిగి అదే రూట్‌లో వెళ్లాల్సి ఉంది.

➡ సికింద్రాబాద్, బంజారాహిల్స్, మాసబ్ ట్యాంక్, మెహిదీ పట్నం వైపు నుంచి వచ్చే ఏబీసీ పాస్ కల్గిన వాహనా లను వయా రేతిబౌలి జంక్షన్, నాలా నగర్ జంక్షన్ నుంచి లెఫ్ట్ టర్న్ తీసుకుని బాలిక భవన్, ఆంధ్ర ఫ్లోర్ మిల్స్, ఫ్లైఓవర్, లంగర్‌హౌస్, టిప్పుఖాన్ బ్రిడ్జ్ రాందేవ్‌గూడ రైట్ టర్న్‌తో మాకై దర్వాజ నుంచి గోల్కొండ పోర్ట్‌కు చేరుకోవాలి.

➡ ఎ కారు పాస్ కల్గిన వాళ్లు గోల్కొండ కోట గేట్ ముందు మెయి న్ రోడులో ఫతే దర్వాజ రోడ్డులో, బి పాస్ కలిగిన వాహనాలను గేట్ ముందు నుంచి కింది వైపుకు వచ్చి (యూసుఫ్ హోటల్ ముందు), బస్‌స్టాప్‌లలో పార్కు చేయాలి.

➡ సీ కారు పాస్ హోల్డర్లు గోల్కొండ ఏరియా ఆసుపత్రి ప్రాంతంలో పార్కు చేయాలి

➡ డీఈఎఫ్ కారు పాసు కల్గిన వాహనదారులు సెవన్ టూంబ్స్ నుంచి షేక్‌పేట నాల, టోలిచౌక్ మీదుగా పోర్టుకు వెళ్లాలి. రామ్‌దేవ్ గూడ, మాకీ దర్వాజ రూట్లలో అనుమతించరు. డీ కారు పాస్ హోల్డర్స్ తమ వాహనాలు ఏరియా ఆసుపత్రి వద్ద ఆగి, పార్కింగ్ కోసం ప్రియదర్శినీ స్కూల్‌కు పంపించాలి. ఇ, ఎఫ్ కారు పాస్ కలిగిన వారు ఓవైసీ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో పార్కు చేయాలి.

➡ ఇ, ఎఫ్ వాహనాలు గోల్కొండ పోలీస్‌స్టేషన్ సమీపంలోని హాకీ, ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పార్కు చేసుకోవచ్చు.

సాధారణ ప్రజలు తమ వాహనాలను హుడా పార్కు, సెవెన్ టూంబ్స్ వద్ద పార్కు చేయాలి.

➡ వేడుకలు పూర్తయిన తర్వాత ఏబీసీ కారు పాస్ హోల్డర్స్ మాకై దర్వాజా, రాందేవ్‌గూడ వైపు నుంచి బయటకు వెళ్లిపోవాలి. డీ కారు పాస్ హోల్డర్స్ బంజారా దర్వాజ, సెవెన్ టూంబ్స్ వైపు వెళ్లాలి. ఇ, ఎఫ్ పాస్ హోల్డర్స్ జమాల్ దర్వాజ, గోల్ఫ్ క్లబ్, సెవెన్ టూంబ్సు, సాధారణ పౌరులు ఫతే దర్వాజ, జమలై దర్వాజ వైపు నుంచి వెళ్లాలి.

సికింద్రాబాద్‌లో...

పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకల సందర్భంగా తివోలి జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను బ్రూక్‌బండ్, ఎన్‌సీసీ జంక్షన్ వైపు మళ్లిస్తారు. ఈ ఆంక్షలు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రాజ్‌భవన్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

రాజ్‌భవన్ రోడ్డులో సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి సోమాజిగూడ రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు రోడ్డుకు రెండు వైపుల వెళ్లే సాధారణ వాహనాలు ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని సూచించారు.

వీవీఐపీలైన తెలంగాణ, ఏపీ సీఎంలు, డిప్యూటీ సీఎంలు, హైకోర్టు చీఫ్ జస్టిస్, శాసనమండలి ఛైర్మన్లు, స్పీకర్లు, కేంద్ర మంత్రులు, రెండు రాష్ట్రాల మంత్రులు.. వీరి వాహనాలు గేట్ నెం.1 నుంచి రాజ్‌భవన్‌లోకి వెళ్లి గేట్ 2 నుంచి బయటకు రావాలి. ఈ వాహనాలను రాజ్‌భవన్ లోపల పార్కు చేయాలి.

పింక్ కారు పాస్ కలిగిన ఇతర అతిథులు గేట్ నెం.3 నుంచి లోపలికి వెళ్లి, లోపలే పార్కు చేయాలి. అదే గేట్ నుంచి బయటకు వెళ్లాలి. వైట్ కారు పాసు కలిగిన వారు గేట్ నెం.3 నుంచి ప్రవేశించి వారి వాహనాలను ఎంఎంటీఎస్ పార్కింగ్ లాట్, ఎంఎంటీఎస్ సమీపంలోని పార్క్ హోటల్, మెట్రో రెసిడెన్సీ నుంచి నాసర్ వరకు సింగిల్ లైన్, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ఎదురుగా సింగిల్ లైన్‌లో పార్కింగ్ చేసుకోవాలి.

జెండా ఆవిష్కరణకు అతిథులు వీరే

జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం




హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు అన్ని జిల్లాలకు మంత్రులు, ఇతర రాష్ట్రస్థాయి ప్రజా ప్రతినిధులకు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ జీవో విడుదల చేశారు. రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించే రాజధాని కేంద్రంలోని గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

జిల్లా పేరు	అతిథి పేరు	హోదా
భూపాలపల్లి	మధుసూదనాచారి	శాసన సభాపతి
మహబూబాబాద్	బీపీ ఆచార్య	ప్రణాళికాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
వరంగల్ అర్బన్	కడియం శ్రీహరి	ఉప ముఖ్యమంత్రి
వరంగల్ రూరల్	పల్లా రాజేశ్వర్ రెడ్డి	మండలిలో ప్రభుత్వ విప్
జనగామ	బి.వెంకటేశ్వర్లు	మండలిలో ప్రభుత్వ విప్
రాజన్న సిరిసిల్ల	కె.తారక రామారావు	ఐటీశాఖ మంత్రి
కరీంనగర్	ఈటల రాజేందర్	ఆర్థిక మంత్రి
జగిత్యాల	కొప్పుల ఈశ్వర్	అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్ విప్
పెద్దపల్లి	పాటూరి సుధాకర్ రెడ్డి	మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్
ఆదిలాబాద్	జోగు రామన్న	అటవీ మంత్రి
నిర్మల్	ఇంద్రకరణ్ రెడ్డి	దేవాదాయ మంత్రి
మంచిర్యాల	నల్లాల వోదేలు	అసెంబ్లీలో ప్రభుత్వ విప్
అసిఫాబాద్	కె.స్వామిగౌడ్	శాసనమండలి చైర్మన్
సిద్దిపేట	టి.హరీష్‌రావు	జలవనరుల మంత్రి
మెదక్	పద్మా దేవేందర్ రెడ్డి	అసెంబ్లీ ఉప సభాపతి
సంగారెడ్డి	బీఆర్ మీనా	రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
నిజామాబాద్	పోచారం శ్రీనివాసరెడ్డి	వ్యవసాయ మంత్రి
కామారెడ్డి	గంపా గోవర్ధన్	అసెంబ్లీలో ప్రభుత్వ విప్
మహబూబ్‌నగర్	సి.లక్ష్మారెడ్డి	ఆరోగ్య మంత్రి
నాగర్‌కర్నూల్	జూపల్లి కృష్ణారావు	పంచాయతీరాజ్ మంత్రి
వనపర్తి	నిరంజన్ రెడ్డి	వైస్ చైర్మన్ ప్లానింగ్ బోర్డు
గద్వాల	తలసాని శ్రీనివాస్ యాదవ్	పశు సంవర్ధక మంత్రి
ఖమ్మం	తుమ్మల నాగేశ్వర్ రావు	రోడ్లు, భవనాల మంత్రి
కొత్తగూడెం	టి.పద్మారావు	ఆబ్కారీ మంత్రి
నల్గొండ	నేతి విద్యాసాగర్	శాసనమండలి డిప్యూటీ చైర్మన్
సూర్యాపేట	జగదీష్ రెడ్డి	ఇంధనశాఖ మంత్రి
యాదాద్రి	గొంగిడి సునీత	అసెంబ్లీలో ప్రభుత్వ విప్
వికారాబాద్	పి.మహేందర్‌రెడ్డి	రవాణ శాఖ మంత్రి
రంగారెడ్డి	మహమూద్ అలీ	ఉప ముఖ్యమంత్రి
మేడ్చల్	నాయిని నర్సింహారెడ్డి	హోంమంత్రి

తెలంగాణ భాషా స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- నిజామాబాద్ ఎంపీ కవిత
- బాసరలో ఘనంగా కవి సమ్మేళనం



నిర్మల్, కెఎన్ఎన్ : తెలంగాణ భాష, యాస విశిష్ఠతను అంతటా చాటేందుకు, భావితరాలకు స్ఫూర్తిని అందించేందుకు అందరూ కృషి చేయాలని, తెలుగు భాష పరిరక్షణకు పాటు పడాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాప కురాలు, నిజామాబాద్ ఎంపీ కవిత అన్నారు. గొల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తితో కవితాంజలి రాష్ట్ర వ్యాప్త కవి సమ్మేళనం నిర్వహిస్తున్నా మన్నారు. ఆదివారం బాసరలోని జీఎస్ గార్డెన్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువతకు తెలంగాణ చరిత్రను తెలియజేయడంలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా కాళోజీ యాదిలో కవితాంజలి కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ జాగృతి ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ మరోవైపు తెలంగాణ యాస అస్థిత్వాన్ని కాపాడే బాధ్యతను తీసుకుందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని కవులు, కళాకారులు తమ కళలు, గళాలతో ముందుకు నడిపారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొందరూ బతుకమ్మ పాటలు, ఆటలు ఎందుకని ప్రశ్నించడం శోచనీయమన్నారు. మరుగుపడిపోతున్న ప్రతీ కళను తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకే తెలంగాణ జాగృతి పలు కార్య క్రమాలను నిర్వహిస్తోందన్నారు. సురవరం ప్రతాపరెడ్డి మొదలుకొని ఎందరో కవులు తమ కవితలతో ప్రజలను అలరించడమే కాక ప్రజలను చైతన్యపరి చారన్నారు. తెలంగాణ నుడికారాన్ని పరిచయం చేయడం సంతోషాన్ని కలిగించిం దన్నారు. తెలంగాణ భాష మరు గునపడి పోకుండా ఉద్యమంలా భాషను కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ క్షేత్రానికి త్వరలోనే సీఎం కేసీఆర్ వచ్చి అభివృద్ధి పనులు ప్రారంభి స్తారని ఎంపీ కవిత అన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పరచు కోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం తెలంగాణ యాసతో ఒక నిఘంటువును రూపొందించే చర్యలు చేపట్టిందన్నారు. జాగృతి ఆధ్వర్యంలో 31 జిల్లాలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశామని, ఇప్పటికే నిర్మల్ జిల్లాతో 10 జిల్లాల్లో ఈ కార్య క్రమం పూర్తి చేయడం జరిగిందన్నారు. అన్ని జిల్లాలోల ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించబోతోందన్నారు. అనంతరం జిల్లాలోని 60 మంది కవులు, కళాకారులను ఎంపీ కవిత ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్య క్రమంలో తెలంగాణ సాహితి అకాడమిక్ చైర్మన్ సిధా రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్ రావు, తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి, బాసర సర్పంచ్ శైలజ జిల్లాలోని కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

కవిత్వ సూత్రాలు ఏవి?

నేడు కవిత్వం రాసే వారికి చాలామందికి కవితా నిర్మాణం గురించి తెలియదు. ఇప్పటికీ ఉగాది కవితను ప్రారంభిస్తూ అమ్మా ఉగాది...రావమ్మా ఉగాది ...అంటూ కవితను ప్రారంభిస్తారు. ఉగాది వస్తే కోకిల వస్తుందని...మావిడాకులు ఉంటాయని పచ్చడి...చేస్తామని...ముందే తెలిసిపోతుంది గనుక...వాడి కవితను వినడానికి...ఎవరూ ఆసక్తి కనబరచరు. అందుకే గొప్ప కవి అనిపించుకోవాలంటే బాగా కవిత్వం చదవాలి అన్నారు హెలెన్ గార్డనర్. ఆమె కన్నా ఇంకా ఇలియట్ కవిత్వాన్ని బాగా చదివి జాతిజనులు వాడుకునే భాషనే ఆశ్చర్యం కలిగించే విధంగా టి.యస్.ఇలియట్ కవిత్వీకరించాడని ప్రొఫెసర్ మేధీసన్ అంటారు.

కవిత్వమంటే ఏమిటో కవిత్వాన్ని ఎవరెవరు ఎలా నిర్వచించారో, ఇంతకు ముందే తెలుసుకున్నాం. కవిత్వంలో ఎలాంటి లక్షణాలు ఉండాలి? కవిత్వపు భాష ఎలా ఉండాలి మొదలైన విషయాలు గత కవిత్వం-డిక్షన్ వ్యాసాల్లో కొంత వివరించాను. ఇప్పుడు కవిత్వం ఎలా రాయాలి? ఎలాంటి సూత్రాలు లేదా జాగ్రత్తలు పాటించాలి? రూపనిర్మాణం ఎలా ఉండాలి? ఎలాంటి భావ చిత్రాలు పదచిత్రాలు ఉపయోగించాలి. వస్తువు రూపం లేదా శిల్పం ఎలా ఉండాలి? ఇప్పుడు తెలుసుకుందాం. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ టెక్నికల్ పదాలు వాటి నిగూఢార్థాలు ఎందుకులే అనుకుంటే కొత్తగా కవిత్వం రాసే కవులు కవితలు రాసే ముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలి...అవి..

1. కవితను దేనిపై (వస్తువు)రాయాలో ముందు నిర్ణయించుకోవాలి.
2. వస్తువుకు తగిన రూపం (శిల్పం) ఏదో నిర్ణయించుకోవాలి.
3. కవిత ఎత్తుగడ ఎలా ఉండాలో తెలుసుకోవాలి. విసుగు పుట్టించే వాక్యంతో కవితను ప్రారంభించరాదు.
4. కవితలో విషయం లేకున్నా ఊరికే పొడిగించరాదు.
5. విషయాలన్నీ ఒకే కవితలో చెప్పాలన్న తపన అక్కరలేదు.
6. చెప్పే విషయానికి...ప్రతీకలు చేర్చాలి...కవితకు ప్రతీకలే అందం.
7. ప్రతీకలు లేకున్నా మంచి భావనాబలంతో లేక అభివ్యక్తితో కవితలు రాయవచ్చు.
8. కవితా పాదాలు..పొడుగ్గా ఉండాలా? చిన్నవిగా ఉండాలన్నది కవి నిర్ణయించుకోవాలి.
9. పొడుగాటి వాక్యాలకన్నా చిన్న వాక్యాల్లో కవితను నిర్మించడం మంచిది.
10. భాష ఎంత సరళంగా ఉంటే అంత మంచి కవిత అవుతుంది.
11. కవితను ఎక్కడ ఎలా ఆపాలో కవికి తెలిస్తే మంచిది.
12. కవితలో ఏమి చెప్పబోతామో పాఠకుడికి ముందే తెలిసిపోరాదు. క్లూ ఇవ్వకూడదు.
13. అక్షర రమ్యత, అంత్య ప్రాసల కోసం ప్రాకులాడరాదు.
14. కవిత ప్రారంభం ఎంత ముఖ్యమో ముగింపు అంతే ముఖ్యం. అంటే సర్‌ప్రైజ్ కలిగించాలి.
15. పద్య ఛందస్సు, అనవసరమైన అలంకారాలు గ్రాంధిక భాష, పాతక్రియా పదాలు వదిలివేయాలి.

ఇలా కొత్తగా కవిత్వం రాసే కవులు కవితలు రాసే ముందు ఆధునిక వచన కవితా నిర్మాణం పట్ల జాగ్రత్తపడాలి. చాలామంది కవులు కవితల్లో వాడే భాష కృతకంగా ఉంటుంది. కొత్త డిక్షన్ సృష్టించుకోవడంలో భాష ప్రధానమయింది. ఆ విషయం గుర్తించాలి. కవితలో చెప్పబోయే విషయాన్ని ముందుగా తెలిసిపోయేలా శీర్షికలు పెడతారు. ఇక కవితలో ఏముందో పాఠకులు ఊహించుకుని వీడేం చెబుతాడులే వీడి బొంద అనుకుని ఆ కవితను చదవరు. ముఖ్యంగా తోటి కవులు చదవరు. తమ కవితే గొప్పదని చాలామంది కవులు భావిస్తారు. అందరికంటే కవులకే ఇగో ఎక్కువగా ఉంటుంది. అందుకే కవిసమ్మేళనాల్లో తమ కవితను చదివి వెళ్లిపోతారు. నేడు కవిత్వం రాసే వారికి చాలామందికి కవితా నిర్మాణం గురించి తెలియదు. ఇప్పటికీ ఉగాది కవితను ప్రారంభిస్తూ అమ్మా ఉగాది...రావమ్మా ఉగాది ...అంటూ కవితను ప్రారంభిస్తారు. ఉగాది వస్తే కోకిల వస్తుందని...మావిడాకులు ఉంటాయని పచ్చడి...చేస్తామని...ముందే తెలిసిపోతుంది గనుక...వాడి కవితను వినడానికి...ఎవరూ ఆసక్తి కనబరచరు. అందుకే గొప్ప కవి అనిపించుకోవాలంటే బాగా కవిత్వం చదవాలి అన్నారు హెలెన్ గార్డనర్. ఆమె కన్నా ఇంకా ఇలియట్ కవిత్వాన్ని బాగా చదివి జాతిజనులు వాడుకునే భాషనే ఆశ్చర్యం కలిగించే విధంగా టి.యస్.ఇలియట్ కవిత్వీకరించాడని ప్రొఫెసర్ మేధీసన్ అంటారు. దీన్ని బట్టి మనం తెలుసుకోవాల్సిందేమిటంటే...యువకవులు గొప్పకవులు రాసిన కవిత్వాన్ని చదవాలి...వారు కవితను ఎలా ప్రారంభించారు. ఎలాంటి ప్రతీకలు వాడారు. భాష ఎలా ఉంది? కవితా పాదాల కూర్పులో ఎలాంటి మెలకువలు పాటించారు. పదబంధాలను ఎక్కడ మెరిపించారు. అభివ్యక్తిలోని కొత్తదనం ఏమిటి? గమనించాలి. అప్పుడే కవితను ఎలా రాయాలో తెలుసుకుంటారు. కవితలో భావచిత్రాలు ఉండాలి. ఎందుకంటే భావచిత్రాలలో భావం, ఇంద్రియానుభూతి కలగలిసే ఉంటాయి. ఒక విషయాన్ని ఇతర విషయాలతో పోల్చి చూడటం ద్వారా భావచిత్రాలు ఏర్పడతాయి. అలాగే పదచిత్రాలు...ఓ బెంగాలి కవి నిప్పు పూజార్లు అన్న సరికొత్త పదబంధాలు వాడినప్పుడు నివ్వెరపోయారు. అలాగే కవిత్వంలో కొత్త ఇమేజస్ వాడటం ఎంతో ముఖ్యం. అలా శేషేంద్ర వాడిన ఇమేజెస్ చూసి శ్రీశ్రీ నివ్వెరపోయి...ధుమాగా ఉంది ఇమేజి.. రమారమి కవుల సమాధి...అంటూ శేషేంద్ర ప్రతిభను అభినందిస్తూ కితాబిచ్చారు. అంతేకాదు శ్రీనాథుని క్రీడల్లో...అల్లసాని వాడల్లో కూడా దొరకని పదచిత్రం...విచిత్రం కడు పవిత్రం అంటూ శేషేంద్ర కవిత్వాన్ని శ్రీశ్రీ మెచ్చుకున్నారు. కొత్తగా కవిత్వం రాసే కవులు పదచిత్రాలు భావచిత్రాలు...పాతబడినవి వాడకుండా కొత్తవి సృష్టించుకోవాలి. అలాగే కవితా వాక్యాలు ఎలా మొదలుపెట్టాలి? కవితను ఎలా నిర్మించుకుంటూ పోవాలి? ఎక్కడ విరుపులు విరియాలి. ఎక్కడ భావాన్ని పదచిత్రాలతో మెరిపించాలి అన్న విషయాన్ని బాగా ఆలోచించాలి. ఎందుకంటే కవి సృజించే ఇమేజరీ మెస్మరిజంలో పాఠకుడు కొట్టుకుని పోతూ ఆ కవిత్వంలో తన జీవితానుభవాలను చూసుకుంటూ అనుభూతి చెందుతాడు. ఉద్వేగం పొందుతాడు. ఉల్లాసం చెందుతాడు. మెల్లగా ఊపిరి పీల్చుకుంటాడు. మంచి కవితాత్మకమైన భావ చిత్రం కాలం మారుతున్నా పాతబడదు. ఇటీవల ఫేస్‌బుక్‌లు, అంతర్జాల పత్రికలు, కవిత్వాన్ని ప్రోత్సహించే గ్రూప్‌లు వచ్చాక కొత్త కవులు ఉత్సాహంగా కవితలు రాస్తుంటారు. ఎవరైనా లైక్‌లు కొడితే మురిసిపోతారు. కామెంట్లు పెడితే ఆనందంతో పరవశిస్తారు. ఇంకాస్త మీ కవిత బాగుందని, నోవర్డ్స్ అని పొగిడితే ఎగిరి గంతేస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. కాని వారి కవితలు ఎదుటి వ్యక్తుల హృదయాలను ఎంత వరకు టచ్ చేస్తున్నాయన్నది ఆలోచించుకోవాలి. నిజంగానే కవులను ప్రోత్సహించడం మంచిది. అయితే అప్పుడు కవులు మరింత బాధ్యతగా కవితా నిర్మాణం చేపట్టాలి. ముఖ్యంగా కవిత్వం-డిక్షన్‌లో రూపం లేదా శిల్పానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వస్తువును ఎలా వ్యక్తీకరిస్తామో ఆ విధానాన్నే రూపం అంటారు. కవితా రూపం సులభంగాను, స్పష్టంగాను, ఆకర్షణీయంగాను ఉండాలి. అలా ఉండాలంటే అనవసరమైన మేకప్ వేస్తే ఎబ్బెట్టుగా ఉన్నట్టు కవితకు వస్తువును ఎంతవరకు ఎలివేట్ చేయాలో అంతకు మించిన అలంకారాలతో ముస్తాబు చేస్తే, రూపం దెబ్బ తింటుంది. భావం రసాభాసమైపోతుంది. ఇక్కడ వస్తువును బట్టి రూపం ఉండాలి? రూపాన్ని బట్టి వస్తువు ఉండాలా? లేదా రూప(శిల్ప) సాధనతో వస్తువును లాక్కెల్లాలా? అన్నది కవి భావనా బలాన్ని మేధస్సును, వస్తువు పట్ల అతనికున్న స్పందనను, తీవ్రమైన ఆపేక్షను, నిబద్ధతను బట్టి ఉంటుంది. ఒక్కోసారి కవితను రాస్తూ పోతున్నప్పుడు మనకు తెలియని మంచి భావాలు...ప్రతీకలు వచ్చిపడతాయి...తానొకటి తలచిన దైవమొకటి తలచెను అన్నట్టు కవి ఏదో రాయాలని పోతే అది మరేదో కవితై పోతుంది. అయ్యేదేదో బాగా అవ్వనూ వచ్చు. మనకే అసహ్యం కలిగే విధంగానూ మారనూ వచ్చు...అందుకే కొత్త శిల్పం కొత్త వస్తువు నుండి పుట్టుకొస్తుంది అంటాడు క్రుషర్నిక్ అన్న రష్యన్ రూపవాది. ఒక్కోసారి రూపమే వస్తువును నిర్ణయిస్తుందని కూడా చెప్పారు. ఇక్కడ కవిత్వం డిక్షన్ కవి వస్తువును కవిత్వం చేసే ప్రక్రియలో ప్రదర్శించే నైపుణ్యం బట్టి ఉంటుంది. అందుకే కొత్తగా కవిత్వం రాస్తున్న కవులతో పాటు చాలా కాలంగా కవితలు రాస్తున్న పెద్ద కవులు కూడా కవితను రాశాక తామే పాఠకుల స్థాయిలోకి వెళ్లి తమ కవితలో ఉన్న లోపాలేమిటో పరిశీలించుకోవాలి. పదేపదే వాక్యాలను మార్చుకుంటూ కొత్త ఇమేజెస్ వేయడానికి ప్రయత్నించాలి. భాషలో వాడిన పదాలకన్నా సులభమైన పదాలు ఉన్నాయా? తెలుగు పదాల స్థాయిలో ఇంగ్లీషు పదాలు లేదా మరే ఇతర భాషా పదాలు వాడాల్సిన అవసరం ఉందా? ఒకవేళ అలా వాడితే అంతకన్నా పొయెటిక్ బ్యూటీ వస్తుందా? అని ఆలోచించుకోవాలి. ఇతర భాషా పదాలు వాడటంలో తప్పులేదు. రైలు, బస్సు, ఇంజన్,



కవిత్వం-డిక్షన్-3

రైల్వేగేటు, బస్సు స్టేషన్ ఇలాంటి పదాలకు బదులుగా తెలుగు లేక సంస్కృత పదాలు పదబంధాలు వాడటానికి ప్రయత్నించడం వృథా ప్రయాసే అవుతుంది. అందుకే నా వచన కవితల దుడ్డుకర్రల్తో పద్యాల నడుం విరగ్గొడతాను అన్న పట్టాభి తన కవిత్వ నిర్మాణంలో రూపానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఫిడేల్ రాగాల డజన్ కవితా సంపుటిని వెలువరించాడు. ఆ పుస్తకానికి ముందు మాట రాస్తూ శ్రీశ్రీ 'విచిత్రమే సౌందర్యం'. సౌందర్యం రూపవాదానికి చెందినదని చెప్పారు అంటే...కవి కవితా నిర్మాణంలో ఏదో సౌందర్యం కనిపించాలని ఆ సౌందర్యమే రూపం లేదా శిల్పమని మనం అర్థం చేసుకోవాలి. అలాంటి మంచి కవితా రూపం సాధించాలంటే మనం రాసిన కవితలను ఓపికున్నంతవరకు సరిదిద్దుకోవాలి. మహాకవులు రచయితలంతా అదే పనిచేశారు. టాల్‌స్టాయ్ 'యుద్ధము-శాంతి' నవలను 19సార్లు అభివృద్ధి పరుస్తూ తిరిగి రాశాడట. మనం అలా కవితను తిరిగి రాస్తామా? రాస్తే...ఫేస్‌బుక్‌లో లైక్‌ల సంగతేమిటి? ఏదో ఒక కవితను ఎఫ్.బి.లో త్వరగా పెట్టాలిగా. దానికి అంత శ్రమించాలా? అనుకుంటే ఫలితం కూడా అలాగే ఉంటుంది. కవిత్వం తెలిసిన వారు అలాంటి కవితలు చూసి నవ్వుకుంటారు. ఇక ఈరోజు కవిత్వం డిక్షన్‌లో కవితను ఎలా నిర్మించాలో ప్రముఖ కవి ప్రసాదమూర్తి కవితలో చూద్దాం. ఇంతకుముందే ప్రసాదమూర్తి నాన్న చెట్టు, మాట్లాడుకుందాం, కలనేత, చేనుగట్టు పియానో లాంటి కవితా సంపుటాలు వెలువరించారు. కవిత్వాన్ని ఏదో కీర్తికోసం కాకుండా ఆర్తితో రాసే మంచి కవి అతడు. ఇక్కడ మంచి కవి అని ఎందుకంటున్నానంటే...కవితకు శిల్ప సొగసులద్దడంలో ఆయన అనుసరించే కవితానిర్మాణ సూత్రాలు వెరైటీగా ఉంటాయి. ఆయన కవిత్వాన్ని కొత్త డిక్షన్ తో మెరిపిస్తాడు. కవిత్వం రూపం గురించి మాట్లాడాలంటే ప్రసాదమూర్తి కవిత్వం గురించి మాట్లాడాల్సిందే. కొందరు ప్రతీకలతోనే కవితలు రాస్తారు. మరికొందరు ముసలమ్మకు పట్టుచీర కట్టించి, పాతకాలం నాటి నగలు వేసి, బోసినవ్వుతో నవ్వితే బాగుంది చూడమన్నట్టు తమ కవితకు అర్థంపర్థం లేని అలంకారాలు తొడిగించి ముస్తాబు చేస్తారు. కాని ప్రసాదమూర్తి అక్షరాలను పొదుపుగా వాడి కొత్త ఇమేజెస్‌తో అభివ్యక్తి నవ్యతతో శిల్పాన్ని తళుక్కుమనిపిస్తారు. అన్ని దూరాలూ మైలురాళ్లతో కొలవలేం/ దూరానికి ఏది బోర్డింగ్ పాయింటో/ ఏది డెస్టినేషన్ తెలీకుండానే/ఎక్కడనీ ఎక్కడనీ టికెట్ కొనుక్కుంటావ్? అంటూ కవితను ప్రారంభిస్తారు. కవితా నిర్మాణంలో ఇదో టెక్నిక్. కవి చెప్పబోయే వస్తువు దూరం అని తెలిసినా ఏం చెప్పబోతున్నాడో...తెలియదు. పైగా దూరాలు సహజంగా మైలురాళ్లతో కొలుస్తాం. కాని ఈ కవి ఏ దూరం గూర్చి చెప్పబోతున్నాడో తెలియక ఆసక్తితో కవితను చదువుతాం. పైగా దూరానికి ఏది బోర్డింగ్ పాయింటో ఏది డెస్టినేషనో తెలీకుండానే అనటంతో ఓహో...ఇందులో ఏదో తిరకాసు ఉందని భావిస్తాం. ఎక్కడనీ ఎక్కడనీ టికెట్ కొనుక్కుంటావ్ అనటంతో మరింత ఆసక్తి కలుగుతుంది. ఇదే కవితా నిర్మాణంలో ఉన్న మెస్మరిజం...కవితా పాదాలు పఠిత మనసులో క్యూరియాసిటీని రేకెత్తించాలి. ఇక్కడ బోర్డింగ్, డెస్టినేషన్ అన్న ఆంగ్ల పదాల వాడటంలోనే కవి కవితా నిర్మాణం పట్ల జాగరూకతతో ఉన్నాడని అర్థమవుతుంది. తెలుగు పదాలు వాడితే పొయెటిక్ బ్యూటీ పోతుంది.


నవ్వే రెండు పెదాల మధ్య/ చూసే రెండు కళ్ల మధ్య/ పలకరింపుల నాలుగు మాటల మధ్య/ ఇచ్చిపుచ్చుకునే శరీరాల మధ్య/ ఏదూరం ఏ రంగులో ఉంటుందో/నీకూ తెలీదు నాకూ తెలీదు...అంటూ సెకండ్‌స్టాంజాలో అసలు వస్తువును కవితలో ప్రవేశపెడతాడు. అంతవరకు ఏ దూరాల గురించో పాఠకులకు తెలియదు కాబట్టి ఇప్పుడు ఒక మూడ్‌లోకి వారిని లాక్కొస్తాడు. అంతేకాదు మరింత ఆసక్తిని పెంచేందుకా అన్నట్టు పెదాల మధ్య,కళ్ల మధ్య, మాటల మధ్య, ఏ దూరం ఏ రంగులో ఉంటుందో నాకు తెలియదంటారు. ఇక్కడ దూరాన్ని రంగుతో ఉపశమింపజేశాడు. అంటే రంగును సిమిలీగా వాడుకున్నాడు కవి. నవ్వుల్లో, కళ్లలో, మాటల్లో, శరీరాల్లో ఏ దూరం ఏరంగులో ఉంటుందో నాకు తెలీదు నాకు తెలీదు అంటూ రెండు సార్లు అనడంలోనే...కవితను ధ్వనిపూర్వకమైన శిల్పంగా మార్చారు. కవితా నిర్మాణంలోనే ఇదో టెక్నిక్ నాకూ తెలీదనటంలోనే కవికి తెలుసని పాఠకులకు తెలిసిపోతుంది. అంతేకాదు కవి ఏం చెప్పబోతున్నాడోనని థర్డ్‌స్టాంజాలోకి మనసు లాగుతుంది. అంతరిక్షాన్ని దగ్గర చేసుకున్నంత సుళువుగా/ఆత్మల్ని దూరం చేసుకున్నాం...అంటూ ఒక్కసారిగా అసలు విషయం బయటపెడతాడు. ఇక్కడ కవులను భావచిత్రాల ద్వారానే అర్థం చేసుకుంటామన్న విషయాన్ని మనం మరచిపోరాదు. అంతరిక్షాల్ని దగ్గర చేసుకోవడం అంటే ఇవాళ శాస్త్ర సాంకేతికాభివృద్ధితో చంద్రమండలం పైకి వెళ్లి వస్తున్నాం. అది సుళువు. కాని ఆత్మల్ని అంత సుళువుగా దగ్గర చేసుకోలేం. అందుకే దూరం చేసుకున్నాం అంటారు కవి. మాటిమాటికీ మారే ఆత్మల్ని దగ్గర చేసుకోవడం కష్టమే మరి. ఇక్కడ మొదటి రెండు స్టాంజాల్లో చెప్పిన విషయంను అంతరిక్షాన్ని దగ్గరి చేసుకున్నంత దృశ్యంతో పోల్చి కవితను అర్థవంతంగా మెరిపిస్తారు. తర్వాత దూరాన్ని సముద్రమో...ఎడారో...కారడవో...హిమాలయమో...అంటూ ఇమెజెస్‌తో ముస్తాబు చేస్తూ దూరం రూపమేంటో తెలీకుండా నిన్ను ఏఅస్త్రంగా సంధించి దూరాన్ని ధ్వంసిస్తావ్ అంటూ కవితనంతా తన భావనా బలంతో ముందుకు నడిపించుకుంటూ వెళతారు.

చర్మం సంచికి చిల్లుపెట్టి నెత్తురు ఖాళీచేయడమంత ఈజీకాదు/మనసుల మధ్యలో దూరాన్ని చెరిపేయడం...అంటూ మళ్లీ దూరాన్ని (వస్తువు) మరో కోణంలో దర్శించి ఆశ్చర్యం కలిగించే విధంగా అభివ్యక్తీకరిస్తాడు. చర్మం సంచి పదబంధం ఎంత బాగుందో కదా...పోలిక కొత్తగా లేదూ...అంతేకాదు దేహానికి చిల్లులు పెట్టడమంటే హత్య చేయడం...దాన్నే నెత్తురు నెత్తురు ఖాళీచేయడమంటూ అభివ్యక్తి నవ్యతతో మనల్ని విస్మయపరుస్తారు. హత్య చేసే చర్మం సంచిలో నెత్తురు ఖాళీచేయవచ్చుగాని మనసుల మధ్య దూరాన్ని చెరిపేయడం ఈజీకాదు అనడంతో పాఠకులు గాఢానుభూతికి లోనై భారంగా ఊపిరి పీల్చుకుంటారు. కవి కన్ను ఫ్రిజం కవిత్వం మెస్మరిజం అంటే ఇదే కాబోలు. ప్రసాదమూర్తి దార్శనిక కవి. తన చూపులు ప్రసరించిన వస్తువులనే అందమైన ఇమేజస్‌గా మార్చేస్తాడు. ఇక కవితకు ముగింపు చాలా ముఖ్యం. అది సర్‌ప్రైజ్‌గా ఉండాలని చెప్పుకున్నాం. ప్రసాదమూర్తి కవిత ముగింపు దశకు వెళ్లే కొలది./భౌతికమో...ఆత్మికమో...ఆధ్యాత్మికమో/దూరం ఏమో కానీ/నిన్ను నేనూ..నన్ను నువ్వూ/చూస్తున్నది మాత్రం నిజం కాదు/ ఇంత దగ్గరలోనూ మనకు తెలియని దూరం ఏదో ఉంది/కొత్త ఖండాలు కాదు...ఇప్పుడు డిస్కవరీ ఆఫ్ డిస్టెన్స్ కావాలి/రా.../నిన్ను నా భుజం మీద వేసుకుని/నన్ను నీ భుజం మీద వేసుకుని/బయల్దేరుదాం...అంటూ కవితను ముగిస్తారు. ఇద్దరి మధ్య ఉన్న దూరాన్ని కవి పసిగట్టాడు. దాన్ని ఒక వస్తువుగా ఎంపిక చేసుకున్నాడు. అనేక రకాల అభివ్యక్తుల రూపసామాగ్రితో...కవితను నిర్మించారు. దూరాలు మైలురాళ్లతో కొలవలేమని ప్రారంభించి...కొత్త ఖండాలు కాదు. ఇప్పుడు డిస్కవరీ ఆఫ్ డిస్టెన్స్ కావాలంటూ అందుకు ఒకరి భుజాలపై మరొకరిని వేసుకుని బయల్దేరుదాం అంటూ కవితను ముగించడంలోనే ప్రసాదమూర్తి శిల్ప నైపుణ్యం ఏమిటో తెలిసిపోతుంది. ఇక్కడ రూపవాది రష్యన్ క్రుషర్నిక్ అన్నట్టు ఫామ్ థజ్ డిటర్మెన్స్ కంటెంట్ అన్నట్టు కవితా వస్తువును రూపమే నిర్ణయిస్తుందన్న విషయాన్ని దూరం అన్న చిన్న వస్తువును గొప్ప కవిత్వం చేసిన ప్రసాదమూర్తి కవితా రూపనిర్మాణ కళాకౌశలమే రుజువు చేస్తుంది. ఇక ఈ కవి ఎంత సరళమైన భాషను వాడుతున్నారో...ఆంగ్ల భాషా పదాలను అవసరమైన చోట ఎలా చేర్చి...కవితా శిల్పానికి మెరుగులు దిద్దాడో, కవితను ఎలా ఎత్తుకుని ముగించాడో...ఆయన పొయెటిక్ డిక్షన్ యువకవులు..గమనించాలి. ఇలా ప్రసిద్ధ కవుల కవితా నిర్మాణాలను సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే...ఎవరైనా మంచి కవిత్వం రాయవచ్చు. నేటి గొప్ప కవులంతా ఒకప్పటి యువకవులేనని తెలుసుకోండి.

(కొత్త కలాల కోసం- వచన కవితా నిర్మాణ పద్ధతులు)

- బిక్కి కృష్ణ
8374439053

సాహిత్యమే జీవితంగా గడిపిన పోతుకూచి



నివాళి

బహుముఖీన ప్రతిభావంతులు డా॥పోతుకూచి సాంబశివరావు. పేరులో శివుణ్ణీ, హృదయంలో దామోదరుడినీ పొదువుకున్న పోతుకూచి స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. నవల, కథ, నాటకం, కవిత్వం, డైరీ మొదలైన ప్రక్రియలలో నిష్ణాతుడు పోతుకూచి సాంబశివరావు. వారు రచించిన ''ఉదయ కిరణాలు'' నవలకు 1955లో ఉత్తమ నవలా పురస్కారం ఆంధ్రపత్రిక వారు ప్రకటించారు. ఈ నవల రష్యాభాషలోకి అనువదించబడింది. అలాగే ''అన్వేషణ'' అనే నవలకు తెలుగు భాషా సమితి వారిచే ఉత్తమ రచనగా 1960లో అవార్డు ఇచ్చారు. ''ఏడు రోజుల మజిలి'' ''చలమయ్య షష్ఠిపూర్తి'', జీవననాదం అనే నవలలు రచించారు. వచన కవితా ప్రక్రియలో 8 కవితా సంకలనాలు రాశిసిర, శిఖరాలు, చైతన్యకెరటాలు, అనురాగం, పోతుకూచీయం, సాంబశివానందలహరి, చుక్కలు రచించారు. ఇటీవల వస్తున్న లఘు కవితా ప్రక్రియలలో తనదంటూ ఒక ముద్ర వేసుకుని ''చుక్కలు'' అనే నాలుగు పాదాల కవితా ప్రక్రియకు రూపశిల్పి అయ్యారు. ఈ ప్రక్రియలో అనేకమంది ప్రముఖ కవులు, వర్ధమాన కవులు కూడా పుస్తకాలు వెలువరించారు. యువ కవులను ప్రోత్సహిస్తూ వారి కవితలను విశ్వసాహితీ సంస్థ ద్వారా పుస్తకాలుగా బహు తక్కువ ఖర్చుతో ప్రచురించేవారు. ఆ పుస్తకాల ఆవిష్కరణలను విశ్వసాహితీ సంస్థ ద్వారా చాలా నిరాడంబరంగా జరిపించేవారు.

దాదాపు మూడు వందల దాకా కథలు రాశారు. కొన్ని కథలు రష్యన్, ఇంగ్లీషు, హిందీ, జర్మన్, కన్నడ, తమిళ భాషల్లో అనువదింపబడ్డాయి. రెండు సినిమా నవలలు 1. కలసి వుంటే కలదు సుఖం 2. తండ్రులు కొడుకులు రాశారు. 1. ఇదీ తంతు, 2. దొంగ దొర 3. ఏడుస్తున్నారు నాటికలు రాశారు.

1960లో విశ్వసాహితీ సంస్థ స్థాపించి, విశ్వరచన పక్ష పత్రిక, ''విశ్వ'' మాస పత్రిక, విశ్వరచన డైలీ'' ద్వారా తన సాహిత్యంతో పాటు అనేకమందిని కొత్తవారిని కవులుగా తీర్చిదిద్దారు. అలాగే నటనా రంగంలో అనేక రేడియో, స్టేజీ నాటకాలు వేశారు. వీరు వేసిన నాటకాన్ని ఒకసారి మహాత్మాగాంధీ గారు చూసి అభినందించారని స్వయంగా చెప్పారు. జ్యోతిష, వాస్తు శాస్త్రాలలో కూడా నిష్ణాతులు పోతుకూచివారు.

1950 ప్రాంతంలో హైదరాబాదు వచ్చి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ, నాటి నుంచే, సాహితీ, నాటక రంగాలలో కృషి చేసిన పోతుకూచి జీవితంలో దూసుకుపోయే స్వభావం అలవరచుకున్నారు. బి.ఏ. చదివే రోజుల్లోనే విద్యార్థి కాంగ్రెస్ కాకినాడ పట్టణం నాయకుడిగా, గాంధీగారి సిద్ధాంతాలను ఒంటపట్టించుకుని, అదే నిఖార్సయిన జీవితాన్ని కడదాకా సాగించారు.

1975లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు అన్నీ తానై ఆధ్వర్యం వహించారు.

భోపాల్‌కు చెందిన అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనకు దక్షిణాది రాష్ట్రాలకు చైర్మన్‌గా అనేకమంది లబ్ధ ప్రతిష్టులైన సాహితీకారులకు ''భారత్ భాషా భూషణ్'' అవార్డు దక్కేందుకు కృషి చేశారు. ''భారత్ భాషా భూషణ్'' అవార్డు కమిటీ జాతీయ సభ్యులుగా అనేక సంవత్సరాలుగా పనిచేశారు. వారి సాహితీ కృషికి అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనవారు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ''సరస్వతీ సమ్మాన్'' బిరుదుతో సత్కరించారు. వారి కీర్తి కిరీటంలో లెక్కలేనన్ని బిరుదులు, అవార్డులు, పురస్కారాలు శోభాయమానంగా ఇమిడిపోయాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ భాషా సదస్సులు హైదరాబాదులో మూడుసార్లు నిర్వహించి తెలుగు కవిత్వ మాధుర్యాన్ని ఇతర భాషల వారికి తెలియచేశారు.

ప్రతినెల క్రమం తప్పకుండా విశ్వసాహితీ కార్యక్రమం, అలాగే అఖిల భాషా సాహిత్య సమ్మేళన కార్యక్రమమని అంటే నెలకు రెండు కార్యక్రమాలు నిర్వహించి వర్ధమాన గాయనీగాయకులకు, కవులకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించడమే కాక, ఒక ప్రముఖ సాహితీవేత్త చేత ప్రసంగం చేయించేవారు. ఆనాటి ముఖ్యమంత్రి సంజీవయ్యగారితో కవి సమ్మేళనంలో పాల్గొన్నవారు ఈనాటి ఉగాది కవిసమ్మేళనంలో వర్ధమాన కవులతోనూ, ఎంతో ఉత్సాహంగా బేషజాలకు పోకుండా పాల్గొనటం వారిలోని గొప్పగుణం. ఈనాడు వేదిక మీద తమ స్థాయి వారుంటేనే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చేవారు పోతుకూచిని చూచి నేర్చుకోవాల్సింది వుంది. పదవులనూ, బిరుదులనూ, ఆశించక నిరంతర సాహితీ సేవలో తరించారు.

మాజీ ప్రధాని పి.వి.నరసింహరావు నాటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు, దామోదరం సంజీవయ్య, హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణ, ఆర్.వెంకటరామన్, ముఖ్యమంత్రులు చెన్నా రెడ్డి, రోశయ్య, ఎ.పి. శాసనమండలి ఛైర్మన్ డాక్టర్ చక్రపాణి లాంటి ప్రముఖులతో చాలా పరిచయం వున్నా ఆ పరిచయాలను స్వలాభం కోసం ఉపయోగించుకోక నిరాడంబర జీవితం గడిపారు.

పి.వి.నరసింహరావుగారితో తన పరిచయం ఆయన శాసన సభ్యుడిగా ఎన్నిక కాక ముందు నుంచీ వుందనీ, ఆయన శాసన సభ్యులుగా, విద్యామంత్రిగా తరువాత ముఖ్య మంత్రిగా, దేశప్రధాన మంత్రిగా వున్న అన్ని సమయాల్లో, పదవితో సంబంధం లేకుండా వారితో ఆ పరిచయం కొనసాగింది. ఆయన మంత్రి కాకముందు ముషీరాబాద్ శాసనసభ్యుడుగా నిలబడమని తన పేరు రికమెండ్ చేశారని పోతుకూచి తన ఆత్మకథలో రాసుకున్నారు.

పదిసంవత్సరాలు సెన్సారుబోర్డు సభ్యుడిగా, ఆకాశవాణి, దూరదర్శన్ సలహాబోర్డు సభ్యులుగా కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడుగా, సెంట్రల్ కార్మిక శాఖ సలహా సభ్యుడిగా, అధికార భాషా సంఘ సభ్యుడిగా, అక్షరజ్యోతి కమిటీ సభ్యుడిగా అనేక పదవులు నిర్వహించారు. ఎంత మందో పుడతారు, ఎంత మందో మరణిస్తారు. కానీ పుట్టింది ఎందుకో తెలుసుకుని ఒక ధ్యేయం పెట్టుకుని, ఆ దిశగా సమయాన్ని సద్వినియోగ పరచుకుంటూ సాహితీసేవలో నిమగ్నమయి పరులహితం కోసం పాటుపడుతూ ఆధ్యాత్మిక భావనతో జీవితాన్ని పండించుకున్న డా॥పోతుకూచి సాంబశివరావు సునాయాసంగా కృష్ణసాయుజ్యం పొంది అందరికీ ఆదర్శంగా నిలిచారు.

- కేతవరపు రాజ్యశ్రీ
8500121990

విజయం



సాయంకాల సూర్యుడు ఆశ్చర్యంలో
కాలుకదపకుండా
అలా చూస్తుండిపోయాడు!
దిగంతాలు దిగ్భ్రమ చెందాయి!
సాగర జలాలు ఆనందగీతికలు పాడాయి!
కోట వినువీధిలో
నారింజ అరుణవర్ణ జయకేతనం!
బాహుబలి నిప్పులు చిమ్ముకుంటూ
నింగిలోకి పయనం!
ఆసేత శీతాచలం
అందరి కన్నుల్లో ఆనంద జలం!
ఆధునిక సాంకేతిక విజయం!
భావితరాల భవితవ్యం బంగారం!
బ్రహ్మాండం అణువణువున విస్మయం!
ఎదురుదెబ్బలు చెదరిపోయాయి!
గెలుపులు గెలలు వేసాయి!
ఉపగ్రహాల వదనాలపై
ఉజ్వల మందస్మితాలు!
అలలు హస్తచలనాలతో
రేపటి ఉదయానికి స్వాగతాలు పలికాయి!

- కావూరి పాపయ్యశాస్త్రి
9848421964

సాహిత్య వార్తలు

అద్దంలో ఆభరణం ఆవిష్కరణ

కవన వేదిక, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దనోట్ల రద్దుపై వచ్చిన తొలి తెలుగు కవితా సంకలనం అద్దంలో ఆభరణం ఆవిష్కరణ 18వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్ నందు డా॥కె.వి.రమణాచారి ఆవిష్కరిస్తారు. డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షతన ఈ సభలో వక్తలుగా మామిడి హరికృష్ణ, పత్తిపాక మోహన్, డా॥కేతవరపు రాజ్యశ్రీలు పాల్గొంటారు.

- రఘుశ్రీ, చేకోలు సుందరయ్య, కె. ప్రభాకర్

డా॥ ద్వానా శాస్త్రి, డా॥ మసన చెన్నప్పలకు సృజన సాహితీ పురస్కారాలు

దశాబ్దాలుగా సాహితీరంగంలో విశిష్ట సేవలందిస్తున్న డా॥ ద్వానా శాస్త్రి, డా॥మసన చెన్నప్పలకు దాదాపు రెండు దశాబ్దాలుగా అనేక సాహితీ సభలు నిర్వహిస్తూ, రాష్ట్రంలోని అనేకమంది ప్రముఖ సాహితీకారులను సత్కరిస్తూ వస్తున్న సత్తుపల్లి సృజన సాహితీ సమాఖ్య జీవన సాఫల్య పురస్కారాలు అందించాలని నిర్ణయించింది. ఈ పురస్కారాలను 20వతేదీన సత్తుపల్లిలోని జలగం వెంగళరావు ప్రభుత్వ కళాశాల నందు జరిగే సాహిత్య సభలో అందించడం జరుగుతుంది.

- జి. రామకృష్ణ, బి. మధుసూదనరాజు, గట్టేవాసు
సృజన సాహితీ సమాఖ్య, సత్తుపల్లి


కలిమి శ్రీకి శ్రీకృష్ణదేవరాయలు జాతీయ పురస్కారం

సాహిత్య పత్రికా రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న కలిమిశ్రీకి లలిత కళాసాగర్ సంస్థ శ్రీకృష్ణదేవరాయలు జాతీయ పురస్కారం 2016ను అందించనుంది. 29వతేదీన రేణుక కళ్యాణ మండపం చిత్తూరు నందు శ్రీకృష్ణ దేవరాయల వారి సువర్ణ పాలన వైభవంపై జరిగే జాతీయ సదస్సులో కలిమిశ్రీకి ఈ పురస్కారం అందజేయడం జరుగుతుంది.

- మద్రిపూడి దేవేంద్రరావు
అధ్యక్షులు, లలిత కళాసాగర్ -చిత్తూరు

విలువ

నన్ను షేమ్ చేసినోళ్ళే...!
నాతో సెల్ఫీకోసం...రావాలె!!
నా...''సంతకం
ఆటోగ్రాఫ్‌గా ఎదగాలి
అదే...నా...జీవిత లక్ష్యం
అందుకోసమె...నా ప్రతి అక్షరం
అటువైపే నా ప్రతి అడుగు
అయినా...నేను దేన్నీ...
''ఎగిరి'' అందుకోను
''ఎదిగి'' అందుకుంటాను
నా డిగ్రీలు...
దీర్ఘ చతురస్ర కాగితాలు...



పేరు పక్క అక్షరాలు కాదు.
నా హోదా...నెలజీతం తెచ్చే
యంత్రం తీరు కాదు
డిగ్రీలకు తగ్గ సత్తా
హోదాలకు తగిన కర్తవ్యం
అదే నా గుండెబలం...
అటువైపే నా పయనం
నా వెంట వచ్చే వారికిదే...
నా అక్షర ఆహ్వానం...!!

- డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
7729883223

రచనలకు ఆహ్వానం

సాహితీగవాక్షం పేజీకి సమకాలీన సాహిత్యంపై మీ అభిప్రాయాలను,రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ రచనలు
sahithigavaksham@ gmail.com
పంపగలరు.

చిరునామా: ఎడిటర్, ఆంధ్రప్రభ,
సాహితీ గవాక్షం పేజీ, రోడ్ నెం. 9,
జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్,
హైదరాబాద్ - 500033

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కోస్తానుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో రాయలసీమలో రుతు పవనాలు చురుగ్గా కదులుతున్నట్టు అధికారులు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటున్నారు. అదే విధంగా మరో వారం రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని . దీంతో వచ్చే వారంలోనూ భారీగా వర్షాలు పడే అవకాశాలున్నట్టు విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

వీఆర్వో, వీఆర్ఏలను
రెవెన్యూ నుంచి తప్పించొద్దు

వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సతీష్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : వ్యవసాయ శాఖలో రెవెన్యూ పరిధిలో పని చేసే వీఆర్వో, వీఆర్ఏలను విలీనం చేయాలని ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొల్కొండ సతీష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెవిన్యూ శాఖ నుంచి తప్పిస్తే.. గ్రామాల్లోని భూ రికార్డులు తారు మారయ్యే ప్రమాదం ఉందని ఆయనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత వీర్వోలపై పెట్టడం వల్ల పని భారం ఎక్కువై భూమి రికార్డులు మూలనపడే ప్రమాదం ఏర్పడిందని, దాంతో గ్రామాల్లో భూ పంచాయితీలు ఎక్కువైనాయని ఆయన పేర్కొన్నారు.

గిరిజనాభివృద్ధికి సర్కార్ కృషి

- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా సంజీవ్
- ఘనంగా తీజ్ ఉత్సవాలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : బంజారా మహిళలు సంప్రదాయ బద్దంగా జరుపుకునే తీజ్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో 9 రోజుల పాటు ఈ పండుగను జరుపుకోవడం అనవాయితి. తొమ్మిదో రోజున ముగింపు ఉత్సవంగా లంబాడి మహిళలు గిరిజన సంప్రదాయ దుస్తులను దరించి, నృత్యాలను చేస్తూ తీజ్ బుట్టలను నిమజ్జనం చేస్తారు. కాగా ఆదివారం ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ ఘాట్ వద్ద లంబాడి మహిళలు తీజ్ పండుగ ఉత్సవాలను సేవాలాల్ సేన ఆధ్వర్యంలో నిర్వహించారు. వందలాది మంది బంజారా యువతులు హాజరయ్యారు. మొలుకలు వచ్చిన తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ మాట్లాడుతూ పెళ్లికానీ బంజారా యువతులు తీజ్ ఉత్సవాలను నిర్వహించడం అనవాయితన్నారు. 9 రోజుల పాటు బంజారా యువతులకు నిష్టతో ఉపవాసం చేస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి ట్యాంక్‌బండ్‌పై నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సొంత రాష్ట్రంలేనే తీజ్ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.

ఏపీ రైతుబజార్లలో ఎలక్ట్రానిక్ బోర్డులు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో ఇక నుంచి బోర్డుల మీద, పలకలమీద ధరలను సూచించే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనుంది. ప్రస్తుతం ఉన్న పాత విధానాలకు స్వస్త పలికి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఉన్న విధానం వల్ల ధరలు మారిన సమయంలో కొందరు రైతులు, వ్యాపారులు తగ్గిన ధరలను ప్రకటించడంలేదనే ఫిర్యాదులున్నాయి. కూరగాయల ధరలు పెరిగితే వాటిని తక్షణమే బోర్డుల్లో మారుస్తున్న వ్యాపారులు తగ్గితే మాత్రం ధరలను మార్చడంలేదన్న ఆరోపణలున్నాయి. ఇటువంటి పరిస్థితులపై అధ్యాయనం చేసిన ప్రభుత్వం రైతు బజార్లలో ఎలక్ట్రానిక్ డిసిస్లే బోర్డులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది.

జనగామ కలెక్టర్‌కు ఎక్సలెన్సీ అవార్డు

- స్వాతంత్ర్య వేడుకల్లో అందుకోనున్న శ్రీదేవసేన



జనగామ, కెఎన్ఎన్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల అధికారులకు ఎక్సలెన్సీ అవార్డులను అందజేయనుంది. అందులో భాగంగా నూతనంగా జనగామ జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన సంఘటిత సబల కార్యక్రమాన్ని నిర్వహించి గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకున్నందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఈమెకు ఎక్సలెన్సీ అవార్డును ప్రకటించింది. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఎక్సలెన్సీ అవార్డులలో సంఘటిత సబల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కలెక్టర్ శ్రీదేవసేన ఎంతో కృషి చేసిందని, అందుకు గిన్నిస్ రికార్డులోకి ఎక్కడం సంఘటిత సబల ద్వారా మహిళల ఆత్మరక్షణలో మెలుకువలను నేర్చుకోవడం, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన అంశంగా అందుకే తెలంగాణ స్టేట్ ఎక్సలెన్సీ అవార్డు దక్కడంపట్ల జనగామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో ఎక్సలెన్సీ అవార్డులను అందుకోనున్నారు.

వాహనాలకు వేగ నియంత్రణ

- కేంద్ర చట్టం అమలుకు చర్యలు ● అవగాహన తర్వాతే కార్యాచరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రవాణా వాహనాలకు వేగ నియంత్రణ పరికరం అమర్చడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. 2017 జనవరి 31 నుండి రవాణా వాహనాలకు స్పీడ్ గవర్నర్స్ అమర్చడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. రోడ్డు భద్రతపై నియమించిన సుప్రీం కోర్డు కమిటీ కూడా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నిబంధనలు కచ్చితంగా అమలు జరపాలని సూచించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రవాణా వాహనాల యాజమాన్యాల వ్యతిరేకతతో వేగ నియంత్రణ పరికరం అమర్చడంలో రెండు తెలుగు రాష్ట్రాలు జాప్యం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరగడంతో కేంద్రం ఉత్తర్వుల బూజు దులపడానికి ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ గ్రేటర్ మున్సిపాలిటీ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమీషనరేట్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఇప్పటికే ట్రాఫిక్ పాయింట్ల విధానం అమలులోకి తెచ్చారు. ఇక మీదట సరకు రవాణా, ప్రజా రవాణా వాహనాల విషయంలో కూడా రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని భావిస్తున్నారు.

రోజు రోజుకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల పట్ల ప్రభుత్వం తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తుంది. రోడ్డు ప్రమాదాలు, భద్రతా పరమైన చర్యలకు సంబంధించి వాహనదారుల్లో అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటుంది. అయినప్పటికీ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. మితిమీరిన వేగం వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు సుమారు 40 శాతానికి పైగా నమోదవుతున్నాయని తెలిసి రవాణా అధికారులు కఠిన నియమాలు అమలు పర్చడం అనివార్యం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్పీడ్ లిమిటింగ్ డివైజ్ తయారీదారులచే ప్రత్యేక వాహన ఆమోదంతో ఎఐఎస్‌వో 018, ఎఐఎస్‌వో 037, ఎఐఎస్‌వో 004, పార్ట్ 3 వంటి అవసరమైన ప్రమాణాలు, కట్టుబాట్లతో వేర్వేరు తయారీ నమూనాలు, వైవిధ్యాలతో ఖచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు నియమించిన కమిటీ సూచించడంతో తెలంగాణలోని సరకు రవాణా, ప్రజా రవాణా వాహన యాజమాన్యాలకు అవగాహన కలిగించాలని అధికారులు భావిస్తున్నారు. రవాణా శాఖ మంత్రి పి. మహేందర్‌రెడ్డి ఇటీవల రవాణా, పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షలో వేగ నియంత్రణ పరికరం అమర్చడం పైన చర్చ జరిగింది. ప్రమాదాలను నివారించడానికి, కేంద్ర చట్టాన్ని అమలు పర్చడానికి అవసరమైన చర్యలు తీసుకునే ముందు వాహనదారుల్లో అవగాహన కలిగించాలని మంత్రి సూచించినట్లు తెలిసింది. వేగం కంటే ప్రాణం మిన్న అనే అవగాహన ప్రతి ఒక్కరిలో కలిగించిన తర్వాత చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులు చట్టం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణ ప్రభుత్వం వేగనియంత్రణ పరికరాల ఏర్పాటుకు సంబంధించి 2015 డిసెంబర్ 19న జి.వో నెంబర్ 594తో నోటిఫికేషన్ జారీ చేసింది. అనేక కారణాల వల్ల ఈ నోటిఫికేషన్ అమలుకు నోచుకోవడం లేదు. ఈ నోటిఫికేషన్ ప్రకారం వేగ నియంత్రణ పరికరాలు అమర్చుకున్న వాణిజ్య వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేయవలసి ఉంటుంది. వేగ నియంత్రణ పరికరాలను ఏర్పాటు చేయడం, అమలు పర్చడానికి సంబంధించి రవాణా శాఖకు ఇప్పటి వరకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు అందకపోవడం వల్లనే మోటారు వెహికల్స్ ఇన్స్‌స్పెక్టర్లు పాత పద్ధతిలోనే ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను ఇవ్వం జరుగుతుంది. కర్ణాటక, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిషా, చత్తీస్‌ఘడ్, తమిళనాడు, మహరాష్ట్ర, అస్సాం, కేరళ రాష్ట్రాలు ఇప్పటికే స్పీడ్ లిమిటింగ్ డివైజ్ రూల్స్‌ను పాటిస్తున్నాయి. తెలంగాణలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఈ చట్టం అమలుకు పౌరసమాజం నుండి కూడా ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. రవాణా మంత్రి మహేందర్‌రెడ్డికి అధికారులు అందచేసిన సమాచారం మేరకు తెలంగాణలో ఏటా 20 వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో 7 వేల మందికి పైగా మృతి చెందుతున్నారు. అందులో ఎక్కువ మంది 18 - 11 ఏళ్ల వయస్సువారే అధికంగా ఉంటున్నారు. ప్రమాదాల నివారణను సామాజిక బాధ్యతగా భావించాలని మంత్రి కోరారు. చర్యలు మరింత కఠినతరం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో 90 వేలకు పైగా వాహనాలు ఉన్నాయని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత పైన అవగాహనతో వ్యవహరించవలసి ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మూడో విడతలో
20 కోట్ల మొక్కలు నాటాం

- అటవీ శాఖ మంత్రి జోగు రామన్న

కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో : మూడో విడత తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో రాష్ట్రంలో ఇంతవరకు 20 కోట్ల మొక్కలు నాటామని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఆదివారం ఎల్ ఎండీ రాష్ట్ర ముఖ్యమంత్రి జులై 12న హరితహారం కార్యక్రమం ప్రారంభం సందర్భంగా నాటిన మొక్కలను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే 3వ అతి పెద్ద ప్రయోగం రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమన్నారు. మొక్కలు నాటడం ముఖ్యం కాదని, వాటిని సంరక్షించడం ముఖ్యమన్నారు. జులై, ఆగస్టు మాసాలలో నెలకు నాలుగు సార్లు ట్రాక్టర్ల ద్వారా నీరు పోసేందుకు అనుమతి ఇచ్చామని మంత్రి తెలిపారు. కరీంనగర్‌లో మూడవ విడత హరితహారం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్‌లో మొక్కలు నాటి ప్రారంభించారని, నాటిన మొక్కలు ఎలా ఉన్నాయో చూడటానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. కరీంనగర్ జిల్లాలో 80 నుంచి 90 శాతం మొక్కలు రక్షించబడ్డాయని తెలిపారు. రెండు సంవత్సరాలలో నాటిన మొక్కలలో 67 శాతం రక్షించబడినాయని అన్నారు. వర్షాలు పడిన జిల్లాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని, లేనిచో ఉన్న మొక్కలను రక్షించాలని చెబుతున్నామని అన్నారు.

రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు రూపొందిస్తుందన్నారు. సంచార జాతులు, పూసరవేర్ల కులస్థులు, పెద్దమ్మల కులస్థులు, వంశదార కులస్తుల అర్థికాభివృద్ధికి ఎంబీసీ ఛైర్మన్ అధ్యక్షతన గల కమిటీలో చర్చించి వారికి సంక్షేమ పథకాలు రూపొందించి ముఖ్యమంత్రి ఆమోదంతో త్వరలో అమలు చేస్తామని తెలిపారు. వాటి ఫలితాలు వేగంగా వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. గొర్లకాపర్లు, మత్స్యకారులు, రజకులు, నాయిబ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. విశ్వకర్మల అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, శాసనమండలి సభ్యుడు బానుప్రసాద్‌రావు, నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక్, హరిత హారం ప్రత్యేకాధికారి అంజనేయులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



భూవివాదంలో
నలుగురు పోలీసులపై కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓ భూ వ్యవహారంలో తలదూర్చిన సైబరాబాద్ అదనపు డీసీపీ పులిందర్, రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా రామ చంద్రాపురంలో రెండు ఎకరాల భూమిపై గడిచిన రెండేళ్లుగా క్రయ విక్రయాల్లో వివాదం కొనసాగుతోంది. మొదట ఈ భూమిని ముజీబ్ అనే వ్యక్తి కొనుగోలు చేసి రూ.10 లక్షలు అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నాడు. సకాలంలో డబ్బు కట్టలేకపోయాడు. దీంతో ఆ భూమిని అబూబకర్, అబ్దుల్లా, రాచ కొండ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి కుమార్తె ఐశ్వర్యరెడ్డిలు రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసి అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకున్నారు. వీరు కూడా సరైన సమయంలో సొమ్ములు చెల్లించలేకపోయారు. ఇదే క్రమంలో తమకు కొంత సమయం కావాలని భూయజమానులను అభ్యర్థించారు. ఇంతలో భూయజమానులు రూ.2 కోట్లకు గంగాధర్‌రెడ్డి, రవీంద్రరెడ్డిలకు ఆ స్థలాన్ని విక్రయించారు. దీంతో అగ్రిమెంట్ రాయించుకున్న ఐశ్వర్యారెడ్డి భూ యజమానులు, దానిని కొనుగోలు చేసినవారిపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరిపై కేసు నమోదైనట్లు తెలుస్తోంది. మరోవైపు భూ యజమానులు గంగాదర్‌రెడ్డి, రవీంద్రరెడ్డిలు సైబరాబాద్ సీపీ సందీప్‌శాండిల్యాను కలిసి తమ గోడును వినిపించుకున్నారు. ఆ క్రమంలోనే తమపై అక్రమంగా కేసులు నమోదు చేశారని ఫిర్యాదునందించారు. తమ వద్ద బలవంతంగా చెక్కులపై సంతకం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను మాదాపూర్ ఏసీపీ రమణకుమార్‌కు అప్పగించారు. ఘటనలో ప్రమేయం వున్న రాచకొండ అదనపు డీసీపీ పులిందర్‌రెడ్డి, రాయదుర్గం సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు నలుగురిపై 448,365,342,384,147,506,149 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

నవంబర్‌లో బీసీ విద్యార్థి మహాగర్జన

- జాజుల శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 16న బీసీ విద్యార్థి మహాగర్జనను నిర్వహించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం నిర్ణయించింది. లక్షమంది విద్యార్థులతో భారీ బహిరంగ సభను నిర్వహించాలని ఆదివారం జరిగిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది.

సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం బీసీ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశంలో గండిచెర్వు వెంకన్న, ఎస్ దుర్గయ్య గౌడ్, ఈడిగ శ్రీనివాస్, జాజుల లింగం, పాలకూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధం లేకుండా అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టడం కోసం అసెంబ్లీలో ఫీజు నియంత్రణ చట్టం చేయాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లను బడుగు, బలహీన వర్గాల వారి కేటాయించాలని డిమాండ్ చేశారు.


బీసీలకు మరో 500 గురుకులాలను ప్రారంభించాలన్నారు. 200 ఇంటర్మీడియట్ స్థాయి గురుకులాలను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లుగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 1700 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 16న హైదరాబాద్‌లో లక్ష మంది విద్యార్థులతో బీసీ విద్యార్థి మహా గర్జనకు తమ సంపూర్ణ మద్ధతు ఉంటుందని స్పష్టం చేశారు.

బెస్ట్ బ్రాండింగ్‌లో
ఏపీఎస్ఆర్టీసికి అవార్డు

అమరావతి, ఆంధ్రప్రభ: బెస్ట్ బ్రాండింగ్, మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో నూతన అల్ట్రా డీలక్స్ బ్రాండ్‌ను ప్రవేశ పెట్టినందుకు ఏపీఎస్ఆర్టీసీకి అవార్డు లభించింది. ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండి మాలకొండయ్య ఈ అవార్డును అందుకున్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో ఢిల్లీలోని ప్రఖ్యాత మాణిక్ షా సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వాహన తయారీదారులు, వాహన విడిభాగాల తయారీదారులతో సమావేశం జరిగింది. కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ రవాణా రంగంలో నిపుణులు వివిధ అంశాల మీద రూపొందించిన నివేదికలను వ్రాతపూర్వకంగా సమర్పించారు. ఆర్టీసీకి బెస్ట్ బ్రాండింగ్ విభాగంలో అవార్డు దక్కింది. ఈ అవార్డు క్రింద ఆర్టీసీకి రూ.2.50 లక్షల నగదు, ఒక ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని ఇచ్చారు. ఈ సదస్సులో పి. ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వారికి ప్రాధాన్యమిస్తా

- సినీ దర్శకుడు వంశీ పైడిపల్లి



నిర్మల్, కెఎన్ఎన్ : తెలంగాణ చలన చిత్ర పరిశ్రమకు మంచి రోజులు రావడం వల్లె ఈ ప్రాంత కళాకారులకు డైరెక్టర్లకు అవకాశాలు వస్తున్నాయని సినీ డైరెక్టర్ పైడిపల్లి వంశీ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఓ పెళ్లి కార్యక్రమానికి తన తండ్రి పైడిపల్లి రవీందర్‌రావుతో నిర్మల్ పట్టణానికి వచ్చిన సందర్భంగా పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖానాపూర్ వాసుడైన తాను సినిమా పట్ల ఆసక్తితో సినిమా డైరెక్టర్‌గా ఈ స్థాయికి ఎదిగినప్పటికి ఈ ప్రాంతాన్ని ఎప్పుడు మరువలేదన్నారు. తాను మొట్టమొదటిసారిగా మున్నా చిత్రంలో ఖానాపూర్ అనే పదాన్ని చిత్రంలో వాడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. తాను వచ్చే నెల 5న మహేశ్‌బాబుతో దర్శకత్వం వహించిన చిత్రానికి అగ్ర నిర్మాతలు దిల్‌రాజు, అశ్వనీదత్‌లు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. అవకాశం ఉంటే ఈ ప్రాంత వాసులకు ఈ చిత్రంలో నటించేందుకు అవకాశం కల్పిస్తానని పేర్కొన్నారు.

అలాగే నిర్మల్ జిల్లాలో ఏదైనా సన్నివేశం షూటింగ్ జరిపేందుకు కూడా తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సినిమా షూటింగ్ అంటే ఆషామాషీ కాదని, ఓ పెద్ద రిస్కుతో కూడుకున్న పని అని పేర్కొన్నారు. తాను ఒక చిత్రం పూర్తయ్యేంత వరకు మరో చిత్రం దర్శకత్వం వహించనని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో విడుదలైన ఫిదా సినిమా తెలంగాణ యాసను, భాషను తెరపైకి తెచ్చిన చిత్రబృందానికి తాను ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. తాను జిల్లావాసులైనప్పటికి హైదరాబాద్‌లో ఉన్నత చదువులు చదివి సినిమాపై మక్కువతోనే సినీ ఫీల్డులోకి వచ్చానన్నారు. తెలంగాణ ప్రాంత కళాకారులకు తప్పకుండా సినిమాలో అవకాశం కల్పిస్తానని ఆయన పేర్కొన్నారు. తాను దర్శకత్వం వహించిన ఐదు చిత్రాలు సూపర్‌డూపర్ హిట్ అయి మంచి గుర్తింపు వచ్చిందంటే జిల్లా ప్రజల, ప్రేక్షకుల ఆశీస్సులతోనేనని , జిల్లావాసిగా గర్వపడుతున్నానని ఆయన చెప్పారు.

చంద్రబాబుపై కేవీపీ ఫైర్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పోలవరం ప్రాజెక్టుకు తాను అడ్డు పడుతున్నానని నిరూపిస్తే రాజ్యసభ సభ్యత్వాన్ని వదులుకుని, రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతానంటూ కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ఏపీ సీఎం చంద్రబాబుకు సవాల్ విసిరారు. నిరూపించలేక పోతే తనపై వేసిన నిందలు తప్పు అని చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు అంశాలపై ఆత్మవిమర్శ చేసుకోవాలంటూ మూడోసారి బాబుకు బహిరంగ లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టును ప్రధాన డ్యాం సహా కేంద్ర జలసంఘం అనుమతించిన డిజైన్లను పూర్తిగా నిర్మించి కనీసం 2019 నాటికి అయినా నీళ్లు ఇవ్వగలిగితే చంద్రబాబుకు 'అపర భగీరథుడు' అనే బిరుదు ఇప్పించి, ఆయనకు 'భారతరత్న' సాధించి పెట్టడానికి కృషి చేస్తానని కేవీపీ ఎద్దేవా చేశారు. పోలవరం నిర్మాణంలో నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలనుకుంటున్నట్టు తన కోరికను వెల్లడించారు.

పేదల వైద్యుడు.. డాక్టర్ రమేష్

- రికార్డుస్థాయి ప్రసవాలతో రాష్ట్రంలోనే ఆర్మూర్ అగ్రస్థానం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డా. రమేష్ పూర్తి సేవలు
- రాష్ట్ర అవార్డుకు ఎంపిక చేసిన సీఎం

నిజామాబాద్, ఆంధ్రప్రభ : ఒక్క వైద్యున్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తుంది. భారీగా వేతనాలతో సమాజంలో విలువైన వైద్యులుగా కొలువులు కల్పిస్తుంది. కాని కొందరు తమ అమూల్యమైన వైద్య సేవలను ప్రజలకు అందిస్తారు. ప్రజాధనంతో ఉన్నతస్థాయికి చేరి ప్రజల రుణం తీర్చుకుంటారు. అలాంటి సమాజహితం కోరి, సేవానిరతితో పేద ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించే వైద్యుల జాబితలో నిలుస్తారు డాక్టర్ జి. రమేష్. సాధారణ వ్యవసాయ, నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు జన్మించిన డాక్టర్ సర్కార్ సర్కార్ దవాఖానలోనే వైద్యాధికారిగా 20 ఏళ్ళ క్రితం కొలువుదీరారు. తన చిన్నానాటి పరిస్థితులు, కష్టాలు, కుటుంబ నేపథ్యం కళ్ళారా చూసిన డాక్టర్ రమేష్ ఏనాడు ప్రైవేటు ప్రాక్టీస్‌లు చేయకుండా, కేవలం ప్రభుత్వ దవాఖానాల్లో ప్రైవేటుకు ధీటుగా వైద్య సేవలు అందించి ప్రజల్లో, ప్రజాప్రతినిధుల్లో, ఉన్నతాధికారుల్లో చక్కని పేరును సంపాదించాడు. వైద్య సేవలో నిస్వార్థం, క్రమశిక్షణ, బాధ్యత డాక్టర్ రమేష్‌ను రాష్ట్రస్థాయి పురస్కారం వరించింది. ఏకంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మెచ్చి అవార్డుకు ఎంపిక చేయడం రమేష్ చేసిన సేవలకు నిదర్శనంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండలో జరిగే ఉత్సవాల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని డాక్టర్ రమేష్ అందుకోనున్నారు.

వ్యవసాయ కుటుంబ నేపథ్యం

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రం రమేష్ జన్మస్థలం. నిరక్షరాస్యులైన తండ్రి శివన్న, తల్లి లింగమ్మలకు ఒక్క కొడుకు, ఇద్దరు అక్కచెల్లెలు. స్థానిక ప్రభుత్వ హై స్కూల్‌లో ఎస్ఎస్సీ, ప్రభుత్వ కళాశాల నిజామాబాద్‌లో ఇంటర్ పూర్తి చేశారు. వరంగల్ కాకతీయ యూనివర్శిటిలో ఎంబీబీఎస్, హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో డిఎ (అనస్థిషియా) పూర్తి చేసి 1998లో బాల్కొండ మండలం మెండోరాలో వైద్యాధికారిగా చేరారు. 13 ఏళ్ళ పాటు అక్కడే వైద్య సేవలు అందించి, ఉద్యోగున్నతిపై బాల్కొండ క్లస్టర్ ఇంచార్జీగా 2014లో, 2015లో ఆర్మూర్ క్లస్టర్ భాద్యతలు అదనంగా చేపట్టారు. డిసెంబర్ 2015లో జిల్లా ఉప వైద్యాధికారిగా పదొన్నతి పొంది ఆర్మూర్‌లో కొనసాగుతున్నారు. మెండోరాలోని ఆసుపత్రిని అద్భుతంగా తీర్చిదిద్దిన రమేష్‌కు మార్పు పథకంలో భాగంగా ఆర్మూర్ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా బాధ్యతలను కలెక్టర్ యోగితారాణా, వైద్యాధికారి డాక్టర్ వెంకట్‌లు అప్పగించారు. కేవలం పోస్టుమార్టంలకే పరిమితమైన ఆర్మూర్ ఆసుపత్రిలో నెలకు ఒక్క ప్రసూతి కూడ అయ్యేదికాదు. రమేష్ సంకల్పం ఆర్మూర్ ఆసుపత్రి తీరును పూర్తిగా మార్చి వేసింది. నెలకు కనీసం 300 ప్రసవాలతో ఆసుపత్రి కల కలలాడుతోంది. చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుండి వచ్చి కాన్పు చేయించుకోవడానికి ఆసుపత్రిలో క్యూ కడుతున్నారు. బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే ఆసుపత్రిలో అన్ని విభాగాల డాక్టర్లను, సిబ్బందిని తన వైపు మళ్లించుకున్నారు. 24గంటల పాటు వైద్య సేవలు కేవలం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుతాయనే పూర్తి నమ్మకం ప్రజల్లో కలిగించారు.



బాధ్యత పెరిగింది

అవార్డుతో నాపై మరింత బాధ్యత పెరుగుతుంది. ప్రజా దానంతో చదువుకున్న నాకు ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందించాలనే సంకల్పం ఉంది. నా సంకల్పానికి తోడు జిల్లా కలెక్టర్ యోగితారాణా, జిల్లా వైద్యాధికారి వెంకట్‌ల సహకారం ఎంతో గొప్ప ఉత్సాహన్ని ఇచ్చింది. ఆసుపత్రి రికార్డు స్థాయిలో ప్రసవాలకు నాతోటి వైద్యులు, సిబ్బంది అందించిన సేవలు వెలకట్టలేనివి. భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన సేవలు అందిస్తాను.

రైళ్లలో హిజ్రా మాఫియా బెడద

అమరావతి, ఆంధ్రప్రభ : రైళ్లలో హిజ్రా మాఫియాల దందా అంతా ఇంతా కాదు.... మితిమీరి శ్రుతిమించి ప్రవర్తిస్తున్నా అంతా చోద్యం చూసే వారే కానీ అదేమని ప్రశ్నించే ధైర్యం చేయలేకపోతున్నారు. వారంటే భయం అందుకే అంతా మిన్నకుండిపోతున్నారు. నిత్యం రైళ్లలో వీరి ఆగడాలకు అడ్డూ అదుపూలేకుండా పోతోంది. నిత్యం ప్రయాణికులకు నరకం చూపిస్తున్నా పట్టించుకునే దిక్కులేకుండాపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరి ఆగడాలు నిత్యకృత్యంకావడంతో రైళ్లల్లో ప్రయాణమంటేనే భయపడే పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు వాపోతున్నారు. బోగీల్లోకి గుంపులు గుంపులుగా వచ్చి, ప్రయాణికుల నుంచి మరీ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. లేవని ఎవరైనా అంటే మాత్రం వారు సహించరు. డబ్బులు ఇచ్చేంత వరకు వదలకుండా నానా యాగీ చేస్తూ, దుర్భాషలాడతారు. గత్యంతరంలేక వారడిగినంత చెల్లించుకోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. హిజ్రాల దుందుడుకు చర్యల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిజ్రాలు పెద్ద ఎత్తున రైళ్లలో ఇష్టానుసారం ప్రయాణికుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు.ఉదయంనుంచి రాత్రివరకు వీరి దందా కొనసాగుతుంది. బ్యాచ్‌ల వారీగా డ్యూటీలు ఎక్కుతూ, వసూళ్ళ దందా కొనసాగిస్తున్నారు. ప్రధానంగా విజయవాడ - హైదరాబాద్, విజయవాడ - విశాఖపట్నం, విజయవాడ - తిరుపతి ఇలా ఒక్కటేమిటీ అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ప్యాసింజర్ రైళ్లలో వీరి హవా కొనసాగుతోంది. గుంపులు గుంపులుగా విడిపోయి, బోగీల్లోకి చేరుకుని, ప్రయాణికులను బెంబేలెత్తిస్తూ అవకాశం ఉన్నంత మేర ప్రయాణీకుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ఒక్కో ప్రయాణీకుడి నుంచి రూ. 10 నుంచి రూ.20 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఒక్కో బోగీలో సుమారు రూ. 1000 దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. టిక్కెట్ లేకుండా దర్జాగా రైళ్లలో ప్రయాణిం చడమే కాకుండా డబ్బులు దందా కొనసాగిస్తున్న వీరి వెనుక కొన్ని ముఠాలు పని చేస్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా విజయవాడ - హైదరాబాద్ మార్గంలో గౌతమి, గోదావరి, సింహపురి, మచిలీపట్నం, హైదరాబాద్ - నర్సాపూర్, చార్మినార్, కృష్ణా కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు సూపర్‌ఫాస్ట్, ప్యాసింజర్ రైళ్ళలో హిజ్రాలు ఇష్టానుసారం డబ్బులు బలవంతంగా వసూలు చేస్తూ ప్రయాణీకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

Andhraprabha business 2017
బిజినెస్
BUSINESS

మాజీ సైనికుల అనుభవాలు తెలుసుకునేందుకు ఓలా వినూత్న అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ 70వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రముఖ రవాణా సంస్థ ఓలా తమ షేర్ ప్రయాణీకులకు ఒక వినూత్న అవకాశాన్ని కల్పించింది. ఈనెల 14 నుంచి 16వ తేదీవరకు ఓలా ప్రయాణీకులు ఓలా షేర్ ద్వారా ప్రయాణిచేందుకు తమ ఓలా యాప్‌లో షేర్‌ను ఆప్షన్‌గా ఎంచుకుంటే, అలాంటి ప్రయాణికులకు ఒకప్పుడు భారతదేశ సైన్యంలో సైనికులుగా సేవలను అందించి, ప్రస్తుతం ఓలా డ్రైవర్లుగా తమ జీవనాన్ని కొనసాగిస్తున్న మాజీ సైనికులు తమ సేవలను అందించడానికి వస్తారు.

తద్వారా ఓలా షేర్ ప్రయాణీకుడు ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఒక మాజీ సైనికునితో ప్రయాణించి, అతను సైన్యంలో ఉండగా జరిగిన సంఘటనలను, సాహసకృత్యాలను, అతను దేశంకోసం చేసిన త్యాగలను, దేశభక్తి గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

అంతేకాకుండా దేశ సరిహద్దులను అనునిత్యం కాపాడుతూ, తమ జీవితాలను ఫణంగా పెట్టి దేశ భద్రతకు, సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న భారత సైన్యం గురించి దాని విధివిధానాలను, ఇతర విషయాలను అందులోనే సేవలను అందించిన ఒక మాజీ సైనికుని అనుభవాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ సంస్థ వినూత్న కార్యక్రమం చేపట్టింది.

వెలుగులోకి మరిన్ని డొల్ల కంపెనీలు

బాలీవుడ్, బిల్డర్లు, బ్రోకర్లపై సెబీ కొరడా

ముంబై: మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి ఇటీవల 331 డొల్ల కంపెనీలను గుర్తించి వాటి ట్రేడింగ్‌ను నిలిపివేసింది. ఈ కంపెనీలకు సెబి షోకాజ్ నోటీసులు క ూడా జారీ చేసింది. అక్రమంగా వచ్చిన డబ్బుతో ఈ కంపెనీలు నడుస్తున్నట్లు గుర్తించిన సెబి 100 కంటే ఎక్కువ అన్‌లిస్టెడ్ కంపెనీలపై చర్యలకు శ్రీకారం కూడా చుట్టింది. ఈ కంపెనీలు మనీ లాండరింగ్ డబ్బుతో స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్‌కు వచ్చే అవకాశాలున్నట్లు సెబి గుర్తించినందని ప్రభుత్వవర్గాలు తెలియజేశాయి. అతి పెద్ద బిల్డర్లు, బ్రోకర్లు, బాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు తమ నల్లధనాన్ని ఈ డొల్ల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు దర్యాప్తు సంస్థల దృష్టి కూడా వచ్చింది. కాగా సెబి ముందుగానే కొన్ని డొల్ల కంపెనీలను గుర్తించి వాటి ట్రేడింగ్‌ను కూడా రద్దు చేయించింది. అదే సమయంలో కొన్ని కంపెనీలు సెక్యూరిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి సెబి నిర్ణయాన్ని సవాలు చేశాయి. అయితే ట్రిబ్యునల్స్ కూడా ఈ కంపెనీలపై విచారణకు అనుమతించింది. కాగా కొన్ని కంపెనీలు తమ కంపెనీలు డొల్ల కంపెనీలు కాదని మీడియాలో పెద్దెత్తున ప్రకటనలు గుప్పించాయి. తాము ఎలాంటి తప్పులు చేయలేదని వివరణ ఇచ్చుకున్నాయని ప్రభుత్వం ఉన్నతాధికారి చెప్పారు. బాగా పేరున్న కంపెనీలు కూడా డొల్లకంపెనీల్లా వ్యవహరిస్తాయని, మనీలాండరింగ్‌కు వేదికగా మారుతుంటాయని తెలిపింది. అదే సమయంలో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి సహరిస్తాయని ఆయన అన్నారు. కొంత మంది చిన్న పాటిబ్రోకర్లు పేరు కూడా అనుమానిత డొల్లకంపెనీల జాబితాలో ఉన్నాయని, వారికి పెద్ద బ్రోకర్లకు మధ్య ఉన్న సంబంధాలపై కూడా సెబి దర్యాప్తు చేస్తుందని మరో అధికారి వివరించారు. తమ పేర్లు బహిర్గతం కావడంతో కొంత మంది బ్రోకర్లు స్టాక్ మార్కెట్లో అనవసరంగా లేని పోని భయాలు సృష్టిస్తున్నారని చెప్పారు. మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి మాత్రం మైనారిటి వాటాదారుల ప్రయోజనాలను కాపాడ్డానికి కృషి చేస్తుంటే.. బ్రోకర్లు మాత్రం తమ డబ్బును ఎలాగైనా రాబట్టుకోవలని చూస్తోందని వారు అన్నారు.

ఒక వైపు సెబి విచారణ కొనసాగిస్తుండగా.. ఈ డొల్ల కంపెనీలపై దర్యాప్తు ఏజెన్సీలు ఉదాహరణకు ఆదాయపు పన్ను శాఖ, ఈడీ, ఎస్ఎఫ్ఐవో (సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్)లు కూడా రంగంలోకి దిగి దర్యాప్తు మొదలుపెట్టాయి. పెద్దనోట్ల రద్దు తర్వాత పెద్దమొత్తంలో నల్లధనం ఈ అనుమానిత కంపెనీల్లోకి వరదలా వచ్చిపడుతోందని అధికారులు తెలియజేశారు. సెబి దర్యాప్తు సంస్థలకు పూర్తి సమాచారం అందించి దర్యాప్తు అధికారులకు సహకరిస్తోందని అధికారులు వివరించారు.



ప్రాథమిక దర్యాప్తులో పలు దర్యాప్తులు సంస్థలు సుమారు 500 కంపెనీలు వాటిలో లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీలున్నాయి. ప్రస్తుతం బహిర్గతం అయిన పేర్లపై విచారణ జరుగుతోందని, విచారణకు ఆటంకాలు తలెత్తుతాయన్న ఉద్దేశంతో కొన్ని పేర్లు బహిర్గతం చేయలేదన్నారు. డొల్ల కంపెనీల విషయానికి వస్తే పెద్దపేర్లు బహిర్గతమైతే దర్యాప్తు పూర్తయిన తర్వాతనే వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు.

బోలెడన్ని కంపెనీలు డొల్ల కంపెనీలుగా వ్యవహరించాయి. ఈ కంపెనీలు రియల్ ఎస్టేట్, కమాడిటీ, స్టాక్ బ్రోకింగ్ కంపెనీలు, సినిమాలు, టెలివిజన్, (వాటిలో డిజిటల్ ప్లాట్‌ఫాం)లు ప్లాంటేషన్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లున్నాయని చెప్పిరు. మరో ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే ఈ డొల్ల కంపెనీలే.. వాటిలో లిస్టెడ్‌వి కూడా మనీలాండరింగ్ డబ్బును చట్టవిరుద్ధంగా వసూలు చేసిన డబ్బును వీరు చట్టబద్దంగా వాటిని తెల్లడబ్బు చేయడానికి సహకరిస్తున్నారని మరో అధికారి వివరించారు. చట్టవిరుద్ధంగా డబ్బును పూలింగ్ స్కీంను కొన్ని గ్రూపులు తయారు చేసి వాటిని స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడానికి సెబి ఎప్పుడో అనుమతిని నిరాకరించిందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని మరో అధికారి తెలియజేశారు.

విదేశీ, దేశీయ ప్రైవేట్ ఈక్విటి ఇన్వెస్ట్‌మెంట్ నిధులు కూడా అనుమానిత డొల్లకంపెనీల్లో వచ్చినట్లు సెబి దృష్టికి వచ్చింది. ఈ అనుమానిత కంపెనీలను ఈ పెట్టుబడుల గురించి వివరణ కూడా అడిగినట్లు చెబుతున్నారు. ఈ డొల్ల కంపెనీలు తమ పుస్తకాల్లో కాంట్రాక్టులు చేసినట్లు చూపుతున్నారు. అయితే అవి వాస్తవంగా చేసిన వ్యాపారానికి కావు టర్నోవర్ బాగా పెంచి చూపిస్తున్నాయని చెబుతున్నారు. గత వారం సెబి మొత్తం 331 డొల్ల కంపెనీలపై వేటు వేసింది, ట్రేడింగ్ నిలిపివేసింది. దీంతో పాటు సెబి స్టాక్ ఎక్స్చేంజీలతో పాటు బ్రోకర్లను మొత్తం 107 అన్‌లిస్టెడ్ కంపెనీలు ట్రేడింగ్ నిషేధించిన వాటిపై గురించి వివరాలు అడిగి తెలుసుకుంది. వారి నుంచి సంతృప్తికరమైన వివరాలువస్తే సరే సరి లేదంటే గట్టి చర్యలు తీసుకుంటామని సెబి తెలిపింది. ఈ డొల్లకంపెనీల వ్యాపారాలు ఎక్కువగా రియల్ ఎస్టేట్, ప్లాంటేషన్, ట్రేడింగ్, ఫైనాన్స్ వ్యాపారాలకు సంబంధించివని ఉన్నాయి. కాగా ఈ వివరాలను సెబి కార్పొరేట్ వ్యవహరాల మంత్రిత్వశాఖతో పంచుకుంది. ప్రస్తుతం పలు దర్యాప్తు సంస్థలు వీటిపై దృష్టి పెట్టింది. కాగా ఈ కంపెనీలు ఆడిటర్ సర్టిపికేట్లతో పాటు వార్షిక ఆదాయం రిటర్న్స్ ఫైలింగ్ చేయాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ వద్ద ఉన్న పెండింగ్ వివాదాలతో పాటు కంపెనీ చట్టం ముందు కంపెనీ హోదా గురించి కూడా వివరణ ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.



ఏసీ రెస్టారెంట్ నుంచి ఆహారం పార్సిల్‌పై
18శాతం జీఎస్టీ


న్యూఢిల్లీ: ఏసీ రెస్టారెంట్లలోనే నాన్ ఏసీ ప్రాంతంలో ఆహారం సర్వ్ చేసినా..లేదాఅక్కడి నుంచి టేక్‌అవే (పార్సిల్) తీసుకొని వెళ్లినా..దేశవ్యాప్తంగా ఒకే విధంగా 18 శాతం పన్ను విధించాలని ప్రభుత్వం నిర్ణయించంది. ఈ ఏడాది జులై1 నుంచి ప్రభుత్వం జీఎస్టిని అమల్లోకి తెచ్చింది. అయితే నాన్ ఏసీ రెస్టారెంట్‌లలో అందజేసే ఆహారంపై 12 శాతం, అదే ఏసీ రెస్టారెంట్‌ల విషయానికి వస్తే...లిక్కర్ (మద్యం)లైసెన్స్ ఉన్న రెస్టారెంట్లకు 18 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. అదే ఫైవ్‌స్టార్ రెస్టారెంట్‌ల విషయానికి వస్తే 28 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. సెంట్రల్‌బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్(సీబీఈసీ) తరచూ అడిగే ప్రశ్నలకు (ఎఫ్ఏక్యూ)లపై వివరణ ఇచ్చింది. మొదటి అంతస్తులో ఎయిర్‌కండిషన్డ్ రెస్టారెంట్ కమ్ బార్‌లలో మద్యంఅందిస్తూ.. అదేకింది అంతస్తులో (నాన్ ఏసీ రెస్టారెంట్) కేవలం ఆహారం సర్వ్‌చేస్తుండే రెస్టారెంట్లు ఉంటే.. ఒక వేళ మొదటిఅంతస్తు, లేదా రెండో అంతస్తు ..నుంచి ఆహారాన్ని పార్సిల్ తీసుకుంటే (ఏసీ రెస్టారెంట్లు) అయ్యి ఉంటే దానిపై 18 శాతం పన్ను వసూలు చేయాలని సీబీఈసీ తాజాగా వివరణ ఇచ్చింది.

రుణాలపై వడ్డీరేట్లు తగ్గింపు?

• ఇండియా రేటింగ్స్

ముంబై : ఇటీవల ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకు పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లలో అర శాతం కోత విధించిన విషం తెలిసిందే. దీంతో బ్యాంకుల మధ్య గట్టిపోటీ పెరిగి రుణాలపై వడ్డీరేట్లు తగ్గించేందుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జులై 31వ తేదీన పొదుపు ఖాతాలపై రూ.1 కోటికంటే తక్కువ డిపాజిట్లపై అర శాతం తగ్గించి 3.5 శాతానికి పరిమితం చేసింది. ఎస్‌బీఐ అడుగుజాడల్లోనే బ్యాంకు ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంకులు కూడా నడిచాయి. ఈ బ్యాంకులు కూడా అంతే శాతం వడ్డీరేట్లను రూ.50 లక్షల వరకు ఉండే ఖాతాలపై తగ్గించేశాయి.

ఇండియా రేటింగ్స్ అంచనా ప్రకారం బ్యాంకుల లాభాల మార్జిన్ బాగా తగ్గిపోయాయని, అదే సమయంలో బ్యాంకుల్లో మొండిబాకాయిలు పెరిగిపోవడం, దీంతో పాటు రుణాల డిమాండ్ బాగా తగ్గింది. పెద్దమొత్తంలో నగదు ఉన్న బ్యాంకులు పోటీ బ్యాంకులకు గట్టి పోటీ ఇచ్చేందకు వడ్డీరేట్లను తగ్గించాలనుకుంటున్నాయి. ఆ దశగానే ఆలోచించి పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను తగ్గించాయని ఇండియా రేటింగ్ తాజా నివేదికలో వెల్లడించింది.



ఆధార్‌తో 9.3 కోట్ల పాన్‌కార్డుల అనుసంధానం

న్యూఢిల్లీ : సుమారు 9.3 కోట్ల పర్మినెంట్ అకౌంట్ నెంబర్స్ (పాన్)లను ఆధార్‌తో అనుసంధానం చేసినట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారి ఒకరు తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 30 కోట్ల పాన్‌కార్డు హోల్డర్లలో 30 శాతం మంది ఇప్పటి వరకు అనుసంధానం చేసినట్లయిందని ఆయన అన్నారు. ఆగస్టు 5వ తేదీ నాటికి ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైలింగ్ చేయాల్సి ఉండగా.. సుమారు 9.3 కోట్ల మంది పాన్, ఆధార్‌ను రిజిస్టర్ చేసుకున్నారని ఐటిశాఖ తెలియజేసింది. ఆ అధికారి సమాచారం ప్రకారం ఈ రెంటి అనుసంధానానికి చివరి తేదీని ఆగస్టు 31కు పొడిగించినందు వల్ల రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరగవచ్చునని ఆయన అన్నారు. కాగా ఐటిఆర్ ఫైలింగ్‌ను పాన్ ఆధార్ లింకేజీని జులై 1 నుంచి ప్రభుత్వం తప్పని చేసింది. దీంతో పాటు ఒక వేళ పాన్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయకపోతే ఐటిఆర్‌ను ప్రాసెస్ చేయమని ఐటి శాఖ పన్ను చెల్లింపుదారులకు హెచ్చరిక కూడా చేసింది. అయితే ఇటీవల ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ లోకసభలో మాట్లాడుతూ, ఆధార్‌తో పాన్ అనుసంధానానికి ఎలాంటి తుది గడవు నిర్ణయించలేదని ప్రకటించారు. ఇదిలా ఉండగా వ్యక్తిగత ఆదాయం ఏడాదికి రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయం సంపాదించే వారు 80 ఏళ్లపై బడిన వారు తప్పకుండా ఈ-ఐటిఆర్ ఈ ఫైలింగ్ చేయాల్సి ఉంటుంది.

ఐఐఐటి - హైదరాబాద్ పట్టభద్రుల వేతనాలు రూ.13 లక్షల నుంచి రూ.18.8 లక్షలు

INTERNATIONAL INSTITUTE OF INFORMATION TECHNOLOGY
HYDERABAD

హైదరాబాద్ : ఇంటర్నేషనల్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐటి-హైదరాబాద్) గ్రాడ్యుయేట్లకు ఏడాదికి రూ.13.4 లక్షల నుంచి రూ.18.8 లక్షల వేతనాల ఆఫర్‌లు వచ్చాయి. దీంతో పాటు ఐటిలో మాస్టర్స్ ప్రోగ్రాం చేసిన పట్టభద్రుల సరాసరి వేతనం రూ.14 లక్షల నుంచి రూ.17.7 లక్షల వరకు ఆఫర్లు వచ్చాయని ఆదివారం నాడు ఇన్సిస్టిట్యూట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. సుమారు 116 కంపెనీలు ప్లేస్‌మెంట్ కోసం తమ వద్ద రిజిష్టర్ చేయించుకున్నాయని తెలిపింది. విద్యార్థులకు 100 శాతం ఉద్యోగాలు లభించినట్లు పేర్కొంది. ఐఐఐటి - హైదరాబాద్ మరో సారి 100 శాతం ప్లేస్‌మెంట్‌ను దక్కించుకుంది. తమ గ్రాడ్యుయేట్లకు పెద్ద పెద్ద కంపెనీల నుంచి మంచి అవకాశాలు వచ్చాయని వారి వేతనాలు ఏడాదికి రూ.14 లక్షల నుంచి రూ.17.7 లక్షల వరకు ఆఫర్లు లభించాయని వివరించింది. కాగా ఐఐఐటి - హైదరాబాద్‌లో శనివారం నాడు 16 స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. 473 మంది గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారని... వారిలో 84 మంది రీసెర్చి విద్యార్థులు కాగా వారిలోనే 16 పీహెచ్‌డీలని ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రెడ్డీస్ లేబరెటరీస్‌కు సీఈవో జీవీకే ప్రసాద్ విచ్చేశారని, ప్రొఫెసర్ రాజ్ రెడ్డి, చైర్మన్ ఐఐఐటి హైదరాబాద్ చైర్మన్, గవర్నింగ్ కౌన్సిల్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు.

సీబీఐ వలలో వరుణ్ ఇండస్ట్రీస్ అధినేత

ముంబై: ఉద్దేశపూర్వక ఎగవేతదారుల్లో సీబీఐకి మరో పెద్ద తిమింగలం చిక్కింది. వరుణ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సహ ప్రమోటర్ కైలాష్ అగర్వాల్ బ్యాంకులతో పాటు ఇతర ఆర్థిక సంస్థలకు రూ.2,500 కోట్లు బకాయిపడ్డారు. గత వారం సీబీఐ ఆయనను విమానాశ్రయంలో అరెస్టు చేసింది.

దేశంలోని ఉద్దేశపూర్వక ఎగవేతదారుల్లో టాప్ 10లో ఆయన ఒకరు. అగర్వాల్‌తో పాటు ఆయన వ్యాపార సహచరుడు కిరణ్ మెహతా బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఎగ్గొట్టి దేశం నుంచి పారిపోవాలనుకున్నారు. అయితే ఆగస్టు 5వ తేదీన ఆయన దుబాయి నుంచి వచ్చిన వెంటనే అరెస్టు చేసి స్థానిక కోర్టులో ప్రవేశపెట్టారు.కోర్టు రిమాండ్ విధించింది. అగర్వాల్, మెహతాలు ఇద్దరు కలిసి ఇండియన్‌బ్యాంకుకు రూ.330 కోట్ల వరకు మోసగించారు. దీంతో పాటు బ్యాంకుల కన్సార్షియానికి రూ.1593కోట్ల వరకు మోసగించారని..గత కొంత కాలం నుంచి వీరు విచారణనుంచి తప్పించుకు తిరుగుతున్నారని సీబీఐ అధికార ప్రతినిధి ఆర్‌కె గౌర్ చెప్పారు.

అధికారుల సమాచారం ప్రకారం 2007 నుంచి అగర్వాల్, మెహతాలు ఇండియన్‌బ్యాంకుతో పాటు ఇతర ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారని..ఈ తంతు 2012 వరకు కొనసాగిందని అధికారులు వివరించారు. అటు తర్వాత 2013 నుంచి డిఫాల్ట్ కావడం మొదలుపెట్టారు. కంపెనీ షేర్లను తనఖా పెట్టి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకొనే వారని సీబీఐ వివరించింది. గతేడాది ఇండియన్‌బ్యాంకు ఫిర్యాదు చేయడంతో సిబీఐ వరుణ్ ఇండస్ట్రీస్‌పై కేసు రిజిస్టర్ చేసింది. అగర్వాల్, మెహతాలు కుట్రపూరితంగా మోసానికి, ఫోర్జరీకి పాల్పడ్డారని సీబీఐ వివరించింది.



ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మార్చి 2013లో విడుదల చేసిన ఉద్దేశపూర్వక ఎగవేతదారుల జాబితాలో వరుణ్ ఇండస్ట్రీస్ దాని అనుబంధ సంస్థలు ప్రభుత్వరంగానికి చెందిన పది బ్యాంకులకు రూ.1242 కోట్లు బకాయిపడ్డాయని తెలిపింది. కాగా 2015లో దేశంలో మొట్టమొదటి ఉద్దేశపూర్వక ఎగవేతదారు కంపెనీగా వరుణ్ ఇండస్ట్రీస్ రికార్డుకెక్కింది.

మొండి బకాయిలకు పరిష్కారం దొరికితే వృద్ధిరేటు, రుణాలకు డిమాండ్ పెరుగుతుంది

• అరవింద్ పనగారియా

న్యూఢిల్లీ : బ్యాంకింగ్ వ్యవస్థలో మొండిబకాయిలకు పరిష్కారం లభిస్తే..వృద్ధిరేటుతో పాటు రుణాలకు డిమాండ్ వాటంతట అవే పుంజుకుంటాయని నీతి ఆయోగ్ చైర్మన్ అరవింద్ పనగారియా చెప్పారు. ప్రస్తుతం మొండి బకాయిలపై బ్యాంకులు సరైన బాటలోనే పయనిస్తున్నాయని ఆయన అన్నారు.ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలనేవి వంశపారంపర్యంగా సంక్రమించే సమస్యలని ఆయన అన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తయినా.. ఈ సమస్య నుంచి గట్టెక్కలేకపోతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్ర భుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని, ఒక వేళ ఎన్‌పీఏ సమస్యకు పరిష్కారం లభిస్తే, రుణాలకు డిమాండ్ పెరుగుతుందని, బ్యాలెన్స్‌షీట్లు బలోపేతం అవుతాయని ఆయన వివరించారు. ముందు బ్యాంకుల వద్ద సరిపడా నిధులు ఉంటే రుణాలు ఇచ్చేందుకు ఇబ్బందులుండవని ఆయన పిటిఐ విలేకరితో మాట్లాడుతూ అన్నారు.



బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం రూ.8 లక్షల కోట్ల మొండిబకాయి లతో కునారిల్లు తోందని.,. వాటిలో రూ.6 లక్షల కోట్లు ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులవని ఆయన వివరించారు. ప్రస్తుతం బ్యాంకుల్లో మొండిబకాయిలు పరిమితిని మించిపోవడంతో రిజర్వుబ్యాంకు ఇటీవలే 12 ఖాతాలను గుర్తించింది. ఈ ఖాతాలను ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ) ప్రొసిడింగ్స్‌కు కిందికి తెచ్చింది. ఈ కంపెనీలు బ్యాంకులకు రూ.5,000 కోట్ల కంటే ఎక్కువ మొత్తం బకాయి పడ్డాయి. ఈ ఖాతాలే మొత్తం ఎన్‌పీఏలో 25 శాతం వాటాను ఆక్రమించాయి. ఆర్‌బీఐ గుర్తించిన మొత్తం 12 కేసుల్లో రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తం ఈ ఖాతాలే ఎన్‌పీఏ కింద మారిపోయాయి.

బలహీనమైన బ్యాంకును బలమైన బ్యాంకులో విలీనం గురించి ఆయనను ప్రశ్నించగా.. ఆయన స్పందిస్తూ ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో స్థిరీకరణ తక్షణావసరమన్నారు. అదే సమయంలో నైపుణ్యం కలిగిన వారు బ్యాంకు రంగంలో చాలా పరిమితంగా ఉంటారని .... ఉదాహరణకు 25 ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులు ఉన్నాయనుకుంటే, ఈ బ్యాంకులన్నీ దేశవ్యాప్తంగా విస్తరించి ఉంటాయని.. నైపుణ్యం కలిగిన వారు విసిరెసినట్లు అక్కడక్కడ ఉంటారని.. కాబట్టి బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలనుకుంటే తక్కువ మొత్తంలోనే బ్యాంకులుండాలని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఆర్థిక మంత్రిత్వశాఖ నీతిఆయోగ్, గ్లోబల్ కన్సెల్టెన్సీ సంస్థలను సంప్రదించి బ్యాంకింగ్ వ్యవ స్థను బలోపేతం చేయడానికి రోడ్ మ్యాప్‌ను కోరింది. త్వరలోనే నీతిఆయోగ్ రోడ్‌మ్యాప్‌ను ఇవ్వబోతోంది. కాగా ఇటీవలే స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో దాని అనుబంధ బ్యాంకులతో పాటు భారతీయ మహిళా బ్యాంకు (బీఎంబీ) విలీనం చేసుకున్న విషయం తెలిసిందే.

హీరో మోటో నుంచి కొత్తగా మూడు స్కూటర్లు

• వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి.. • హోండాకు గట్టిపోటీ ఇచ్చేందుకు..

న్యూఢిల్లీ : ద్విచక్ర వాహన దిగ్గజం హీరోమోటో కార్ప్ కంపెనీ వ్యూహంలో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం కొత్తగా మూడు స్కూటర్లను విడుదల చేయబోతోంది. ఒకప్పటి భాగస్వామి..హోండా ప్రస్తుతం దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉంది. దాని స్థానాన్ని గండి కొట్టేందుకు హీరో ఈ ఆర్థికసంవత్సరం నాలుగో త్రైమాసికంలో 125 సీసీ స్కూటర్‌ను విడుదల చేయాలనుకుంటోంది. మరోరెండు స్కూటర్లను 2018-19 ఆర్థిక సంవత్సరంలో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు కంపెనీలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న వారు చెబుతున్నారు.

దీంతోపాటు ప్రీమియం మోటార్ సైకిళ్ల పోర్టుఫోలియోను విస్తరించాలనుకుంటోంది. ఈ ఆర్థికసంవత్సరం ముగిసేలోగా 200 సీసీ స్పోర్ట్స్‌బైక్‌లను మార్కెట్లో విడుదల చేయబోతోంది. ప్రస్తుతం మోటార్‌సైకిల్ విభాగంలో నెంబర్‌వన్ స్థానంలో కొనసాతున్న విషయం తెలిసిందే. ఇక నుంచి స్కూటర్ విభాగంలో నెంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తోందని విశ్వసనీయవర్గాల సమాచారం. దీనిపై కంపెనీఅధికార ప్రతినిధి స్పందించడానికి నిరాకరించారు. స్కూటర్ సెగ్మెంట్ క్రమంగా పుంజుకుంటోందని, గత త్రైమాసికంలో అప్‌గ్రేడ్ స్కూటర్‌ను మార్కెట్లో విడుదల చేసిన తర్వాత నుంచి అమ్మకాలు జోరందుకున్నాయని ఆయన చెప్పారు.





2016-17 వార్షిక నివేదికలో కంపెనీ సీఎండీ పవన్ ముంజాల్ మాట్లాడుతూ ...మార్కెట్లో స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి సుమారు అరడజను కొత్త ప్రొడక్టులను విడుదల చేయబోతున్నట్లు, వాటిలో ప్రీమియంబైక్‌లతో పాటు స్కూటర్‌లుంటాయని ఆయన చెప్పారు.

కొత్తగా స్కూటర్లను మార్కెట్లో విడుదల చేసిన తర్వాత స్కూటర్ విభాగం మరింత బలోపేతం అవుతుందని... ప్రస్తుతం మార్కెట్లో మ్యాస్ట్రో ఎడ్జ్, డ్యూయెట్ (రెండు110సీసీ) ప్లేజర్(100సీసీ) స్కూటర్లు మార్కెట్లో అందుబాటులో ఉంచింది.

దీనికి వ్యతిరేకంగా హెచ్ఎంఎస్ఐ స్కూటర్ మోడల్స్ విషయానికి వస్తే యాక్టివా 4జీ, డియో, ఏవియేటర్, యాక్టివా ఐ, క్లిక్ ఇవన్నీ110సీసీతో పాటు 125సీసీయాక్టివాలు మార్కెట్లో అందుబాటులో ఉంచింది. ఇక టీవీఎస్ మోడల్ విషయానికి వస్తే జెస్ట్110, స్కూటీపెప్ ప్లస్,వేగో, జుపిటర్‌లున్నాయి.

హోండాతో హీరో విడిపోయి ఆరు సంవత్సరాలు పూర్తయింది.కాగా హీరోమోటో దేశీయ మార్కెట్లో ఇప్పటికి 50శాతం మార్కెట్ వాటాను ఆక్రమించింది. స్కూటర్ సెగ్మెంట్ విషయానికి వస్తే హీరోమోటో 12శాతం కంటే కాస్తా ఎక్కువ వాటా దక్కించుకుంది. అయితే హోండామోటార్‌సైకిల్ మాత్రం 60 శాతం వాటాను ఆక్ర మించింది. టీవీఎస్‌మోటార్‌కో 15 శాతం వాటాను ఆక్రమించింది. ఇటీవలే హోండా 2020 నాటికి మాజీ భాగస్వామి హోరొమోటోను వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమిస్తామని ప్రకటించింది. మొత్తానికి ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ - జులై కాలానికి 22,17,499 యూనిట్లు విక్రయించాయి. ఇక మోటార్‌సైకిళ్ల విషయానికి వస్తే హీరో 21,45,491 యూనిట్లు విక్రయించగా.. హెచ్ఎంఎస్ఐ 6,72,828 యూనిట్లు విక్రయించింది. ఏప్రిల్ నుంచి జులై కాలానికి మొత్తం 41,03,644 యూనిట్ల మోటార్‌సైకిళ్లు విక్రయించబడ్డాయి.

విస్తరణ బాటలో విశాఖ

VISAKA

హైదరాబాద్ : హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న విశాఖ ఇండస్ట్రీస్ భవన నిర్మాణానికి కావాల్సిన పొడక్టులు సింథెటిక్ బ్లెండెడ్ యార్న్‌ను తయారు చేస్తోంది. కాగా హర్యానాలోని జాజ్జార్ జిల్లాలో కొత్త రూ.100 కోట్లతో వి బోర్డు యూనిట్‌నును ప్రారంభించబోతోంది. కాగా కంపెనీ బోర్డు కొత్త ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని 50వేల మెట్రిక్ టన్నులు పెంచుకోవడానికి అనుమతించింది. ఈ ప్రాజెక్టు వచ్చే తొమ్మిది నెలల్ల పూర్తవుతుంది. దీనికి నిధులు అంతర్గతంగా సమకూరుస్తుందని, మార్చి 2018 నాటికి ఉత్పత్తి మొదలవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఫ్లాట్‌గా రూ.342.30 వద్ద ముగియగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.342.88 కోట్లుగా నమోదైంది.

సిద్దిపేట మున్సిపాలిటీకి ఐఎస్ఓ-2015 సర్టిఫికెట్



సిద్దిపేట, కెఎన్ఎన్ : రాష్ట్రంలోనే మొదటి సారిగా ఐఎస్ఓ-2015 సర్టిఫికేట్‌ను సిద్దిపేట మున్సిపాలిటి అందుకోనుంది. స్విడ్జర్‌ల్యాండ్‌కు చెందిన జెనివాస్ కంపెనీ మున్సిపల్ విభాగాల్లో పనితీరు మ్యానువల్‌ను పరిశీలించి ఐఎస్ఓ స్టాండెడ్‌కు ఎంపిక చేసింది. ప్రపంచ దేశాల్లో ఐఎస్ఓ సర్టిఫికేట్‌లు ప్రభుత్వ, ప్రవేట్ సంస్థలు పొందాలంటే జెనివాస్ కంపెనీ ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఏ మున్సిపాలిటిలో లేని విధంగా సిద్దిపేట మున్సిపాలిటీ ఆ కంపెనీ ప్రమాణాలను మూడు నెలలుగా పాటిస్తూ ఇప్పటి వరకు చేసిన పనులతో పాటు చేయబోయే పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మ్యాన్‌వల్‌లో చేర్చడం ఆ కంపెనీ ప్రతినిధులు సంతృప్తి పరిచింది. వెంటనే స్విడ్జర్‌ల్యాండ్‌లోని సంస్థకు సంస్థ ప్రతినిధులు మున్సిపల్ మ్యాన్‌వల్‌ను అందజేయడంతో ఐఎస్ఓ-2015 సర్టిఫికెట్‌ను అందించడానికి సంస్థ అంగీకరించింది.

మున్సిపాలిటీకి మరింత బాధ్యత పెరుగుతుంది

ఐఎస్ఓ-2015 సర్టిఫికేట్‌ను అందుకోవడం వలన మున్సిపాలిటీలో పని చేసే సిబ్బందికి, ప్రజలకు మరింత బాధ్యత పెరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కమిషనర్ రమణాచారిలు అన్నారు. మ్యాన్‌వల్ ఆడిట్ అనంతరం ఐఎస్ఓ ప్రతినిధికి మున్సిపల్ మ్యాన్‌వల్‌ను అందజేశారు.

జాతీయ పంచాయతీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశ వ్యాప్తంగా ఉత్తమ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు అవార్డులు ఇచ్చేందుకు దరఖాస్తులను కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆహ్వానం పలుకుతోంది. దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుంచి అత్యుత్తమ గ్రామ పంచాయితీలకు, మండల, జిల్లా పరిషత్‌లకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దివాస్ రోజుల అవార్డులను ప్రధానం చేస్తున్న విషయం తెలిసిందే.2016-2017 సంవత్సరానికిగానూ ఈ అవార్డుల కోసం ఆల్‌లైన్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పంచాయత్‌వార్డు.జీవోవి.ఇన్‌లో చివరి తేదిలోగా వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.మూడు కేటగిరీలుగా ఈ అవార్డులను ప్రధానం చేస్తారు. ఇందులో దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సశక్తి కరణ్ పురస్కార్ కింద రాష్ట్రం నుంచి ఒక జిల్లా పరిషత్, రెండు మండల, నాలుగు గ్రామపంచాయతీలకు అవార్డులు దక్కుతాయి. అవార్డుల కింద జిల్లా పరిషత్‌కు 50 లక్షలు, మండల పరిషత్‌కు 25 లక్షలు, గ్రామపంచాయతీలకు జనాభా ప్రాతిపదికన 8 నుంచి 12 లక్షల వరకు నగదు పురస్కారం కూడా దక్కుతుంది. ఇక రెండవ విభాగంలో నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ గ్రామసభ పురస్కార్‌ను రాష్ట్రంలోనిఒక గ్రామ పంచాయతీకి ఇస్తారు. గ్రామసభను అభివృద్ధిలో సమర్ధవంతంగా వినియోగించిన గ్రామపంచాయతీకీ 10లక్షల నగదు ప్రోత్సాహకం కూడా అందజేస్తారు. మూడోవిభాగంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను సమర్ధవంతంగా అమ్లు చేసిన పంచాయతీకి ఉపాధిహామి అవార్డుతో పాటు 10 లక్షల నగదు పురస్కారం కూడా దక్కనుంది.

ఎస్సై ఖలీల్ మృతిపై ఎన్నో అనుమానాలు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బాహ్య వలయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదంలో వికారాబాద్ జిల్లాస్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ మహ్మద్ ఖలీల్‌తో పాటు మరో ఇద్దరు శిక్షణ పొందుతున్న మహిళా కానిస్టేబుళ్లలో ఒకరు మృత్యువాత పడగా, మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని రామంతాపూర్, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన శిక్షణా కానిస్టేబుళ్లు కీర్తి, మమతలు ఎస్ఐ వాహనంలో ఎందుకు వెళ్లారన్న అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాహ్యవలయ రహదారికి అనుబంధంగా సర్వీస్‌రోడ్డులో ఎస్ఐ తన డిజైర్ కారు నడుపుతూ చెట్టుకు ఢీకొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ ఇద్దరు మహిళా కానిస్టేబుల్‌లో గాయపడ్డ కీర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ నెల 13 నుంచి 21 వరకు సెలవు దినాలు కావడంతో ఇద్దరు మహిళా కానిస్టేబుల్లు ఇంటికి వస్తున్నామని శనివారం ఉదయం వారి వారి తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి సమాచార మందిం చారు. ఇందులో ఒకరు క్యాబ్‌లో వస్తానని, మరొకరు బస్సులో ఇంటికి చేరు కుంటానని తెలిపారు. అయితే వీరు ఎస్ఐ కారులో ఎందుకు వెళ్లారు? ఆయన తనతో పాటు రమ్మని బలవంతం చేశారా? అసలు జరిగింది ఏమిటి? అన్న అంశంపై పోలీసులు కూపీ లాగుతున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న మమత తేరు కుంటే తప్ప అసలు వాస్తవం బయటపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్‌కు.. సదరు ఎస్ఐకు ముందే ఏమైనా పరిచయాలున్నాయా? ఆ కారణంగానే ఎస్ఐ లిఫ్ట్ ఇస్తానంటే వీరు కారు ఎక్కారా? సర్వీస్ రోడ్డులో కారు నడపాల్సిన అగత్యం ఏమిటి? ఇత్యాది అంశాలపై సైతం పోలీసులు నజర్ సారిం చారు. ఈ ఘటనపై చిక్కుముడులనేకమని.. ఆ చిక్కుము డులను విప్పి అసలు రహ స్యాన్ని ఛేదించే దిశగా పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. కాగా, ప్రమా దంలో గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మమత కోలుకుని వాంగ్మూలం ఇచ్చే వరకూ ఈ అనుమానాలకు తెరపడే అవకాశం లేదు.

పారదర్శకంగా ఎస్సీ రుణాల లబ్ధిదారుల ఎంపిక..?

- పైరవీలకు తావులేకుండా ఎస్సీ కార్పొరేషన్ కసరత్తు
- ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అధికారికంగా జీఓ విడుదల చేసే అవకాశం
- లబ్ధిదారుల నుంచి డిపాజిట్ సేకరణ లేకుండానే రుణాల విడుదల
- బ్యాంకర్లకు సూచించిన ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ

హైదరాబాద్,ఆంధ్రప్రభ : స్వయం ఉపాధి పథకం కింద షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు విడుదల చేసే రుణాల విషయంలో పైరవీలకు తావు ఇవ్వొద్దనే ఆలోచన చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు చెప్పిన వారికి యూనిట్లు కేటాయించడం వల్ల నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నారు. ఈ ప్రతిపాదన విష యంపై ఎస్సీ కార్పోరేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఒక జీఓ విడుదల చేయాలనే ఆలోచనతో కార్పోరేషన్ అధికారులు ఉన్నారు. ఈ విష యంపై రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్ల నుంచి కూడా లాటరీపద్ధతి ద్వారనే ఎంపిక చేయాలని ప్రతిపాదనలు వస్తున్నట్లు సమాచారం. లాటరీద్వారా పద్ధతి అయితే ప్రజా ప్రజా ప్రతినిధులు నుంచి ఒత్తిడి ఉండదని, నిజమైన లబ్ధిదారుడికి న్యాయం జరుగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్టిఫికెట్స్‌ను ముందుగా పరిశీలన చేశాక, అన్ని సక్రమంగా ఉన్నవాటినే లాటరీకి ఎంపిక అవకాశం ఉంది. కాగా స్వయం ఉపాధికి పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందే విధంగా చూడాలని, తద్వారా సమయం వృథా కాకుండా చూడాలని భావిస్తున్నారు. కార్పోరేషన్ నుంచి రుణాలు విడుదల చేసినప్పటికి బ్యాంకులు సకాలంలో విడుదల చేయకపోవడం, లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు సేకరణ చేయడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను కార్పోరేషన్ అధికారులు గుర్తించారు. ఉపాధి కోసమే రుణం ఇస్తున్నప్పుడు తిరిగి లబ్ధిదారుడి నుంచి డిపాజిట్ సేకరణ చేసి అప్పుల్లోకి నెట్టడం సరికాదనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో డిపాజిట్ సేకరణ చేయ కుండానే రుణం ఇవ్వాలని కార్పోరేషన్ అధి కారులు బ్యాంకర్లను ఆదేశించారు. ఈ నిర్ణ యానికి బ్యాంకులు కూడా సమ్మతించాయి. బ్యాంకుల చుట్టు లబ్ధిదారులను తిప్పుకోవడం వల్ల సమయం వృదా కావడం, పైగా అప్పులు పెరగడంతో రుణం ఇచ్చి కూడా ప్రయోజనం లేకుండా పోతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదహరణకు ఒక లబ్ధిదారుడికి కార్పోరేషన్ నుంచి రూ. 1 లక్ష రుణం ఇస్తే.. అందులో బ్యాంకు వాటా 20 శాతం అంటే రూ. 20 వేలు కలిపి ఇవ్వాల్సి ఉంటుం ది. అయితే రాష్ట్రంలోని చాలా బ్యాంకులు మాత్రం లబ్ధిదారుల నుంచి రూ. 20 వేలు డిపాజిట్ చేసుకున్న తర్వాతనే రుణం ఇస్తున్నారు. దీంతో ఆర్ధికంగా ఇబ్బందులున్న పేదవారు బ్యాంకులకు ముందస్తుగా లబ్ధిదారులు రూ. 20 చెల్లించకపోవడం, ఒక వేళ అప్పులు చేసి డిపాజిట్ చేసినా సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల వడ్డీ భారం పడి రెండు రకాలుగా నష్టపోతున్నారనే విషయాన్ని ఎస్సీ కార్పోరేషన్ అధికారులు గుర్తించారు. అంతే కాకుండా గత మూడేళ్లలో పెండింగ్‌లో ఉన్నవారికి కూడా రుణాలు ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నారు. దీంతో 2017-18 ఆర్ధిక సంవత్సరానికి గాను దరఖాస్తు దారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్నవారికి రుణాలు ఇవ్వకపోతే.. ఈ ఏడాది తిరిగి వారు దరఖాస్తు చేసుకోవడం వల్ల రెట్టింపుగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకనే ముందుగా పెండింగ్ వాటిని పరిష్కరించా మిగతావాటిపై దృష్టి సారిస్తే బాగుంటుందనే నిర్ణయానికి కార్పోరేషన్ అధికారులు వచ్చినట్లు తెలిసింది. గత మూడేళ్లలో 72 వేల మంది లబ్ధిదారులను గుర్తించగా అందులో దాదాపు 40 శాతం పెండింగ్‌లోనే ఉన్నట్లు గుర్తించారు. పెండింగ్‌లో ఉన్నవాళ్లకు ఈ నెలఖర్ లేదంటే వచ్చే నెలలో పూర్తి చేసి 2017-18 ఆర్ధిక సంవత్సరంలో ఎంపిక చేసిన వారికి జనవరి వరకు పూర్తి గ్రౌండింగ్ చేయాలనే ఆలోచనతో ఉన్నారు.ఇదిలా ఉంటే లాటరీ పద్ధతి బాగానే ఉన్నప్పటికి ఈ విధానం ద్వారా నిజమైన వారికి లబ్ది జరుగుతుందా..? అనే ప్రశ్న ఉత్ప న్నమవుతుంది. రునం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడు అదృష్టంపైనే ఆదారపడాల్సి వస్తుందనే వాద న కూడా వినిపిస్తుంది. కొంత మంది అవసరం లేకున్నా దరఖాస్తు చేసుకుంటారని, అటు వంటి వారికి కూడా లాటరీ ద్వారా లక్కి తగిలే అవకాశం ఉంటుందని, తద్వార నిజమైన వారికి అన్యాయం జరిగే అవకాశం లేకపోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గవర్నర్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ తెలుగు ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియచేశారు. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా వానవాళికి ఇచ్చిన గీతోపదేశం అద్వితాయం, ఆచరణాత్మకం అని పేర్కొన్నారు. గోకులాష్టమిని ప్రజలంతా భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కోరారు. శాంతి, సౌభ్రాతృత్వం, స్నేహభావం, సామర్యతను పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు.

రాష్ట్రానికి నీరు వదలండి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి తెలంగాణ రాష్ట్రా నికి నీరు విడుదల చేసే విషయం పరిశీలిస్తామని కర్నాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బీపీ పాటిల్ హామీఇచ్చారు. కర్నాటక రాష్ట్రం నారాయణపూర్ డ్యాం నుండి నీరు వదలకపోవడంతో రాష్ట్రంలోని జూరాల , శ్రీశైలం ప్రాజెక్టులకు కృష్ణా నది నీరు చేరని విషయాన్ని గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి ఆదివారం ఫోన్ లో బీపీ పాటిల్ దృష్టికి తెచ్చారు. తమ ప్రాజెక్టులకు నీరు రాక పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవడమే గాక పశుగ్రాసానికి కూడా ఇబ్బందిగా మారిందని పాటిల్ దృష్టికి తెచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం కోరిన విధంగా 15 టీఎంసీల నీటిని విడుదల చేయ కపో యినప్పటికీ, ప్రజల అవసరాల మేరకు నీరు విడుదలకు సహ కరిస్తామన్నారు.

నైట్ షెల్టర్లకు హైటెక్ సౌకర్యాలు

- ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్లు డిష్ టీవీలు, ఎయిర్ కూలర్లు
- అన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కడు పేదరికం కారణంగా తలదాచుకునేందుకు చిన్న పూరి గుడిసెలు కూడా లేని వారి సంఖ్య మన రాష్ట్రంలో కొదవ లేదు. అలాంటి వారికి ఫుట్‌పాత్‌లు, పార్కులే ఆశ్రయంగా మారుతున్నాయి. వీరి కోసం ప్రభుత్వం నైట్ షెల్టర్లు ఏర్పాటు చేసినప్పటికీ అందులో ఎవరు ఉండడం లేదు. వాటిల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లోని షెల్టర్లకు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా షెల్టర్లలో ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్లను ఏర్పాటు చేయనుంది. అలాగే రిక్రియేషన్ సౌకర్యాలు, డిష్‌తో కూడిన టెలివిజన్, ఎయిర్ కూలర్లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇక షెల్టర్లలో ఐదు రూపాయల భోజన కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. తాగు నీటికోసం ఆర్వో (రిసర్వ్ అస్మోసిస్) కేంద్రాలు, స్వయం ఉపాధి అవకాశాల కోసం ప్రాథమిక ఆరోగ్య వైద్యంపై తగు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. కాగా షెల్టర్లలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు స్థానిక పోలీసులచే తరుచూ తనిఖీలు నిర్వహించనున్నారు.కాగా జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న షెల్టర్ల పనితీరును పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ బృందం కొద్ది రోజుల క్రితం రాష్ట్రంలో పర్యటించింది. ఈ సందర్భంగా షెల్టర్లను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేసింది. షెల్టర్లలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సౌకర్యాలను కల్పించాలని సూచించింది. అప్పుడే షెల్టర్లలో ఉండేందుకు ఆసక్తి చూపుతారని కమిటీ సభ్యులు స్పష్టం చేసినట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ పరిధిలోని మెప్మా (పట్టణ దారిద్ర్య నిర్మూళన సంస్థ) విభాగంతో పాటు అన్ని స్థానిక సంస్థలు సుప్రీం కోర్టు కమిటీ సభ్యులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా షెల్టర్లలో తగు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ టికె. శ్రీదేవి వారం రోజుల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు, స్థానిక పట్టణ సంస్థల కమిషనర్లకు ప్రత్యేకంగా లేఖలను రాశారు. షెల్టర్లలో అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని ఆ లేఖలో ఆమె కోరారు. దీన్‌దయాల్ అంత్యోదయ యోజన- నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ (డే-ఎన్‌యుఎల్ఎమ్) సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా షెల్టర్లను పనిచేసే విధంగా ఒప్పదం చేసుకోఇవాలని సూచించారు. అన్ని స్థానిక సంస్థల పరిధిలో కమిషనర్ నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ కమిటీలను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని శ్రీదేవి ఆదేశించారు. ఈ కమిటీ నెలకోసారి సమావేశమై షెల్టర్ల పనితీరుపై సమీక్షించాలన్నారు. ఇప్పటికే మంజూరైన వాటిని త్వరగా నిర్మించాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో సరైన ఉపాధి అవకాశాలు లభించిన వారు, ఇతర కారణాల వల్ల పెద్ద ఎత్తున ప్రజలు గ్రామాలను వదిలిపెట్టి పట్టణాలను ఆశ్రయిస్తున్నారు.

ఢిల్లీలో జర్నలిస్టుల త్రివర్ణ పతాక జైత్రయాత్ర



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, జాతీయ సమైక్యతను చాటి చెప్పే ఉద్దేశంతో దేశ రాజధానిలో తొలిసారిగా జర్నలిస్టులు త్రివర్ణ పతాక జైత్రయాత్ర చేపట్టారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యుజె) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆరెస్సెస్ అధినేత ఇంద్రేష్‌కుమార్ ఆదివారం ఉదయం ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. యాత్ర ప్రారంభించడానికి ముందే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పాత్రికేయులు అమర జవాన్లకు నివాళులు అర్పించారు. ఆగస్ట్ 10న జార్ఖండ్‌లో యాత్ర చేపట్టిన నిర్వాహకులకు ఢిల్లీలో జర్నలిస్టులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఢిల్లీ నుంచి మొదలైన త్రివర్ణ పతాక జైత్రయాత్ర 15వ తేదీ ఉదయం జమ్మూ కాశ్మీర్‌కు చేరుకుంటుంది. జై జవాన్ - జై కిసాన్, అమర జవాన్లక ు జోహార్లు నినాదాలతో కాత్రాలోని వైష్ణో దేవి ఆలయం గుండా శ్రీనగర్ చేరుకోవడంతో తిరంగ్ సమ్మాన్ యాత్ర ముగుస్తుంది. సాయి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి శరణాగత్ (భాయిజీ), ఐఎఫ్‌డబ్ల్యుజె కార్యదర్శి విపిన్ దులియా, ఐఎఫ్‌డబ్ల్యుజె బీహార్ అధ్యక్షుడు హేమంత్ సింగ్, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణశర్మ, ఢిల్లీ జర్నలిస్టు యూనియన్ నాయకులు రహ్మతుల్లా, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ తమిళనాడు అధ్యక్షుడు సగయ్ రాజ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, ప్రధాన కార్యదర్శి బి.బసవ పున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యుజె జాతీయ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, ఐఎఫ్‌డబ్ల్యుజె కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాణిక్ ప్రభు, యాత్ర ఇన్‌చార్జి షానవాజ్ హాసన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'కుంతియా..వాస్తవాలు తెలుసుకుని మాట్లాడు'

టిఆర్ఎస్ ఎంపీ బూరనర్సయ్య గౌడ్ ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కుంతియా వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని, టిఆర్ఎస్ మూడేళ్ళ పాలనలో కెసిఆర్ కుటుంబమే బాగుపడిందంటూ చేస్తున్న విమర్శలు అర్ధలేనివని టిఆర్ఎస్ ఎంపీ బూరనర్సయ్య గౌడ్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నింటినీ తెలంగాణ రాష్ట్రాన్నే ఒక కుటుంబంగా భావించి సిఎం అమలుచేస్తున్నారని, రాష్ట్రంలో నిరంతర విద్యుత్ ప్రతి కుటుంబానికీ అందుతోందన్నారు. వేయి రూపాయల పింఛన్ అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతోందని, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ రాష్ట్రంగా ముందుకు సాగుతోందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే విధంగా, మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలోని ప్రతి చెరువునూ బాగుచేసి రైతుల ఆశలు తీర్చేవిధంగా పనిచేస్తుందన్నారు. టిఆర్ఎస్ మూడేళ్ళపాలనపై కాంగ్రెస్ ఛార్జిషీట్ వేయడం కాదని, తెలంగాణకు కాంగ్రెస్ చేసిన మోసాలపై, ప్రజలపై చేసిన దాష్టీకాలపై తామే షీట్ వేస్తామన్నారు. కుంతియా వాస్తవాలు తెలుసుకుని హుందాగా మాట్లాడాలన్నారు. అవివేకంతో వ్యవహరించవద్దన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్ధి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. రాష్ట్రంలో విద్యా రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని వాటిని పరిష్కరించాలని కోరుతూ సంఘం నాయకులు ఆదివారం ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరికి విజ్ఞప్తి చేశారు. కడియంను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, విద్యార్ధినుల కన్వీనర్ రజిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేష్, జావేద్, సంతోష్, అశోక్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. చాలా హాస్టల్స్‌కు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. గురుకులాల్లో ఏఎన్ఎంలు లేక సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధపడుతున్నారని తెలిపారు.

ఇంటర్ బోర్డుకు బెస్ట్ డిజిటల్ ఇన్షియేటివ్ అవార్డు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు మరో అవార్డును సొంతం చేసుకుంది. 29 సేవలను ఆన్‌లైన్ చేసిన నేపథ్యంలో గతంలో బెస్ట్ డిజిటల్ అవార్డును సొంతం చేసుకున్న బోర్డు ఇప్పుడు బెస్ట్ డిజిటల్ ఇన్షియేటీవ్ ఇన్ గవర్నమెంట్ అవార్డును సొంతం చేసుకుంది. శనివారం ఢిల్లీలో జరిగిన వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఈ అవార్డును శ్రీలంక విద్యా శాఖ మంత్రి విఎస్ రాధకృష్ణన్ చేతుల మీదుగా ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ ఈ అవార్డును అందుకున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ పురస్కారాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా పుర స్కారాలు ప్రకటించింది. పోలీసుశాఖ, సాంస్కృతిక శాఖలతో పాటు ఇన్సెంటివ్ అవార్డుకు ఎంపికైన రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల జాబితాను కూడా ఆదివారం రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ విడుదల చేశారు.

పోలీస్ శాఖ

1. అంజన్‌కుమార్, ఐపిఎస్, అడిషనల్ డిజిపి,
2. రాజీవ్ రతన్, ఐపిఎస్ డిజి, ఫైర్‌సర్వీసెస్
3. ఎన్.సూర్యనారాయణ, ఐపిఎస్, ఓఎస్‌డి, డిఐజి విఅండ్ ఈ
4. ఎం.శివప్రసాద్, ఐపిఎస్, అడిషనల్ సిపి

తెలంగాణ స్టేట్ ఇన్సెంటివ్ అవార్డ్స్

1. డాక్టర్ జె.రమేష్, డిప్యూటీ డిఎంహెచ్‌వో, ఆర్మూర్, నిజామాబాద్
2. డాక్టర్ సీహెచ్ మధుసూధన్, ఉస్మానియా మెడికల్ కాలేజి
3. సురేష్ బాబు, డిపిఓ, సిద్దిపేట
4. పిడబ్ల్యు జాన్సన్, డిఆర్‌డిఓ, వికారాబాద్
5. ఖానాపూర్ చంద్రకళ, ఆర్‌డిఓ హైదరాబాద్
6. జి.విశ్వనాథం గుప్తా, హెచ్‌ఎం, రంగారెడ్డి,
7. రమీజుద్దీన్ అహ్మద్, పెద్దపల్లి
8. ఎం.జయమ్మ, స్టాఫ్ నర్స్, మహబూబ్‌నగర్,
9. కె.ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి, వరంగల్ రూరల్
10. డి.శంకర్ కుమార్, పిఎ టు సిపిఆర్‌ఓ, ఐఅండ్ పిఆర్
11. బి.దశరథ, సైకిల్ ఆర్డర్లీ, ఉమెన్ అండ్ సిడి
12. కె.గంగయ్య, ఆఫీస్ సబార్డినేట్, కామారెడ్డి
13. కె.కిష్టయ్య, ఆఫీస్ సబార్డినేట్, యాదాద్రి

హరితమిత్ర అవార్డులు

1. వై.శంకర్ రెడ్డి, ప్రజాప్రతినిధి, వరంగల్(రూరల్)
2. పెద్ది సుదర్శన్‌రెడ్డి, ప్రజాప్రతినిధి, వరంగల్ (రూరల్)
3. సి.శ్రీధర్ రావు, జిల్లా అటవీఅధికారి, సిద్దిపేట
4. ఎంపిపిఎస్, మూరపల్లి, జగిత్యాల
5. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్స్, రామగుండం సింగరేణి జిఎం

పోలీశాఖ ఐపిఎం-2015 అవార్డులు

1.టి.శరత్ బాబు, అడిషనల్ ఎస్పీ, సిఐడి
2. నీల్‌గిరి దివ్యచరణ్ రావు, అడిషనల్ డిసిపి ట్రాఫిక్, సైబరాబాద్
3. టి.సుదర్శన్, డిఎస్పీ, ఎసిబి, కరీంనగర్
4. వుప్పు తిరుపతి, ఎసిపి, మహంకాళి పిఎస్, హైదరాబాద్
5. మాదాడి రమణకుమార్, ఎసిపి మాదాపూర్, సైబరాబాద్
6. శావిలి ప్రేమ్‌రాజ్, ఎఎస్ఐ, కమ్యూనికేషన్స్, ఐఎస్‌డబ్ల్యు
7. మాడంశెట్టి వెంకట్‌రావు, ఆర్ఐ, ఐఎస్‌డబ్ల్యు
8. పటోళ్ల మధుసూధన్‌రెడ్డి, ఎస్ఐ, ఎస్ఐబి
9.సయ్యద్ యూసుఫుద్దీన్, ఆర్ఎస్ఐ, నల్లగొండ
10.గజ్జెల లక్ష్మయ్య, హెడ్‌కానిస్టేబుల్, సైబరాబాద్
11. అన్ను దామోదర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్,
12. సిద్దు సదానందం, డిఎఆర్ వరంగల్
13.డి.సిద్దయ్య, ఎస్ఐ
14. సి.నాగరాజు, పిసి
15.ఎండి యూసుప్ అలీఖాన్, లీడింగ్ ఫైర్‌మెన్, లంగర్‌హౌజ్
16.కె.వెంకట్‌రెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్, సాలార్జంగ్ మ్యూజియం
17.కె.శ్రీశైలం, లీడింగ్ ఫైర్‌మెన్, మాదాపూర్, రంగారెడ్డి
18. ఎండి. యాసీన్, లీడింగ్ ఫైర్‌మెన్, మలక్‌పేట, హైదరాబాద్
19. బి.మల్లయ్య, లీడింగ్ ఫైర్‌మెన్, కరీంనగర్
20.వి.ఈదయ్య, లీడింగ్ ఫైర్‌మెన్, హుజూర్‌నగర్, నల్లగొండ
21. కె.శంకరయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ , నారాయణపేట

తెలంగాణ స్టేట్ ఇన్సెంటివ్ అవార్డ్స్

1. డాక్టర్ జె.రమేష్, డిప్యూటీ డిఎంహెచ్‌వో, ఆర్మూర్, నిజామాబాద్
2. డాక్టర్ సీహెచ్ మధుసూధన్, ఉస్మానియా మెడికల్ కాలేజి
3. సురేష్ బాబు, డిపిఓ, సిద్దిపేట
4. పిడబ్ల్యు జాన్సన్, డిఆర్‌డిఓ, వికారాబాద్
5. ఖానాపూర్ చంద్రకళ, ఆర్‌డిఓ హైదరాబాద్
6. జి.విశ్వనాథం గుప్తా, హెచ్‌ఎం, రంగారెడ్డి,
7. రమీజుద్దీన్ అహ్మద్, పెద్దపల్లి
8. ఎం.జయమ్మ, స్టాఫ్ నర్స్, మహబూబ్‌నగర్,
9. కె.ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి, వరంగల్ రూరల్
10. డి.శంకర్ కుమార్, పిఎ టు సిపిఆర్‌ఓ, ఐఅండ్ పిఆర్
11. బి.దశరథ, సైకిల్ ఆర్డర్లీ, ఉమెన్ అండ్ సిడి
12. కె.గంగయ్య, ఆఫీస్ సబార్డినేట్, కామారెడ్డి
13. కె.కిష్టయ్య, ఆఫీస్ సబార్డినేట్, యాదాద్రి

పాఠశాల విద్య

1. తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్, తాటిపల్లి, జగిత్యాల
2.జడ్పీ హైస్కూల్, మిరాద్ పల్లి, ఆర్మూర్ (మం), నిజామాబాద్

సాంస్కృతిక శాఖ

సుద్దాల అశోక్ తేజ, ఎం.జయరాజు(పాటల రచయితలు), భాస్యంవిజయసారధి

ఐఏఎస్ అధికారులకు ఎక్సలెన్స్ 2017 అవార్డులు

అధికారి పేరు	పనిచేస్తున్న హోదా	అభివృద్ధి కార్యక్రమం
దేవసేన	కలెక్టర్ జనగామ	పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణ
జ్యోతి	కలెక్టర్ ఆదిలాబాద్	కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్
బుద్ధప్రకాష్	ఐటీడీఏ పీవో	ఐటీడీయేల్లో స్టార్స్-30 కార్యక్రమం
ఆర్వీ కిరణ్	ఐటీడీఏ పీవో	ఐటీడీయేల్లో స్టార్స్-30 కార్యక్రమం
అనురాగ్ జయంత్	ఐటీడీఏ పీవో	ఐటీడీయేల్లో స్టార్స్-30 కార్యక్రమం
చిరంజీవులు	హెచ్ఎండీఏ కమిషనర్	డీపీఎంఎస్ కార్యక్రమం
యోగితా రాణా	కలెక్టర్ నిజామాబాద్	నిస్సహాయ పిల్లలకు పునరావాసం
మురళి	కలెక్టర్ భూపాలపల్లి	ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం
శరత్	కలెక్టర్ జగిత్యాల	ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకం
వెంకట్రామిరెడ్డి	కలెక్టర్ సిద్ధిపేట	మిషన్ భగీరథ కార్యక్రమం
హనుమంతు	కలెక్టర్ కొత్తగూడెం	మిషన్ కాకతీయ
సురేంద్రమోహన్	కలెక్టర్ సూర్యాపేట	హరితహారం
ప్రశాంత్ పాటిల్	కలెక్టర్ వరంగల్ రూరల్	హరితహారం
గౌరవ్ ఉప్పల్	కలెక్టర్ నల్లగొండ	ఆరోగ్య లక్ష్మి



బాబాయ్ ఆశయాలను కొనసాగిస్తా

● నంద్యాల టీడీపీకి కంచుకోట

'ఆంధ్రప్రభ' ప్రతినిధితో టీడీపీ అభ్యర్థి భూమా



కర్నూలు, కెఎన్ఎన్ బ్యూరో: నంద్యాల అభివృద్ధికి కలలు కన్న తన బాబాయ్, దివంగత భూమా నాగిరెడ్డి ఆశయా లను కొనఊపిరి ఉన్నంత వరకూ కొనసాగిస్తానని నంద్యాల ఉప ఎన్నిక టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు.ఆదివారం ఆయన ఆంధ్రప్రభ ప్రతినిధితో పలు విషయాలు వెల్లడించారు. నంద్యాలలో ప్రచారానికి వెళ్తున్న కాలనీలో టీడీపీ వ్యవస్థాపక నేత ఎన్‌టిఆర్, చంద్రబాబు నాయు డు, తర్వాత బాబాయ్ నాగిరెడ్డి పేర్లను ప్రజలు తల చుకుంటున్నారని తెలిపారు. టీడీపీకి ఇంత ఆదరణ ప్రజల్లో చూస్తుంటే గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. నంద్యాల అభివృద్ధిని నంద్యాల ప్రజలు కళ్లారా చూశారని, ఇప్పుడు కూడా చూస్తున్నారని, ఇంకా భవిష్యత్‌లో నంద్యాలను నందన వనం చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి దూరదృష్టితో పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టు లను నిర్మించడం వలన మన శ్రీశైలం నీటి వాటా పెరిగి, నంద్యాల తాగునీటి కష్టాలు తొలగిపోయాయని పేర్కొన్నారు. 9వ వార్డులో ఉన్న నీటి సమస్యను పరిష్కరించామని, నడిగడ్డలో ఇంకా తీవ్ర నీటి ఎద్దడి ఉంటే వారికి ప్రత్యేక పైప్‌లైన్లు వేయించి నీటి కొరత లేకుండా చూశామన్నారు.

రాష్ట్రాభివృద్ధి బాబుతోనే సాధ్యం

● టీడీపీ అభ్యర్థిని 50 వేల మెజార్టీతో గెలిపిద్దాం

● తెదేపాకు ఆర్యవైశ్యులు అండగా నిలవాలి: మంత్రి శిద్దా



నంద్యాలలో వైశ్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి శిద్దా

నంద్యాల అర్బన్ , కెఎన్ఎన్ : రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. ఆదివారం రాత్రి నంద్యాలలోని ఆదివారం రాత్రి వైశ్యుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు కాల్వ శ్రీనివాసరావు, అమరనాథ్‌రెడ్డి, అఖిలప్రియ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, జయంతి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులతో కలసి ఆయన ఆర్యవైశ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ, రాష్ట్ర రాజకీయాలను ఆర్యవైశ్యులు పొట్టి శ్రీరాములు ప్ర భావితం చేశారన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి సమర్థవంతమైన పాలన అందిస్తున్నారన్నారు.

భారతదేశంలోని అన్ని రాష్ట్రాలతో మన రాష్ట్రాన్ని ముందుకు తీసుకొని పోతున్నారన్నారు. ఆర్యవైశ్యులు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలన్నారు. ఉప ఎన్నికల్లో నంద్యాల టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి సహాయ సహకారాలు అందించాలన్నారు. రాష్ట్రం ముందుకుపోవాలంటే చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో 30 సంవత్సరాలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. ఆర్యవైశ్యులు తమ సమస్యలను తమ దృష్టికి తెస్తే తప్పక పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భూమా బ్రహ్మానందరెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో లబ్ది పొందేందుకు వైసీపీ అధినేత ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తానని ప్రకటించారని, గత సార్వత్రిక ఎన్నికల్లో ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. రోడ్ల విస్తరణలో నష్టపోయిన బాధితులకు షాపులను కట్టించి ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించి రాబోయే రోజుల్లో మన సమస్యలను మంత్రులతో పరిష్కరించుకుందామన్నారు.

అంబికా కృష్ణ మాట్లాడుతూ గాంధీ మహాత్ముడు ఆర్యవైశ్యులంటే ప్రపంచానికి తెలియజెప్పారన్నారు. నీతి, నియమాలకు కట్టుబడి ఉండటం ఆర్యవైశ్యులకు సాధ్యమన్నారు. చక్రపాణిరెడ్డి ఆర్యవైశ్యుల పట్ల చేసిన వ్యాఖ్యానాలను ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. ఆర్యవైశ్యులు ఉద్యమిస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమ వేడి రగులుతుందన్నారు. మంత్రులు కాల్వ , అఖిల, సోమిరెడ్డి, అమరనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ నంద్యాల నియోజక వర్గంలో అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, పోతుల సురేష్, మాజీ మంత్రి మారెప్ప, జెవిసి మనోహర్, జెవిసి హారిక, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

భవనాలు కూల్చి... రోడ్లు తవ్వితే అభివృద్ధా?



నంద్యాల, నంద్యాలక్రైం, కెఎన్ఎన్ : నంద్యాలలో ఉప ఎన్నికలు వస్తున్నాయని తెలిసిన వెంటనే రాత్రి పగలు అన్న తేడా లేకుండా భవనాలను కూల్చి రోడ్లను తవ్వితే అభివృద్ధి జరిగినట్టా అని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు మూడేళ్ళ పాలనలో ఒక ఇల్లైనా కట్టారా అని ప్రశ్నించారు. రైతులకు ఎంతో ముఖ్య మైన గుండ్రేవుల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో అక్కా, చెల్లెళ్ళు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అవినీతి పరుడని ఆరోపించారు. నంద్యాలలో ఆయన రోడ్ షో నిర్వహించారు. శ్రీనివాస సెంటర్‌లో ప్రారంభమైన పాదయాత్ర పట్టణ పురవీధుల గుండా సాగింది. ముందుగా ఆయన ఆదివారం కావడంతో సిఎస్ఐ చర్చిలో బిషప్ పుష్పలత దీవెనలను అందుకున్నారు. ప్రధాన కూడళ్ళ వద్ద ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలను ముఖ్య మంత్రి ఇచ్చి గద్దెను ఎక్కారన్నారు. హామీల సంఖ్య 600లకు పైగా దాటిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు కూడా అబద్ధాలు ఆడే వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే ఒక్క చంద్రబాబే అన్నారు. కర్నూలు జిల్లాకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చలేదన్నారు. రైతుల రుణాలు నేటికి మాఫీ కాలేదన్నారు. మూడేళ్ళలో ఒక పైస కూడా నంద్యాల అభివృద్ధికి విడుదల చేయని చంద్రబాబు ఉప ఎన్నికలు రావడంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నానని, ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నా రన్నారు. ఎన్నికలు వస్తాయని తెలియడంతో అర్ధరాత్రి వేళ భవనాలను కూల్చి రోడ్లను త్రవ్వేసి అభివృద్ధిని అరచేతిలో చూపిస్తున్నారన్నారు. అభివృద్ధి అనే పదానికి అర్థం చంద్రబాబుకు తెలియదన్నారు. ప్రతి పేదవాడి ఇంట్లో ఫోటో పెట్టుకుంటే అది అభి వృద్ధి అన్నారు.

ఇక పక్కాగా భూ లెక్క



(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక కమిటీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల తర్వాత సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదిక అందజేయనుంది. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం, వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలనుకున్న ఎకరాకు రూ.4వేల పెట్టుబడి పథకం అమలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వం భూప్రక్షాళన ప్రారంభించింది. సర్వే అంకెలలో గందరగోళాన్ని తొలగించి భూములను సాగుచేస్తున్న వారెవరు? ఏ సర్వే భూమి ఎక్కడ ఉంది? ఆ సర్వే నంబర్లు ఏంటి? అనే విషయంలో స్పష్టత కోసం సెప్టెంబర్ మాసంలో భారీ ఎత్తున సమగ్ర సర్వేను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం కార్యాచరణ రూపొందించే పనిని సిద్దిపేట, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది.

రంగారెడ్డి జిల్లా సంయుక్త కలెక్టర్, కొందరు రెవెన్యూ డివిజన్ అధికారులు, సర్వే ఆఫ్ ఇండియా, అటవీ అధికారులతో ప్రభుత్వం కమిటీలను నియమించింది. ఈ కమిటీ రెండు రోజుల క్రితం సమావేశమై రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ఎలా చేపట్టాలనే అంశంపై విధి విధానాల తయారీకి అధ్యయనం ప్రారంభించింది. శని, ఆదివారాలలో రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని మూడు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా సర్వేకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంది? పూర్వకాలంలో టిప్పన్ వ్యవస్థ ద్వారా చేపట్టిన సర్వే మూలంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి? వాటిని ఎలా పరిష్కరించుకోవాలి? సర్వే పక్కాగా ఎలా జరపాలి? అనే అంశంపై అధికారులు దృష్టిసారించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, చింతపల్లిగూడలో జిల్లా సంయుక్త కలెక్టర్ సుందర్అబ్నార్ ఆధ్వర్యంలో నమూనా సర్వే ప్రారంభమైంది. చింతపల్లిగూడలోని భూములు స్థిరాస్థి లేఅవుట్‌లు ఎక్కువగా ఉండటంతో ఆ గ్రామ స్థానంలో సర్వేకు ఎర్రగుంట్ల గ్రామాన్ని అధికారులు ఎంపిక చేసుకున్నారు. మంత్రి హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం దేవాపూర్ గ్రామంలో సర్వేను జిల్లా రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. నిజాం కాలంలో గొలుసులతో నిర్వహించిన సర్వే స్థానంలో ప్రస్తుతం అధునాతన సాంకేతిక వ్యవస్థను వినియోగించి భూముల వివరాలను రాబట్టే పనిలో అధికారులున్నారు. సర్వే ఆఫ్ ఇండియా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. కంట్రోల్ పాయింట్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో మరో నిర్దేశిత కేంద్రాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో భూముల హద్దులను పక్కాగా గుర్తిస్తున్నారు. ప్రతి రైతు, భూస్వామి, ఇతర వ్యక్తుల భూమిని డీజీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే నిర్వహిస్తున్నారు. అక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు రెవెన్యూశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. పంట పొలాలకు, భూములకు హద్దులను గుర్తించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సర్వే జరుపుతున్నారు. రైతుల భూములకు సర్వే నిర్వహిస్తున్న అధికారులు అవి తేలిన తర్వాత అసైన్డ్, శిఖం, సీలింగ్ భూముల వివరాలు సేకరించనున్నారు. వివాదాల్లో ఉన్న భూముల వివరాలను గుర్తించి వాటిని పక్కనపెట్టనున్నారు. సర్వే తొలి రోజు శనివారం ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడలో 75 సర్వే నంబర్లకు గాను 35 సర్వే నంబర్లను పునః సర్వే నిర్వహించారు. ఆ ప్రకారంగా రాష్ట్రవ్యాప్తంగా భూముల సర్వేకు కావాల్సిన యంత్రాలు, మానవ వనరులను అంచనా వేయనున్నారు. ప్రయోగాత్మక సర్వేలో వచ్చిన ఫలితాలను విశ్లేషించి మెరుగైన విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు యోచిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సర్వేకు వెళ్లినప్పుడు ముందస్తుగా గ్రామ సర్పంచ్ లేదా ఎగ్జిక్యూటివ్ అధికారి ద్వారా సమాచారం అందించాలని సర్వే జరుగుతున్న సమయంలో భూ యజమానులు, రైతులు స్థానికంగా ఉండి తమ భూ హద్దులను చూపించవలసి వస్తుందని ఇప్పటికే ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ద్వారా సమాచారం పంపించారు.

ఈ ప్రయోగాత్మక సర్వేలో వచ్చిన ఫలితాలను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పునఃసర్వేపై అధ్యయనం చేయనున్న కమిటీ ఈ నెల 17 లేదా 18వ తేదీన సీఎం కేసీఆర్‌ని కలిసి నమూనా సర్వేలో వచ్చిన ఫలితాలను, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక సిద్ధం చేసి సమర్పించనుంది. ఆ ప్రకారం సెప్టెంబర్ మాసంలో మూడు మాసాలు పాటు ఏకబిగిన రాష్ట్రంలోని 31 జిల్లాల్లో భూసర్వేను నిర్వహించి అందులో వచ్చిన ఫలితాలను ప్రభుత్వానికి అందించనుంది. ఈ సర్వే ఫలితాల ఆధారంగా ప్రభుత్వం కొత్తగా భూస్వాములు, రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేయాలని నిర్ణయించింది. దీనికి తోడు ప్రతి రైతుకు తాను పండించే పంటలకు ఎకరాకు రూ.4వేల చొప్పున ఏడాదిలో రెండు పంటలకు మొత్తం రూ.8 వేలను పెట్టుబడి రూపంలో ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే అధికారిక ప్రకటన చేశారు. సిద్దిపేట జిల్లాలో రెండు గ్రామాలను ఎంపిక చేసుకుని అక్కడి భూములపై సర్వే జరిపితే ఊహించని ఫలితాలు రావడంతో సీఎం కేసీఆర్ ఒక్కసారిగా కంగుతిన్నారు. సర్వేకు, అందుబాటులో వున్న రెవెన్యూ రికార్డులకు పొంతన లేకపోవడంతో ఆయనకు అనుమానమొచ్చింది. తీరా భూములకు సంబంధించి లోతుగా అధ్యయనం చేస్తే అనేక వాస్తవాలు వెలుగు చూశాయని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మరోసారి భూసర్వేను నిర్వహించాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చారని అధికారవర్గాలు చెబుతున్నాయి. జాతీయస్థాయిలో ఉన్న 20 సంస్థలకు భూసర్వే పనులు అప్పగించాలని ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. జాతీయస్థాయిలో బహిరంగ టెండర్ల ద్వారా ఏజెన్సీలను ఖరారు చేసి సర్వే పనులు అప్పగించాలని కేసీఆర్ ప్రతిపాదించారు. ప్రస్తుతం రెవెన్యూశాఖ, వ్యవసాయాధికారుల వద్ద భూ రికార్డులు ఉన్నాయి. కొన్ని భూములు వివాదంలో ఉండగా వాటిని పరిష్కరించడంతో పాటు ఏ భూమి ఎవరిది? అనే విషయంలో ప్రత్యేక సర్వే ద్వారా స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. నిజాం కాలంలో మాత్రమే భూరికార్డుల విషయంలో పెద్ద ఎత్తున సర్వే జరిగిందని, ఆ తర్వాత ఇంత పెద్ద ఎత్తున కేసీఆర్ ప్రభుత్వమే పునః సర్వేకు పూనుకుందని వారంటున్నారు. గ్రామంలో అసలు ఎంత భూమి ఉంది? ఎవరి పేరు మీద భూములు ఉన్నాయి? అనే విషయాలు ఈ సర్వే ద్వారా వెల్లడవుతాయని, భూమి హక్కులకు సంబంధించి స్పష్టత ఇవ్వడంతో పాటు ఆ వివరాలను బహిర్గతం చేసేందుకు గ్రామంలోని ముఖ్య కూడలి వద్ద వీటి వివరాలను ప్రదర్శించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెబుతున్నారు. భూలెక్కలు తేలాక కొత్తగా రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, ప్రతి రైతుకు ఆయన అందజేసే పాస్ పుస్తకానికి ఒక కోడ్‌ను ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎక్కడ ఎవరు భూమి కొన్నా.. అమ్మినా.. పేరు మార్పిడి జరిగినా.. వారసులకు దక్కినా ఆ వివరాలన్నీ వెనువెంటనే కంప్యూటర్లలో, రికార్డుల్లో నిక్షిప్తమైపోతాయి. సరిచేసిన వివరాల ఆధారంగానే ఎకరానికి రూ.8 వేలు పెట్టుబడి ఇచ్చే పథకం అమలు చేయాలని.. రికార్డులన్నింటినీ సరిచేసిన తర్వాత ఆ జాబితాను ప్రభుత్వానికి పంపుతారని, ప్రభుత్వం ఏ రైతు వద్ద ఎంత భూమి వుందో దాని ప్రకారమే డబ్బులను జమచేస్తుందని అధికారులు వివరించారు.

గాలి..వెలుతురు..అగ్నిపర్వతాలే

చీలీ బిజిలీ

(మొదటిపేజీ తరువాయి)

నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. అగ్నిపర్వత ప్రాంతాల్లోని జియో ప్లాంట్లు భూపొరల్లోంచి ఉష్ణతాపాన్ని గ్రహించి విద్యుత్‌గా మారుస్తుంది. శీతలీకరణ స్టేషన్ నుంచి ఆవిరి బయటకు వచ్చిన తర్వాతి తిరిగి ఉష్ణతాపాన్ని ఇంజెక్షన్ వెల్స్ ద్వారా భూమిలోకి పంపిం చడం జరుగుతుంది. ఒకప్పుడు ఈ అగ్నిపర్వత ప్రాంతాలు సమీపంలోని చిన్నచిన్న పట్టణాలను మృత్యుకుహరా లుగా చేసేవి. కానీ ఇప్పుడు అవే ఆదాయ వనరుగా మారాయి. ఈ తరానికి ఉద్యోగాలను కూడా కల్పిస్తున్నాయి. కనీసంగా ప్రాథమిక విద్యకు నోచుకోని ప్రజానీకం ఇప్పుడు ఉన్నత విద్యకోసం బయటి ప్రాంతాలకు వెళ్లే రోజులు వచ్చాయి. ఒకప్పుడు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న ఇక్కడి సమాజం ఇప్పుడెంత మాత్రం ఒంటరిగా ఫీలవడం లేదు. ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లతో అనుసంధానమైన మిగతా ప్రపంచానికి తామెంతమాత్రం తక్కువ కాదన్న ఆత్మవిశ్వాసం స్థానికుల్లో కనిపిస్తోంది.



గ్రీన్ ఎనర్జీకి కేరాఫ్ లాటిన్ అమెరికా..

అంతర్జాతీయంగా క్లీన్ ఎనర్జీ ఉత్పాదకతలో లాటిన్ అమెరిగా అగ్రగామిగా ఉంది. అక్కడున్న డ్యామ్‌ల ద్వారా భారీ ఎత్తున విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంటుందని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. లాటిన్ అమెరికా హైడ్రో విద్యుత్‌తోపాటు పునరుత్పాదక విద్యుత్‌ను గత 13 ఏళ్లలో 11రెట్లు చేసింది. అంతర్జాతీయ రేటింగ్‌తో పోల్చుకుంటే ఇది రెట్టింపు ఉత్పత్తి. 2016 అంతర్జాతీయ పునరుత్పాదక విద్యుత్ ఏజెన్సీ నివేదిక ప్రకారం శిలాజేతర ఇంధన విద్యుత్‌లో చీలీ, మెక్సికొ, బ్రజిల్ దేశాలు టాప్ టెన్ జాబితాలో నిలిచాయి. కాగా, కర్బన ఉద్గారాల నియంత్రణ లక్ష్యంగా రూపొందించిన ప్యారిస్ ఒప్పందాన్ని ట్రంప్ వ్యతిరేకించడం లాటిన్ అమెరికా అధికారులను, పారిశ్రామిక వేత్తలను విస్మయానికి గురిచేసింది. 'ఇది హేతుబద్ధం కాదు. పదేళ్ల నుంచి నిద్రిస్తున్న వారు లేవడానికి నిరాకరించినట్లే ఉందే ట్రంప్ వైఖరి' అని ద.అమెరికా ఎనెల్ గ్రీన్ పవర్ అధినేత జేమ్స్ లీ స్టాకాంపియానొ అన్నారు. జేమ్స్‌లీ సంస్థ చీలీ గ్రీన్ ఎనర్జీ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నది. 'పునరుత్పాదక విద్యుత్ అనేది రైలు వంటిది. దానిని నిలువరించడం ఎవరి తరం కాదు' అని లీ పేర్కొన్నారు.

ఏడేళ్లలో పరిస్థితులు మారాయి..

కొద్ది సంస్థలు, తక్కువ పోటీ, ఎక్కువ ధర.. ఇదీ ఒకప్పటి మా విద్యుత్‌రంగం పరిస్థితి. దేశాధ్యక్షుడిగా మిచెల్లె బచెలెట్ తొలి దశ పాలనలో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. కానీ ఆమె అధికారం 2010లో ముగిసింది. తిరిగి నాలుగేళ్ల తర్వాత దేశాధ్యక్షురాలయ్యేనాటికి విద్యుత్‌రంగస్వరూపమే మారిపోయింది. అప్పటి ప్రభుత్వం పునరుత్పాదక విద్యుత్‌ను విశేషంగా ప్రోత్సహిస్తూ, ప్రైవేటు రంగాన్ని ఆహ్వానించడమే ఇందుకు కారణమని చీలీ విద్యుత్‌శాఖ మంత్రి ఆండ్ర్యూస్ రెబొల్లడొ చెప్పారు. కరవు, వరద పరిస్థితులు పునరుత్పాదక విద్యుత్‌వైపు మళ్లేలా చేశాయి. గతేడాది ఆగస్టులో 23శాతం విద్యుత్ అవసరాల కోసం తమ ప్రభుత్వం డజన్లకొద్ది స్థానిక, విదేశీ కంపెనీలతో కాంట్రాక్టులు కుదుర్చుకుంది. నవంబర్‌లో మరికొన్ని కాంట్రాక్టులు ప్రకటిస్తామని ఆండ్ర్యూస్ చెప్పారు. జియోథర్మల్ ఎవరి ప్రయోజనాలకూ ఆటంకం కాదన్న ఆయన అటకామా ఎడారిలో మరిన్ని సౌర విద్యుత్ క్షేత్రాలకు ప్రణాళికలు రచిస్తున్నామని అన్నారు.

ప్రజల ఆదరణ మరచిపోలేనిది

ఫిదా విజయోత్సవ సభలో దర్శకుడు శేఖర్ కమ్ముల




నిజామాబాద్ అర్బన్, కెఎన్ఎన్ : నిజామాబాద్ జిల్లా ప్రజల ఆదరాభిమానాలు మరిచిపోలేనివని ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల అన్నారు. ఆయన ఇటీవల దర్శకత్వం వహించిన చిత్రం 'ఫిదా' చిత్రం విజయవంతమైన నేపథ్యంలో నగరంలోని కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ఫిదా చిత్రాన్ని సంవత్సరం పాటు బాన్సువాడ పట్టణం, పరిసర ప్రాంతాలైన చద్మల్ తండా, గాంధారి, సిర్నాపల్లి లలో చిత్రీకరించామన్నారు. సినిమా చిత్రీకరణ సమయంలో ఇక్కడి ప్రజల సహకారం మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ధర్పల్లి, సిర్నాపల్లి అటవీ ప్రాంతాలు చాలా అందంగా ఉంటాయని, సినిమా చిత్రీకరణ ఇక్కడ జరిపితే తాము పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణేష్, ఫిదా హీరో వరుణ్ తేజ్, నిర్మాత దిల్ రాజు, ఎమ్మెల్సీ రాజేశ్వర్, మేయర్ సుజాత, వందలాది మంది అభిమానులు పాల్గొన్నారు. సాయంత్రం ప్రారంభమైన ఫిదా విజయోత్సవ సభకు వర్షం దెబ్బ తగిలింది. కార్యక్రమంలో మొదట మధుప్రియ తన పాటతో అలరించింది. వక్తలు మాట్లాడుతుండగానే బీభత్సమైన వర్షం కురిసింది. దీంతో ప్రజలు, ప్రముఖులు చెల్లా చెదురయ్యారు.

హిమాచల్ ప్రమాదంలో

నల్లగొండ వాసులు మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొండ చరియలు విరిగిపడి హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగిన సంగతి విదితమే. ప్రమాదంలో నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందినట్లు సమాచారం. ఉరవాని గ్రామం నార్క ట్‌పల్లి మండలానికి చెందిన దుబ్బాక కొండల్‌రెడ్డి, భువనగిరికి చెందిన రాజిరెడ్డి మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులకు సమాచారమందింది. ఈ ఇద్దరు కోమటిరెడ్డి బ్రదర్స్‌కు చెందిన శుశి హైటెక్ కంపెనీలో మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. సిమ్లాలో ఈ కంపెనీ కాంట్రాక్టు పనులు చేస్తోంది. మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురావడానికి బంధువులు బయలుదేరి వెళ్లారు.

సీఆర్‌డీవో సభ్యులను విడుదల చేయాలి




హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెల 11న 18 మంది సభ్యులుగా గల సీడీఆర్‌వో (కోఆర్డినేషన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ ఆర్గనైజేషన్) బృందం (తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ సీఎల్‌సీ సభ్యులు కలిపి) నిజా లను కనుగొనేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్లింది. వారు నాగనూర్, పల్నూర్‌కు 12న చేరు కున్నారు. 13వ తేదీన బృంద సభ్యులు నిజాలను కనుగొనేందుకు వాహనాల్లో బుర్కాపూర్ గ్రామానికి చేరుకున్నారు. కానీ వారి వాహనాలను సుకుమా జైల్ సమీపంలో పోలీసులు నిలువరించి ర్యాండమ్ చెకింగ్ నిర్వహించి వాహన డ్రైవర్లతో కలుపుకుని మొత్తం 22 మందిని బలవంతంగా సుకుమా కమ్యూనిటీ హాల్‌కు తరలించి అక్రమ నిర్బంధం కావించారు. విషయంపై సుకుమా ఎస్పీ, కలెక్టర్‌తో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రీజియన్‌లో హింసకు గల కారణాలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉండాలనే సీడీఆర్‌వో సభ్యులను నిలుపుదల చేసి అక్రమ నిర్బంధం కావించారని, ఈ అక్రమ నిర్బంధాన్ని ప్రజాస్వామ్య శక్తులు ముక్తసరిగా ఖండించాలని, ఆ 22 మందిని వెంటనే విడుదల చేయాలని విరసం నేత వరవరరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వ్యక్తిగత ఆరోపణలకు తెరతీసింది బాబే

నంద్యాల (పాణ్యం) ,కెఎన్ఎన్ : గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు భారతదేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా రాయలసీమను గుర్తించారని, ప్రస్తుతం కరువు సీమగా మార్చారని ఆ ప్రాంత ప్రజలే దీనికి ప్రత్యక్ష సాక్ష్యమని చిత్తూరు జిల్లా పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆదివారం నంద్యాల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో టీడీపీకి రాయలసీమ జిల్లాలు అనుకున్నంత మేరకు సీట్లు రాలేదని, సవతి ప్రేమ చూపిస్తూనే సీమ జిల్లాలు కరువు బారినా పట్టించుకోలేదన్నారు. కోస్తా జిల్లాల్లో టీడీపీకి బ్రహ్మరథం పట్టారని, వారిని ఒప్పించి సీమ జిల్లాల్లో ఓట్లు వేయకపోయినా గోదావరి, కృష్ణ అనుసంధానం పేరుతో రూ. వేల కోట్ల నిధులు విడుదల చేసి తెలుగు తమ్ముళ్ళకు జల నిధుల విందును ఏర్పాటు చేశారన్నారు.

తుంగభద్రలో పెరిగిన నీటి మట్టం

50శాతం నిండిన జలాశయం - ఏపీకి 15 టీఎంసీలు విడుదల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎగువన పరివాహకంగా కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం క్రమేపీ మెరుగు పడుతూ వస్తోంది. ఆదివారం బెంగ ళూరులో తుంగభద్ర సాగునీటి సలహా సమితీ సమావేశం జరిగింది. తుంగభద్ర ప్రాజెక్టులోకి వర్షాకాలం ప్రారభం నుంచి ఇప్పటి వరకూ నీటి చేరికలు , ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో ఉన్న నీటి నిలువలు , సాగు నీటి అవసరాలు తదితర అంశా లను సమావేశంలో సమీక్షించారు. తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులకు గాను 1616 అడుగుల మేరకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిలుల సామార్థ్యం 100.86టీఎంసీలు కాగా ప్రస్తుతం ఇందులో 48.96టీఎంసీల నీరు నిలువ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయంలో 49.57 టీఎంసీల నీరు ఉండేది. ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ ఎగువ నుంచి తుంగభద్ర జలాశయంలోకి 51.01 టీఎంసీల నీరు చేరుకుంది. ఎగువ నుంచి 6324క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

ఏపీకి 15టీఎంసీలు:

తుంగభద్ర ప్రాజెక్టులోకి ఈ ఏడాది నీటి లభ్యత 165టీఎంసీల మేరకు ఉంటుందని జూన్ గతనెల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో అంచాన వేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాలకు కలిపి 73టీఎంసీల నీటిని అందించాలని నిర్ణయిం చారు. జలాశయంలోకి 20 టీఎం సీల నీరు చేరుకునేదాక కాలువలకు నీటి విడుదల చేయరాదని నిర్ణయిం చారు. అయితే ఇప్పటికే ప్రాజెక్టు లోకి 51టీఎంసీల నీరు చేరటంతో తుంగభద్రపై ఆశలు చిగురిస్తు న్నాయి. ఇక ఈ ఏడాది పెద్ద సమస్య ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. తుంగభద్ర జలాశ యంలో ఉన్న నీటి నిలువలను ఆధారంగా చేసుకుని ఉన్న 48.96 టీఎంసీలలో 30శాతం వాటా కింద ఏపీ తెలంగాణ రాష్ట్రాలకు కలిపి 15 టీఎంసీలు లభించనున్నాయి. మిగిలిన 33టీఎంసీల నీటిని కర్నాటకలోని తాగునీటి అవసరాలకు, కాలువల ద్వారా ఆయకట్టుకు అందచేయనున్నారు. రాయచూరు, కొప్పళ్ల ,బళ్లారి జిల్లాలకు కూడా ఏడాదిపొడవునా తాగునీటికి 8టీఎంసీలు అవసరం అని అధికారులు అంచనా వేశారు. ఇటు ఏపీ , తెలంగాణ రాష్ట్రాల్లో కూడా కర్నూలు, కడప, అనంతపురం, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చాల్సివుంది.

జూరాలకు 3659క్యూసెక్కులు


కృష్ణానదిలో వరదనీటి ప్రవాహాలు ఆశించిన రీతిలో మెరుగుపడటం లేదు. ఎగువనుంచి అల్మట్టిలోకి 6003 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం నుంచి కాలువలకు వెయ్యిక్యూసెక్కులు ఉపయోగించు కుంటూ పవర్‌హౌస్ ద్వారా 5000క్యూసెక్కుల నీటిని దిగువన నారాయణపూర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. నారాయ ణపూర్ ప్రాజెక్టునుంచి స్పిల్‌వే మీదుగా 900క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా జూరాల వద్ద 3659క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టునుంచి 4629క్యూసెక్కుల నీటిని సాగునీటి అవసరాల కింద కాలువలకు విడుదల చేస్తున్నారు.

భారత్‌పై ఐసిస్ యుద్ధం?



మార్చిఏడున పేలుడుకు గురైన భోపాల్-ఉజ్జయినీ ఎక్స్‌ప్రెస్

- ముస్లిం యువతను రెచ్చగొడుతూ దారుణాలు
- ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడి
- మార్చి 7న రైలులో పేలుడు యుద్ధమేనన్న నిందితులు



ఐసిస్ బృందం నాయకుడు అతీఫ్ కోర్టుకు వచ్చినప్పటి దృశ్యం

న్యూఢిల్లీ: భారత దేశం మీద ఐసిస్ యుద్ధం ప్రకటించిందా? అందుకు భారత్ నుంచే సైనికులను రిక్రూట్ చేసుకుని ఇక్కడే యుద్ధాన్ని కొనసాగిస్తోందా? అవుననే అంటున్నారు ఏన్ఐఏ అధికారులు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తు చేస్తున్న కేసుల్లో ఎక్కడెక్కడి కోణాలో బయటపడుతున్నాయి. తాజాగా ఈ ఏడాది మార్చి ఏడున జరిగిన భోపాల్ రైలు పేలుడులో నిందితుడు ఐసిస్‌కు చెందిన వ్యక్తని తేలింది. భారత్‌పై ఐసిస్ యుద్ధంలో భాగంగానే తానీ పనికి పాల్పడినట్లు ఐసిస్ బృందానికి నాయకుడైన అతీఫ్ ఎన్ఐఏకు చెప్పాడు. భారత్‌లో ఈ బాంబు ఘటనకు పాల్పడిన తరువాత సిరియాకు పశ్చిమబెంగాల్‌లోని సుందర్ బన్స్ ద్వారా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నాడని తెలిసింది. అందుకు కోల్‌కతాతో సహా తీర ప్రాంతాన్ని సర్వే చేసాడు. అక్రమంగా సిరియాకు వెళ్లడానికి ఎన్నో ప్రణాళికలు వేసుకున్నాడు. అయితే.. అతడి ప్రణాళికలను భారత ఏజెన్సీలు విఫలం చేసాయి. దీంతో భారత్‌లో ఐసిస్ పాల్పడిన మొదటి దాడిగా మార్చి ఏడు రైలు ప్రమాద ఘటనను గుర్తించామని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఈ ఉదంతం తరువాత రైలు ప్రయాణ భద్రత గురించి ఆందోళనే కాక, భారత్లో ఇంకా ఐసిస్ విధేయులు లేదా ఉగ్రవాదులు ఎంత మంది ఉన్నారోనని ఆందోళన ఉందని ఎన్ఐఏ అధికారులు చెబుతున్నారు. వీళ్లందరూ ఐసిస్ వల్ల ప్రభావితమై ఆ సంస్థతో టచ్‌లో ఉంటూ ఇక్కడ దాడులకు, పేలుళ్లకు పాల్పడుతుంటారు. ఈ కేసులో చార్జిషీటు దాఖలు చేసిన ఎన్ఐఏ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతీఫ్ ముజఫ్ఫర్, మొహమ్మద్ డానిష్ అలియాస్ జాఫర్, సయ్యద్ మీర్ హుస్సేన్ అలియాస్ హమ్జా అబు బక్కాస్, ఘౌస్ మొహ్మద్ ఖాన్‌ను నిందితులుగా పేర్కొంది. ఐసిస్‌కు సంబంధించిన ఆన్‌లైన్ సమాచారాన్ని క్రమం తప్పకుండా అందుకుంటూ, ఇక్కడ వివిధ దారుణాలకు పాల్పడుతూ ఐసిస్ ఆక్రమిత ప్రాంతాలకు చేరేందుకు ప్రయత్నించారు. భారత్‌లో గ్యాంగ్‌స్టర్లుగా వ్యవహరిస్తూ, పేలుళ్లకు పాల్పడుతూ, ఐసిస్ కార్యక్రమాలను అమలు చేస్తుంటారు. ఐసిస్‌లో ఇలాంటి వారి కోసం ఒక విభాగమే ఉందట. వారు 2.3 మిలియన్ సోషల్ మీడియా అకౌంట్ల నుంచి తమకు కావలసిన వారిని ఎంపిక చేసుకుంటారు. వారికి తాము ప్రకటించిన కలీఫత్‌లో జీవితం ఎలా ఉంటుందో చెబుతారు. భగవంతుడి కోసం యుద్ధం చేయడమెలానో వివరిస్తారని ఎన్ఐఏ అధికారులు చెబుతున్నారు. అవన్నీ చూసి ఒక రకమైన ఉద్వేగానికి గురైన యువకులను ఐసిస్ తమ వారిగా రిక్రూట్ చేసుకుంటుందట. కేరళకు చెందిన అబ్దుల్ రషీద్ అబ్దుల్లా భారత్‌లో ఐసిస్ కోసం రిక్రూట్‌మెంట్ మొదలు పెట్టాడని ఎన్ఐఏ నిర్ధారించింది. అతడు 2015 నుంచి ఈ కార్యక్రమాలు చేపడుతున్నాడు. భారత్ నుంచి 21 మందిని అఫ్గానిస్థాన్‌లోని ఐసిస్ డెన్లకు పంపాడు. అయితే.. పశ్చిమ బెంగాల్ నుంచి సిరియా వెళ్లాలని యూపీలోని నిందుతులు కోరుకోవడం వెనుక కారణమేమిటో ఇంకా వెల్లడి కావాలి. ఇక్కడి నుంచి బంగ్లాదేశ్ వెళ్లి అక్కడి నుంచి సిరియా వెళ్లే మార్గాలు వారికుంటాయని అధికారుల అనుమానం. వీరందరూ ఐసిస్‌కు విధేయత ప్రకటించి భారత్‌లో పలు దుర్ఘటనలకు కారణమయ్యారు. లక్నోలోని ఒక రహస్య ప్రదేశంలో ఉంటూ, ఆయుధాలు, నకిలీ ఐడీలు సంపాదించారని ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. రైలు మీద బాంబు పెట్టి దాని ఫోటోను సోషల్ మీడియాలో ఐసిస్‌కు వీరు పంపారు. ఇందుకు వారు టెలిగ్రామ్‌ను వాడుతున్నారు. వీరు ఐసిస్ ద్వారా భారత్ మీద యుద్ధం ప్రకటించారోంది ఎన్ఐఏ. మతపరమైన కార్యక్రమాల్లో కలుసుకుంటూ మిలిటెంట్ కార్యక్రమాల గురించి వీరు చర్చిస్తారు. వీరు ఎంత మంది వీలైతే అంత మందిని చంపడానికి పిస్టల్‌ను పేల్చడం నేర్చుకున్నారు. తమ నైపుణ్యాన్ని పరీక్షించుకోవడానికి ఉత్తపుణ్యానికి అక్టోబర్ 2016లో ఒక స్కూల్ టీచర్‌ను కాల్చి పారేసారు. యూపీలో ఉన్నావ్ జిల్లాలో 2016 డిసెంబర్లో బాంబు కూడా పెట్టారు. కానీ అది విఫలమవడంతో చాలా మంది బతికిపోయారు. దీంతో కొత్త టైమర్‌ను ఉపయోగించి మార్చి ఏడున భోపాల్-ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్‌లో పేలుడుకు పాల్పడ్డారు. ఈ గ్రూప్‌కు నాయకుడైన అతీఫ్ తాను ఐసిస్ విధేయుడినని, సున్నీ ఇస్లామిక్ సామ్రాజ్యం స్థాపనే తన లక్ష్యమని ఎన్ఐఏ అధికారులకు చెప్పాడు. వివాదాస్పద మత బోధకుడు జకీర్ నాయక్ బోధనలను కూడా అతీఫ్ తలకెక్కించుకున్నాడు. తన తాతలనాటి ఆస్తిని అమ్మి రూ. 70 లక్షలను ఐసిస్ కార్యక్రమాల కోసం అతీఫ్ సేకరించాడు. కాన్పూర్‌లో ఖురాన్ కేంద్రానికి వెళుతూ ఇస్లామిక్ సామ్రాజ్యంపై మమకారంతో ఐసిస్‌కు విధేయుడిగా మారాడు. పట్టుబడడంతో రైలు బాంబు పేలుడిలోనే కాక ఉపాధ్యాయుడి హత్యలోనూ నిందితుడై దేశద్రోహం కేసునూ ఎదుర్కొంటున్నాడు.

బ్లూవేల్ గేమ్‌కు మరో బాలుడు బలి!



మిడ్నపూర్: బ్లూవేల్ గేమ్‌కు మరో నిండు ప్రాణం బలైంది. ఇటీవల ముంబైలో ఒక టీనేజ్ యువకుడు ఈ గేమ్ ఆడి చివర్లో ఆత్మహత్య చేసుకోగా, ఇప్పుడా వంతు పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నపూర్ జిల్లాలో ఆనందపూర్‌ది అయింది. శనివారం ఉదయం స్నానం చేయడానికని బాత్‌రూంలోకి వెళ్లిన అంకన్ డే అనే 14ఏళ్ల బాలుడు, గంటకు పైగా లోపలే ఉండిపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. తలుపులు పగులగొట్టి చూడగా, అంకన్ శరీరం అచేతనంగా పడి ఉంది. అతడి ముఖం ప్లాస్టిక్ కవర్‌తో కట్టేసి ఉంది. మెడకు టవల్ బిగించి ఉంది. శరీరం మీద మరే గాయమూ లేదు. కానీ అంకన్ చనిపోయి ఉన్నాడు. మంచి బాలుడిగా పేరొందిన అంకన్ ఆత్మహత్యకు కారణమేమిటో కుటుంబ సభ్యులకు అంతుపట్టలేదు. టీనేజ్ కుర్రాళ్లతో పాటు యువతను ఉర్రూతలూగిస్తున్న ఆన్‌లైన్ గేమ్ బ్లూవేల్ ఈ మరణానికి కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం అంకన్‌కు వ్యసనమని తెలిసిన వాళ్లు చెబుతున్నారు. దీంతో అంకన్ తండ్రి షాపు నుంచి అతడు వాడే కంప్యూటర్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రష్యా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ 'వి కొంటాకె' ద్వారా సోషల్ నెట్‌వర్కింగ్ ద్వారా బ్లూవేల్ చాలెంజ్ ఆడాలి. కొందరు తమకు కేటాయించిన పేజీల్లో తమ నిస్పృహను తెలుపుతూ సాయం కూడా కోరుతుంటారు. అలాంటి వారిని ఎంపిక చేసుకుని వారితో బ్లూవేల్ గేమ్ ఆడిస్తుంటారు. ఆ వ్యక్తికి కొన్ని పనులు చెప్పి ఆ పనులను ఫోటో తీసి పోస్ట్ చేయమని అడుగుతారు. ఆ తరువాతే బ్లూవేల్ గేమ్ ఆడడానికి అనుమతి లభిస్తుంది. ఆ గేమ్ ఆడడానికి ఆత్మహత్యా యత్నాన్ని ఫోటో తీయమంటే ఆ పని చేస్తూ అంకన్ చనిపోయి ఉండొచ్చని పోలీసుల అనుమానం.

పై కోర్టులు ఇచ్చిన మధ్యంతర బెయిల్ పూర్తి బెయిల్‌కు మార్గం కారాదు: సుప్రీం



న్యూఢిల్లీ: నిందితుడికి మధ్యంతర బెయిల్ ఇచ్చినంత మాత్రన కిందికోర్టులు పూర్తి స్థాయి బెయిల్‌ను గుడ్డిగా ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ఆదివారం స్పష్టం చేసింది. సదరు వ్యక్తికి బెయిల్ ఇవ్వాలన్న విషయం కింది కోర్టుల వ్యక్తిగత నిర్ణయమని అభిప్రాయపడింది. జస్టిస్ రంజన్ గొగొయ్, నవీన్ సిన్హా ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెల్లడించింది. సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్న సాకుతో కింది కోర్టులను నిందితులు పూర్తి స్థాయి బెయిల్ అడుగుతున్నారని పేర్కొంది. అయితే, తాము కేవలం మధ్యంతర ఉత్తర్వులు తక్షణమే అరెస్టు చేయవద్దని ఇస్తున్నామని తెలిపింది. అటుతర్వాత పరిణామాలను బట్టి సంబంధిత నిందితుడిని కస్టడీలోకి తీసుకోవచ్చని చెప్పింది.

ట్రిపుల్ తాలాక్‌పై మరో పిటిషన్ నిరాకరణ

ముస్లింలలో ట్రిపుల్ తాలాక్ విషయమై దాఖలైన ఒక పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్‌లో పేర్కొన్న విషయాల మీదే మరో కేసులో విచారణ జరుగుతోందని, ఆ పిటిషన్‌లో తీర్పు మీదే ఈ పిటిషన్‌లో విషయాలు కూడా ఆధారపడి ఉంటాయని తెలిపింది.

నదుల్లో 20 శాతం నీరు పారాల్సిందే: ఎన్జీటీ



న్యూఢిల్లీ: ఏ నదిలోనైనా నీరు అసలు పారకుండా ఉండరాదని, సాధారణ సీజన్‌లో ఉండే నీటిలో కనీసం 18-20 శాతం నీరు ప్రవహించేలా చేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. మొత్తం ఆరు నదీ పరీవాహక ప్రాంతాలు, సియాంగ్; తవాంగ్, బిచోమ్ సుబాన్సిరి, దిబాంగ్, లోహిత్‌లను అధ్యయనం చేసిన పర్యావరణ శాఖ నివేదికతో ఎన్‌జీటీ ఈ నిర్ణయం తీసుకుంది. నదుల్లో కొన్ని నెలల పాటు నీరు ప్రవహించకుండా ఆనకట్టల్లో బంధించేస్తే మంచినీటి చెరువులతో పాటు ఉప్పునీటి పర్యావరణ వ్యవస్థలు (మడఅడవులు) కూడా దెబ్బ తింటాయని ఎన్జీటీ పేర్కొంది. దీనిని ఎన్విరాన్‌మెంటల్ ఫ్లో (ఈ-ఫ్లో) అని పిలుస్తోంది. జస్టిస్ స్వతంతర్ కుమార్ నేతృత్వంలో ధర్మాసనం జరిపిన విచారణలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏ రాష్ట్రమైనా అలా చేయలేని పక్షంలో కేంద్ర పర్యావరణ అడవుల శాఖను సంప్రదించాలని సూచించారు.

తక్షణమే సుశీల్ మోడీపై వేటు వేయాలి: లాలూ



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీని తక్షణమే క్యాబినెట్ నుంచి తొలగించాలని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. రూ. 1000 కోట్ల కుంభకోణంలో ఆయన పాత్రధారుడని ఆరోపించారు. ఈ కేసులో వెంటనే ఆయనను అరెస్టు చేయాలన్నారు. ఓ ఎన్జీవోకు సంబంధించిన కేసులో 2010 నుంచి 2015 వరకు కొనసాగిన ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా మోడీ రూ. 1000 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపారన్నారు.

జేడీ(యూ) నాదే: శరద్



న్యూఢిల్లీ: బీహార్ అధికార పార్టీ జనతా దళ్ (యునైటెడ్) లో అంతర్గత కుమ్ములాటలు రోజురోజుకి మరింత అధికమవుతున్నాయి. జేడీ(యు) తమదేనని శరద్ యాదవ్ వాదిస్తున్నారు. 14 రాష్ట్రాల కమిటీలు తమ నాయకత్వానికి మద్ధతిస్తున్నాయని చెప్పారు. నితీశ్ కుమార్ కేవలం బిహార్‌కు మాత్రమే పరిమితమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శరద్ యాదవ్ ప్రధాన అనుచరుడు అరుణ్ శ్రీవాస్తవ ఆదివారం ప్రకటించారు. జేడీ(యు) పార్టీ నుంచి ఆయనను తొలగించడంపై అరుణ్ స్పందించారు. నితీశ్ కుమార్ తమతో పార్టీ కలపకముందే తమ చేతుల్లో జేడీ(యు) ఉందన్నారు. అందుచేత, తాము పార్టీని వదలమన్నారు. కాగా, రాజ్యసభ నాయకుడిగా సీనియర్ నేత శరద్ యాదవ్‌ను తొలగించినప్పటికీ, ఆయనపై జేడీ(యు) నాయకుడు అజయ్ అలోక్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఏ మాత్రం సిగ్గు ఉన్నా రాజ్యసభ పదవికి వెంటనే రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. పార్టీ అధినేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నప్పుడు... పార్టీ ద్వారా సంక్రమించిన పదవిని కూడా వదులుకోవాలన్నారు. ఏ మాత్రం రోషం మిగిలి ఉన్నా ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలన్నారు. అవినీతిమయం అయినందు వల్లే తాము మహాకూటమి నుంచి బయటకు వచ్చామన్నారు. శరద్ యాదవ్ స్థానే ఆర్‌సీపీ సిం గ్‌ను నియమించినట్లు తెలిపారు.

మోడీకి స్పెషల్ ప్యాకేజీ గుర్తు చేసిన నితీశ్

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బిహార్‌కు స్పెషల్ ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీకి బిహార్ సీఎం నితీశ్ కుమార్ గుర్తు చేశారు. బిహార్‌కు కేంద్రం ప్రకటించిన రూ. 1.25 లక్షల కోట్లను దశలవారీగా విడుదల చేయాలని కోరారు.

ఎవరినీ వదలం

- యూపీ సీఎం యోగి హెచ్చరిక
- విపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని వ్యాఖ్య
- గోరఖ్‌పూర్‌లో చిన్నారులు మెదడువాపుతోనే మృతి చెందారని ప్రకటన



లక్నో: గోరఖ్ పూర్ ఆస్పత్రి విషాదంతో ఉత్తర్ ప్రదేశ్ సర్కారు దిద్దుబాటు చర్యలకు దిగింది. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రిలోనూ మందులు,ఆక్సిజన్ కొరత లేదని నిర్ధారించిన యోగి సర్కారు... ఇంకా ఏ ఆస్పత్రిలోనైనా ఆక్సిజన్ బకాయిలు ఉంటే వెంటనే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రంలోని 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు,12 ప్రముఖ మెడికల్ సంస్థలకు లేఖలు పంపింది. మెడికల్ కాలేజీల ప్రిన్సిపల్స్ కూడా తమ ఆస్పత్రుల్లో మందులు, ఆక్సీజన్ కొరత లేదని నిర్ధారించినట్లు వైద్య విద్య అడినల్ చీఫ్ సెక్రటరీ అనితా భత్నగర్‌జైన్ తెలిపారు. బీఆర్డీ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో మృత్యువాత పడిన చిన్నారులు ఆక్సిజన్ అందక చనిపోలేదని స్పష్టం చేశారు. ఆక్సిజన్ సరఫరా చేసే ప్రైవేటు సంస్థ ఆరోపించినట్లుగా బీఆర్డీ ఆస్పత్రి ఎలాంటి బాకీలు లేవని తెలిపారు. ఇంకా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ప్రభుత్వాన్ని సంప్రదించాలని మెడికల్ కాలేజీలకు ప్రిన్స్ పల్స్ కు సూచించారు. ఘటనకు ముందే సీఎం యోగి ఆధిత్యనాథ్ బీఆర్డీ ఆస్పత్రిని సందర్శించినప్పటికీ ప్రిన్సిపల్ సమస్యను ఆయన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు.

పుండుపై కారం చల్లొద్దు: బాబా రాఘవదాస్ మెడికల్ కాలేజి ఆస్పత్రిలో మృత్యువాత పడిన చిన్నారుల్లో 30మంది మెదడువాపుతోనే మృతి చెందారని ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ స్పష్టం చేశారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేడీ నడ్డాతో కలిసి యోగి గోరఖ్ పూర్ లోని బీఆర్డీ ఆస్పత్రిని సందర్శించారు. యోగి..ఘటనపై వేసిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక అందిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. మెదడువాపు నిర్మూలనకు రాష్ట్రప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్న యోగి..బీఆర్డీ ఆస్పత్రిని ఈనెల 9వ తేదీ నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు సందర్శించి ఎప్పటికప్పుడు పరిస్థితులను స్వయంగా తెలుసుకుంటున్నానని చెప్పారు. ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారని..ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. విచారణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులు ఎంతటివారైన వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు. మీడియా తప్పుడు కథనాలు రాస్తోందని ఆరోపించిన యోగి..వార్డుల్లోకి వెళ్లి పరిస్థితిని అర్థం చేసుకోవాలని చురకలంటిచారు.అందే వరకు అందరూ వేచిచూడాలని... ఘటనకు డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆజాద్ అప్పుడలా..ఇప్పుడిలా..ఎందుకిలా: యోగి

కన్నబిడ్డలు చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను కొందరు రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నారని యోగి ఆరోపించారు. ''గులాంనబీ ఆజాద్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడకు వచ్చి..ఈ సమస్య పూర్తిగా రాష్ట్రానికి చెందిందని చేతులెత్తేశారు. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు అదివారి విచక్షణకే వదిలిపెడుతున్నా'' అని యోగి కాంగ్రెస్ పై నిప్పులు చెరిగారు.విపక్షాలు ఘటనను రాజకీయం చేయడం తగదన్న యోగి..ఈ విషయంలో ప్రతిపక్షాలు పుండుమీద కారంచల్లి నట్లుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.

నామకరణం లేకుండానే 17 మంది చిన్నారుల మృతి

గోరఖ్ పూర్ ఆక్సిజన్ విషాదం తర్వాత మరుగునపడిన ఎన్నో చేదు నిజాలు బయటపడుతున్నాయి. ఇటీవల బీఆర్డీ ఆస్పత్రిలో 20 రోజుల శిశువును కోల్పోయిన భార్యాభర్తలు తమ బిడ్డకు తాము పేరుపెట్టక మునుపే మృత్యు ఒడిలోకి చేరుకున్నాడని కన్నీటిపర్యంతమయ్యారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా అనారోగ్యానికి గురైన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందకపోవడం వల్లే చనిపోయినట్లు బీఆర్డీ ఆస్పత్రికి 15 కిలోమీటర్ల దూరంలోని జైన్‌పూర్ గ్రామానికి చెందిన శైలేందర్ తెలిపాడు. బిడ్డ జన్మించగానే వైద్యుల సలహామేరకు మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు తరలించినప్పటికీ నిరంతర ఆక్సిజన్ అందకపోవడం వల్లే చనిపోయాడని వెల్లడించాడు.'' మా బిడ్డను బతికించుకునేందుకు ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి పరుగులు పెట్టినా ఫలితం లేకుండా పోయింది. చిన్నారి కోసం వివిధ ఆస్పత్రుల నుంచి 350 మి.మి రక్తాన్ని సేకరించినా బిడ్డను బతికించుకోలేకపోయా'' అని తన బాధను వెల్లగక్కాడు. బస్తి జిల్లాకు చెందిన దంపతులు కూడా తమ బిడ్డలను ఊపిరితిత్తుల వ్యాధి వల్లే కోల్పోయామని చెప్పారు. ఇటీవలే నాలుగు రోజుల వయస్సున్న బిడ్డను కోల్పోయిన రాజేష్ దంపతులు 2015 లోనూ తమ కూతురును కాపాడుకోలేకపోయామని తమ గోడును వెల్లబోసుకున్నారు.

చిన్నారుల ప్రాణాలతో ప్రిన్సిపాల్ చెలగాటం: బాధితులు

గోరఖ్ పూర్ విషాదానికి బాబా రాఘవ్ దాస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ప్రిన్సిపాలే కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడిన ప్రిన్సిపల్ ఎన్నోసార్లు నిబంధనలను ఉల్లఘించిన్నట్లు తెలుస్తోంది. చిన్నారులకు ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నా వైద్యం అందించడంతో నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగానే ఎంతోమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఆక్సిజన్ విషాదం కంటే ముందే ఎన్నోసార్లు చిన్నారులు ప్రాణాలతో చెలగాటం ఆడిన ప్రిన్సిపాల్.. రోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

చైనాలో భారతీయుడికి అవమానం

బీజింగ్: చైనా విమానాశ్రయంలో ఓ భారతీయుడికి పరాభవం జరిగింది. మన దేశ ప్రయాణీకులతో షాంఘై పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సిబ్బంది అమర్యాదగా ప్రవర్తించారు. నార్త్ అమెరికన్ పంజాబీ అసోషియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సత్నం సింగ్ ఛహల్‌కు అనుభవం ఎదురైంది. తాను ఈ ఈనెల 6న చైనీస్ ఈస్ట్రన్ ఎయిర్ లైన్స్‌లో శాన్ ఫ్రాన్సిస్కోకు వెళ్లే సమయంలో పలువురు భారతీయ ప్రయాణికులను ఎయిర్ లైన్స్ సిబ్బంది అమానించారని ఛహల్ తెలిపారు. ఎగ్జిట్ గేట్ దగ్గర విమాన సిబ్బంది తనను దుర్భాషలాడుతూ మాట్లాడినట్లు ఆయన భారత విదేశాంగ శాఖకు ఫిర్యాదు చేశారు.

సమత్రా దీవుల్లో భూకంపం

జకర్తా: ఇండోనేషియాలోని సమత్రాదీవుల్లో ఆదివారం భూ ప్రకంపనలు సంభవించాయి. బెంగ్‌కులు ప్రాంతానికి 73 కి.మీ. దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.5 గా నమోదైంది. అయితే సునామీ హెచ్చరికలు జారీ చేయలేదని యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకటించింది.

కాశ్మీర్‌లో కల్లోలం



- షోపియాన్‌లో భారీ ఎన్ కౌంటర్
- ముగ్గురు ముష్కరుల హతం
- మృతుల్లో హిజ్బుల్ కమాండర్ యాసిన్
- ఇద్దరు జవాన్ల వీర మరణం


శ్రీనగర్: తుపాకుల మోతతో జమ్మూ కశ్మీర్ మరోసారి దద్దరిల్లింది. దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి కొనసాగిన భారీ కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమవ్వగా, ఇద్దరు భారత సైనికులు కూడా మృత్యువాతపడ్డారు. మరో ఐదుగురు జవాన్లు గాయపడ్డారు. మృతుల్లో హిజ్బుల్ ముజాహిద్దీన్ కమాండర్ యాసిన్ కూడా ఉన్నారు. ఈ విషయాన్ని అధికారులు ఆదివారం ధృవీకరించారు. జైనపొరా జిల్లాలోని అవ్నీరా గ్రామంలో ఉగ్రవాదుల కదలికలు ఉన్నాయనే సమాచారం అందుకున్న భద్రతా దళాలు శనివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఉగ్రవాదుల కోసం వెతుకులాట కొనసాగుతుండగా... టెర్రరిస్టులు కాల్పులకు తెగబడి పారిపోయారు. రాత్రి పూట కాల్పులు జరిపిన ఉగ్రవాదులు ఆదివారం ఉదయం భద్రతా దళాలు కంట పడటంతో... ఇరువర్గాల మధ్య కాల్పులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు సైనికులు గాయపడగా వారిని బేస్ ఆసుపత్రికి తరలించారు. ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు జవాన్లు మరణించారు. బందీపురలోనూ ఉగ్రమూకలు కాల్పులకు తెగబడ్డాయి. పోలీసులపై మెరుపుదాడి చేసిన ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలను చేపట్టాయి.

సరిహద్దుల్లో కాల్పులతో చెలరేగుతున్న పాక్




సరిహద్దు రేఖ వెంబడి ఆదివారం పాకిస్థాన్ బలగాలు కాల్పులు జరిపి ఉల్లంఘనకు పాల్పడ్డాయి. ఈ ఉల్లంఘన జమ్మూ కాశ్మీర్ పూంచ్ జిల్లా నియంత్రణ రేఖ వద్ద చోటు చేసుకుంది. అయితే కాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు పాక్ బలగాలు 285 సార్లు కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడ్డాయన్నారు. గత కొద్దిరోజులుగా సరిహద్దు గ్రామాలపై పాక్ బలగాలు కాల్పులు జరుపుతున్నాయి. ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే పాక్ సైనికులు సరిహద్దు గ్రామాలపై కాల్పులకు ఒడిగడుతున్నాయి. పాక్ సైనికుల కాల్పుల కారణంగా రాజౌరి సరిహద్దులో పలు గ్రామాలు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. తరలించిన గ్రామాల ప్రజానీకానికి ప్రభుత్వం ఇండ్లు కట్టిస్తుందన్నారు. గడిచిన రెండు సంవత్సరాల నుంచి పాక్ సైనికుల మరింత అధికంగా కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతుందని సైన్యం పేర్కొంది.

తీవ్రవాదులు పారిపోతున్నారు



జమ్మూ కశ్మీర్‌లో పాతుకుపోయిన ముష్కరులు ప్రస్తుత పరిస్థితుల కారణంగా పారిపోతున్నారని కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఆదివారంలో ఓ సదస్సులో మాట్లాడిన ఆయన పెద్ద నోట్ల రద్దు, ఉగ్రవాదులకు విదేశీ నిధులను అడ్డుకుంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తీసుకుంటున్న చర్యల కారణంగా ఉగ్రవాదులు తీవ్ర నగదు కొరత ఎదుర్కొంటున్నారని చెప్పారు. అందుకే వారు కార్యకలాపాలు నిర్వహించ లేకపోతున్నారని పేర్కొన్నారు. ఇకపై కాశ్మీర్‌లో ఉగ్రవాదులు ఉండే అవకాశం లేదన్నారు.

ఉగ్రవాదులైన 70 మంది కాశ్మీరీ యువకులు



గడచిన ఏడు నెలలుగా సుమారు 70 మంది కశ్మీరీ యువత తీవ్రవాదంపై అడుగులు వేశారని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. వీరిలో ఎక్కువ మంది పుల్వామా, షోపియాన్, కుల్గాం తదితర జిల్లాలకు చెందిన వారని తెలిపారు.ముఖ్యంగా దక్షిణ కశ్మీర్‌లో జిల్లాలకు చెందిన యువత సామాజిక మాధ్యమాల ద్వారా తీవ్రవాద భావాలను పెంపొందిస్తున్నారని వెల్లడించారు. 2016లోసుమారు 88 మంది యువకులు తీవ్రవాద బృందాలతో జట్టుకట్టారన్నారు. అయితే గత సంవత్సరంతో కంటే ఈ యేడాది మరింత ఎక్కువ మంది కలిశారని చెప్పారు.

స్త్రీ వ్యామోహంతో ముష్కరుల హతం



స్త్రీ వ్యామోహం సాధారణ మనుషులనే కాదు, కరుడగట్టిన ఉగ్రవాదులను హతమారుస్తది. ఇటీవల కాలంలో పలువురు తీవ్రవాదులు తమ లైంగిక వాంఛ తీర్చుకునేందుకు మహిళలకు చెంతకు వచ్చి భద్రతా బలగాల చేతిలో హతమయ్యారు. గత జనవరిలో అనంత నాగ్ పరిసర ప్రాంతంలో ఆదిల్ అహ్మద్ రేషి అనే తీవ్రవాది ఓ వివాహితతో అక్రమంగా శృంగారం చేస్తూ సైన్యం చేతులో మృత్యువాతపడ్డాడు. ఎక్కువగా నమ్మిన స్త్రీల వద్దక వచ్చే వారిని మాటువేసి భద్రతా బలగాలు మట్టుపెడు తున్నాయి. మరికొంతమంది తీవ్రవాదులు గే సెక్స్‌కు కూడా బానిసలైనట్లు తాజాగా ఓ అధ్యయనం లో తేలింది. గత సంవత్సర కాలంగా లష్కరే తొయిబా, జైష్-ఈ-మహమ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్ తదితర సంస్థల కు చెందిన 14 మంది తీవ్రవాదులు ఇలాంటి విషయాల్లోనే హతమయ్యారు. భద్రతా దళాలు మహిళలను ఇన్‌ఫార్మర్లుగా ఉపయోగించుకుంటూ ఉగ్రవాదుల భరతం పడుతున్నాయి. మోస్ట్ వాంటెడ్ తీవ్రవాది బషీర్ అహ్మద్ వణీ కూడా మృతి చెందారు.

పేగుల్లో బ్యాక్టీరియాతో టీ, రెడ్‌వైన్ కలిస్తే ఫ్లూ పరార్



వాషింగ్టన్: తరచూ ఫ్లూ బారిన పడుతున్నారా? అయితే.. రెడ్ వైన్ తాగండి. ఇష్టం లేకుంటే టీ బాగా తాగండని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీలో పరిశోధకులు ఒక సూక్ష్మ జీవి ఫ్లూ తగ్గించడానికి తోడ్పడుతుందని తేల్చారు. దీనికి కారణమూ కనుగొన్నారు. ఫ్లావనాయిడ్స్ అనే పదార్థాలను విడగొట్టడం ద్వారా ఈ సూక్ష్మజీవి ఫ్లూను తగ్గిస్తుందని చెబుతున్నారు. ఫ్లూ వల్ల తీవ్రంగా బాధపడకుండా ఆ వైరస్‌ను ముందే నాశనం చేసే అవకాశం టీ, రెడ్ వైన్ తాగడం వల్ల వస్తుందని చెబుతున్నారు. ఒక రకమైన సూక్ష్మజీవులు కేవలం ఆహారాన్ని జీర్ణం చేసి ఊరుకోవు. రోగ నిరోధక శక్తిని కూడా పెంచుతాయి. టీ లేదా రెడ్ వైన్‌లో ఉండే ఫ్లావనాయిడ్స్‌ను ఉపయోగించి ఫ్లూ వైరస్ మీద దాడి చేస్తాయి. చాలా ఏళ్ల నుంచిఈ ఫ్లావనాయిడ్స్‌ను రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. అయితే.. తాజాగా ఇందుకు శాస్త్రీయ ప్రమాణం లభించింది. ఈ ఫ్లావనాయిడ్స్ అనేవి బ్లాక్ టీ, రెడ్ వైన్‌లో ఉంటాయి. నేరేడు పండ్లలోనూ ఇవి ఉంటాయి. ఈ సూక్ష్మ జీవిని గట్ మైక్రోబయోమ్ అంటారు. అయితే.. ఈ ఫ్లావనాయిడ్స్‌ను ఆహారంలో తీసుకుంటే చాలదు. మన శరీరంలో అంటే పేగుల్లో ఈ సూక్ష్మజీవిని చంపేసే ఆహారాలు తీసుకోకుండా ఉండాలని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. అప్పుడే ఆ ఫ్లావనాయిడ్స్‌ను ఆ సూక్ష్మజీవి విడగొట్టి ఫ్లూ వైరస్‌ను నాశనం చేయడానికి ఉపయోగపడుతుందట. అలా చేసే ఒక బ్యాక్టీరియాను కనుగొన్నామని వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుడు తాడియస్ స్టాపెన్‌బెక్ చెప్పారు. ఈ సూక్ష్మజీవి వల్ల ఫ్లూ వైరస్ వల్ల ఊపిరితిత్తులు దెబ్బతినకుండా ఉంటాయి.

25వ సినిమా



ముహూర్తం ఖరారైంది

సూపర్‌స్టార్ మహేష్ బాబు 25వ చిత్రానికి ముహూర్తం ఖరారైంది. పంద్రాగస్టు పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మహేష్ కొత్త సినిమా లాంఛనంగా ప్రారంభం కాబోతోంది. దిల్‌రాజు, అశ్వనీదత్ నిర్మాణంలో దర్శకుడు వంశీ పైడిపల్లి ఈ సినిమాను రూపొందించనున్నారు. అమెరికాలో ఎక్కువ భాగం సినిమాను చిత్రీకరిస్తారు. మహేష్ సరసన నటించే నాయిక ఎవరన్నది ఇంకా తెలియలేదు. ఈ సినిమా పట్ల మహేష్ ఆసక్తిగా ఉన్నాడు. తన కెరీర్‌లో మైలురాయి లాంటి చిత్రం కావడంతో పాటు కథా కథనాలు ఆకట్టుకోవడం ఈ స్టార్ సంతోషానికి కారణంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం మహేష్ నటిస్తున్న 'స్పైడర్' సెప్టెంబర్ 27న విడుదలకు సిద్ధమవుతుండగా...మరో సినిమా 'భరత్ అను నేను' రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటోంది.


ట్యూబ్ లైట్


కాజల్

బాలీవుడ్‌లో ఎందరు కథానాయకులు వచ్చినా ఖాన్ స్టార్స్ క్రేజ్ తగ్గడం లేదు. గత పాతికేళ్లుగా హిందీ బాక్సాఫీస్‌ను వీళ్లు ఏలుతూనే ఉన్నారు. ఏటికేడాది కొత్త రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు. అయితే ఖాన్ త్రయంలో

ఇద్దరూ ఒక్కోటి ఇచ్చారు

అమీర్‌ఖాన్‌ను వదిలేస్తే...షారుక్, సల్మాన్‌కు ఈ ఏడాది కలిసిరాలేదు. ముఖ్యంగా వీళ్లద్దరి గత చిత్రాలు రెండూ అపజయం పాలయ్యాయి. సల్మాన్ అమాయకుడిలా నటించిన 'ట్యూబ్‌లైట్', షారుక్ రొమాంటిక్ లవ్‌స్టోరీ 'జబ్ హ్యారీ మెట్ సెజల్' చేదు ఫలితాన్ని చూశాయి. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలు ఎంత బాగా లేకపోయినా...వారం పాటు వసూళ్లకు ఢోకా ఉండదు. ఈ నమ్మకంతోనే నిర్మాతలు పేరున్న కథానాయకులపై కోట్ల రూపాయలు పెట్టుబడి పెడతారు. వాళ్ల సినిమాలు విడుదలయ్యే థియేటర్ల సంఖ్య భారీగా ఉండటమే ఈ తొలివారం అధిక వసూళ్లకు కారణం. సల్మాన్, షారుక్ చిత్రాల విషయంలో వీటి సంఖ్య మరీ ఎక్కువగా ఉంటుంది. అయినా....'ట్యూబ్‌లైట్', 'జబ్ హ్యారీ మెట్ సెజల్' అనూహ్య పరాజయాలను అందుకున్నాయి. అతి తక్కువ వసూళ్లు నమోదు చేశాయి. ఆడుతూ పాడుతూ నవ్వించే సల్మాన్ స్వాతిముత్యంలా అమాయకపు పనులు చేస్తుంటే ప్రేక్షకులు చూడలేక పోయారు. ఇక పాత్రలోని సెంటిమెంట్, సల్మాన్ ఏడ్చే సన్నివేశాలు అభిమానులకు రుచించలేదు. కబీర్ ఖాన్ రూపొందించి ఈ యుద్ధ నేపథ్య చిత్రం మొత్తంగా అపజయం పాలైంది. ఇక షారుక్, అనుష్క శర్మ నటించిన 'జబ్ హ్యారీ మెట్ సెజల్' ప్రేమ కథల్లోని అనుభూతిని తీసుకురాలేక పోయింది. దీంతో రికార్డులు సృష్టించే ఇద్దరు ఖాన్‌లు బాలీవుడ్‌కు చెరో అపజయం అందించారు.

ఎంపిక చేసుకునే
స్వేచ్ఛ నాదే...!

సినిమాల సంఖ్యలో అర్ధ శతకం పూర్తి చేసుకుని ఉత్సాహంగా సాగుతోంది కాజల్ కెరీర్. దక్షిణాదిలో ఆమె ఆసక్తి చూపించేది తమిళ, తెలుగు సినిమాలపైనే. ముఖ్యంగా టాలీవుడ్ కాజల్‌కు సొంతూరు లాంటిది. అరంగేట్రం, విజయాలు, అగ్ర స్థానానికి చేరడం అన్నీ ఇక్కడే జరిగాయి. తెలుగులో వచ్చిన పేరును అనుసరిస్తూ తమిళ అగ్ర తారలు అవకాశాలిచ్చారు. ప్రతిష్ఠ మొదలైంది మాత్రం ఇక్కడి నుంచే. అయితే ఇప్పుడు కాజల్ సినిమాల్లో హిందీ చిత్రాలు కూడా చేరుతున్నాయి. గతేడాది 'దో లఫ్జోంకీ కహానీ' లో నటించింది కాజల్. ఇక ఆ తర్వాత బాలీవుడ్ సినిమా చేయలేదు. ఇప్పుడు తెలుగులో జోరు తగ్గుతున్న నేపథ్యంలో ఆమె ఆసక్తి హిందీ చిత్రాలపైకి మళ్లుతోంది. బాలీవుడ్‌లో టెంపర్ రీమేక్ చిత్రంతో పాటు 'యమ్లా పగ్లా దీవానా 3' చిత్రాన్ని కొత్తగా అంగీకరించింది. ఈ సినిమా ఆగస్టు చివరి వారం నుంచి చిత్రీకరణకు వెళ్లనుంది. గతంలో వచ్చిన యమ్లా పగ్లా దీవానా సినిమాలకు ఇది కొనసాగింపు కాదు. పూర్తిగా కొత్త కథతో రూపొందనుంది. కేవలం ప్రధాన పాత్రధారులు ధర్మేంద్ర, బాబీ డియోల్, సన్నీ డియోల్ కొనసాగుతున్నారు. తెలుగు, తమిళ, హిందీ చిత్రాల ఎంపికలో తన దృక్పథాన్ని కాజల్ తెలిపింది. ఆమె మాట్లాడుతూ...'భాషలకు అతీతంగా అవకాశాలు వస్తుంటాయి. వాటిలో నచ్చిన వాటిని ఎంపిక చేసుకుంటుంటాను. సత్తా గల పాత్రలపై ఆసక్తి చూపిస్తుంటాను. నటించే అవకాశమున్న పాత్రలే నాకు నటిగా సృజనాత్మక సంతృప్తినిస్తాయి.' అని చెప్పింది. ఇటీవలే 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాతో తెలుగులో విజయాన్నందుకున్న కాజల్...తమిళంలో ఈ నెలలోనే అజిత్ హీరోగా నటించిన 'వివేగం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

పల్లెటూరి ప్రేమకథ




'జబ్ హ్యారీ మెట్ సెజల్'

రచయిత హర్షవర్ధన్ దర్శకుడిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. శ్రీముఖి, మురళి జంటగా నటిస్తున్నారు. అంజిరెడ్డి ప్రొడక్షన్స్, విశ్వేష్‌బాబు సమర్పణలో ఈ సినిమా నిర్మాణమవుతోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. పోస్టర్ విడుదల అనంతరం దర్శకుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ...'పెళ్లిళ్లు ఘనంగా జరిపిస్తుంటాం. వైవాహిక బంధం అరవై ఏళ్లు పూర్తి చేసుకున్నాక షష్ఠి పూర్తి చేస్తాం. ఇప్పుడు షష్ఠి పూర్తి సందర్భాన్ని మరిచిపోతున్నాం. పెళ్లి కంటే షష్ఠి పూర్తి ఘనంగా జరగాలనే ఆలోచన నుంచి పుట్టిన కథ ఇది. కాన్సెప్టు బేస్డ్ సినిమాలకు మంచి ఆదరణ ఉంటోంది. ఆ నమ్మకంతోనే ఈ చిత్రాన్ని రూపొందించాను. సినిమా ప్రారంభించడం కంటే పూర్తి చేయడం ముఖ్యం. నేను సినిమా చూపిద్దామనుకుంటే...షూటింగ్ సమయంలో నాకు సినిమా కనిపించింది. దర్శకత్వం సులువైన విషయం కాదని అర్థమైంది. 1980వ దశకంలో ఓ మారుమూల గ్రామంలో జరిగే ప్రేమకథ ఇది. అన్ని కమర్షియల్ అంశాలుంటాయి. పెద్ద హీరో చేయాల్సిన సినిమాలా ఉంటుంది. కొన్ని కారణాల వల్ల ఈ చిత్రానికి నేనే సంగీతం అందించాల్సివచ్చింది. సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి.' అన్నారు. శ్రీముఖి మాట్లాడుతూ...'హర్షవర్ధన్ మంచి రచయిత. ఆయన మాటలు రాసిన సినిమాలు నాకు ఇష్టం. హర్ష ఓ సినిమాకు దర్శకత్వం వహిస్తూ అందులో నాయికగా నన్ను అనుకున్నారంటే తప్పకుండా నటించాలి అనుకున్నాను. జెంటిల్‌మన్ సినిమాలో ప్రత్యేక గీతంలో నటించాక..అలాంటి అవకాశాలు చాలానే వచ్చాయి. అయితే పాటల్లో ఆడిపాడాలని, ఎక్కువ సినిమాలు త్వరత్వరగా చేసేయాలనే తొందర నాలో లేదు. నేను ఇప్పుడు సంతోషంగా ఉన్నాను. కథలు నచ్చితేనే సినిమాలు ఒప్పుకుంటున్నాను. ఇందులో నా క్యారెక్టర్ బాగుంటుంది.'అన్నారు. ఈ కార్యక్రమంలో నటీనటులతో పాటు నిర్మాతలు అంజిరెడ్డి, విశ్లేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఆండ్రియా జెర్మియా

మేమేం పైనుంచి దిగిరాలేదు. మిగతా అమ్మాయిల్లాంటి వాళ్లమే అని చెబుతుంటారు నాయికలు. సాధారణ యువతుల లాగే ఉంటామని అంటుంటారు. అయితే ఈ తారల ఆలోచనలు మాత్రం భిన్నంగా సాగుతుంటాయి. ముఖ్యంగా ప్రేమ, పెళ్లి లాంటి వ్యక్తిగత విషయాల్లో వాళ్ల దృక్పథాలు చాలా వింతగా ఉంటాయి. నాయికలు కొనసాగుతున్న వృత్తి ప్రభావమో, అనుభవం తెచ్చిన మార్పో గానీ...తమ భావాలను కొత్తగా వ్యక్తీకరిస్తుంటారు. దక్షిణాది నాయిక

ప్రేమించాక పెళ్లేనా...

ఆండ్రియా జెర్మియా ఇలాగే స్పందించింది. తన అభిప్రాయంలో ప్రేమకు కొనసాగింపు పెళ్లి కానక్కర్లేదు అని చెప్పింది. గాయనిగా కెరీర్ ప్రారంభించిన ఆండ్రియా...తర్వాత నాయికగా తెరకు పరిచయమైంది. తమిళ, మలయాళ చిత్రాల్లో పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా ఆమె కమల్‌హాసన్‌తో కలిసి నటించిన 'విశ్వరూపం' బాగా గుర్తింపు తీసుకొచ్చింది. తెలుగులో నాగ చైతన్య, తమన్నా నటించిన 'తడాఖా' సినిమాలో సునీల్‌కు జోడీగా నటించింది. ప్రేమ, పెళ్లి విషయాలపై ఇటీవల ఆండ్రియా మాట్లాడుతూ..'ప్రేమంటే నాకు ఇష్టమే. నిజాయితీ పరుడైన ఓ వ్యక్తిని ప్రేమించాలనుకుంటున్నా. అయితే ఈ ప్రేమ ఎక్కడికి తీసుకెళ్తుందో చూడాలి. అంతా ప్రేమించాక పెళ్లే అంటుంటారు. ప్రేమకు కొనసాగింపు పెళ్లి అనేది నమ్మను. ఆ ప్రేమలో ప్రయాణించి ఆస్వాదించాలి. పరిణామం తెలుసుకోవాలి.' అని చెప్పింది. కోలీవుడ్‌లో ఆండ్రియా నటించిన కొత్త సినిమా 'తారామణి' ఈ వారమే విడుదలై మంచి విజయాన్నందుకుంది.

ఓయ్... నిన్నే ఆడియో విడుదల

భరత్, సృష్టి నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం ఓయ్..నిన్నే. ఎస్.వి.కె.సినిమా పతాకంపై సత్య చల్లకోటి దర్శకత్వంలో వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. శేఖర్‌చంద్ర సంగీత సారధ్యంలో రూపొందిన ఆడియో బిగ్ సీడీని, ఆడియో సీడీలను కోన వెంకట్ విడుదలచేసి, తొలి సీడీని అనిల్ రావిపూడికి అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ, ఎన్టీఆర్, ఏఎన్నార్, దాసరి సహా ఎందరో వేసిన దారి ఇప్పుడు ఎంతో బావుంది. తెలుగు చిత్ర పరిశ్రమ ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో నూతన నటీనటులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది తెలంగాణ ప్రభుత్వం తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతోంది అని అన్నారు. కోన వెంకట్ మాట్లాడుతూ, సినిమా బావుంటే తుఫానులు, జీఎస్‌టీలు ఏవీ ఆపలేవు. అలాంటి మంచి కాన్సెప్ట్ ఈ చిత్రంలో నాకు కనపడుతోంది అని అన్నారు. నిర్మాత వంశీకృష్ణ మాట్లాడుతూ, మా బేనర్‌లో నేను చేసిన సినిమాల్లో సోలో నాకు బాగా నచ్చింది. దానికంటే ఈ సినిమా బావుంటుందనిపిస్తోంది. కథాపరంగా చాలా మంచికథ. కచ్చితంగా ఘన విజయం సాధిస్తుందని అనుకుంటున్నాం అని అన్నారు. దర్శకుడు సత్య చల్లకోటి మాట్లాడుతూ, నిర్మాతకు కథ బాగా నచ్చడంతో ఏం కావాలంటే అది చేద్దామని ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. భరత్, సృష్టి కొత్తవాళ్లైనా తమ



పాత్రలలో చాలా బాగా నటించారు అని చెప్పారు. హీరో భరత్ మాట్లాడుతూ, మంచి సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది. సినిమాలో పాత్ర కోసం చాలా సన్నబడ్డాను. అందరికీ నచ్చేవిధంగా ఈ సినిమా ఉంటుంది అని అన్నారు. సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర మాట్లాడుతూ, రామజోగయ్యశాస్త్రి ఓ పాట పాడటం ఇందులో ప్రత్యేకం. అలాగే నేను కూడా ఓ పాట పాడాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, చంద్రసిద్ధార్థ, కృష్ణచైతన్య, హీరోయిన్ సృష్టి రామజోగయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సంతోషం అవార్డులు

సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్, గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఉత్తమ నటుడిగా నాగచైతన్య (ప్రేమమ్), ఉత్తమ దర్శకుడిగా బోయపాటి శ్రీను (సరైనోడు), ఉత్తమ నటిగా సమంత (అ...ఆ) ఎంపికకాగా, ఉత్తమ చిత్రంగా పెళ్లిచూపులు ఎంపికైంది. తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఇంకా అల్లు అరవింద్ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.


అల్లు అరవింద్, బోయపాటి శ్రీను, నాగచైతన్య

యువీకి నిరాశే

- మనీష్‌పాండే, కేఎల్ రాహుల్‌కు చోటు
- వన్డే జట్టును ప్రకటించిన బీసీసీఐ




ముంబై: శ్రీలంకతో జరగబోయే వన్డే సిరీస్‌కు వెటరన్ డ్యాషింగ్ బ్యాట్స్‌మన్ యువరాజ్ సింగ్‌కు మళ్లీ నిరాశే మిగిలింది. లంకతో జరగే ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఏకైక టీ20లకు ఆదివారం బీసీసీఐ జట్టును ప్రకటించింది. ఈ బృందంలో యువరాజ్‌తోపాటు మహ్మద్ షమి, అశ్విన్, రవీంద్ర జడేజా,ఉమేష్ యాదవ్‌లకు చోటు దక్కలేదు. యువస్టార్లు మనీష్ పాండే, కేఎల్ రాహుల్, షర్దుల్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్ 15 మంది బృందంలో సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ యేడాది ఐపీఎల్ సీజన్‌లో విశేషంగా రాణించడం ద్వారా మనీష్ పాండే సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. భారత ఎ-జట్టుకు సారథ్యం వహించిన పాండే ద.ఆఫ్రికాలో జరిగిన ముక్కోణ సిరీస్‌లో జట్టును విజయపథాన నడిపించాడు. ఈ సిరీస్‌లో అతడు 307 పరుగులు సాధించి జట్టు బ్యాటింగ్‌కు వెన్నుముఖగా నిలిచాడు.

శ్రీలంక వన్డే సిరీస్‌కు భారత జట్టు ఇదే: విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, మనీష్ పాండే, అజింక్య రహానే, ఎంఎస్ ధోని, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, యుజువేంద్ర చాహల్, షర్దుల్ ఠాకూర్, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా.

- విదేశీ గడ్డపై ఫాస్టెస్ట్ సెంచరీ
- ఒకే ఓవర్‌లో 26 పరుగులతో లారా తర్వాత స్థానం

పాండ్య ఘటాఘట్



- భారత్ తొలి ఇన్నింగ్స్ 487
- 135 పరుగులకే కుప్పకూలిన లంక ఫాలోఆన్ ఆడుతున్న ఆతిథ్య జట్టు
- రెండో ఇన్సింగ్‌లో 19/1

పల్లెకెలె: శ్రీలంకతో జరుగుతున్న మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ సేన 487 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటైంది. చివరలో హార్దిక్ పాండ్య (108) మెరుపు సెంచరీ చేయడంతో టీమిండియాదే పైచేయిగా నిలిచింది. అటు తర్వాత భారత్ బౌలర్లు చెలరేగి ఆతిథ్య శ్రీలంకని తొలి ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుప్పకూల్చి టెస్టుపై రెండో రోజే భారత్‌కి ఆధిపత్యాన్ని అందించారు. కెరీర్‌లో రెండో టెస్టు ఆడుతున్న చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ (4/40) లంక బ్యాట్స్‌మెన్‌ని ఉక్కిరిబిక్కిరి చేయగా.. అశ్విన్ (2/22) తన వంతు సహకారం అందించాడు. దీంతో శ్రీలం క కేవలం 37.4 ఓవర్లలోనే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేసిన భారత్‌కి 352 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. దీంతో మరో ఆలోచన లేకుం డా కెప్టెన్ విరాట్ కోహ్లీ .. లంకేయుల్ని ఫాలో ఆన్ ఆడేందుకు ఆహ్వానించాడు. రెండో సెషన్‌లో మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంకని ఆదిలోనే పేసర్ మహమ్మద్ షమీ దెబ్బతీశాడు. ఓపెనర్లు కరుణరత్నె (4), ఉపుల్ తరంగ (5)ని బోల్తా కొట్టించాడు. ఇద్దరూ కీపర్ సాహాకే క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం వచ్చిన కుశాల్ మెండిస్ (18) లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌటవగా.. మాథ్యూస్ (0) కనీసం ఖాతా తెరవకుండానే హార్దిక్ పాండ్య బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఈ దశలో కెప్టెన్ చండిమాల్ (48).. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ డిక్‌వెల్లా (29)తో కలిసి కాసేపు పోరాడినా.. కులదీప్ యాదవ్ ఈ జోడిని విడదీసి లంకని ఒత్తిడిలోకి నెట్టాడు. స్పిన్నర్లు చెలరేగడంతో లంక బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. కుల్‌దీప్ యాదవ్ 4, అశ్విన్, షమి చెరో రెండు వికెట్లు తీయగా.. పాండ్య ఒక వికెట్ తీశాడు. మరొకరు రనౌటయ్యారు. లంక బ్యాట్స్‌మెన్‌లో కెప్టెన్ చండిమాల్ మాత్రమే 48 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కేవలం 37.4 ఓవర్లలోనే 135 పరుగులకే లంక తొలి ఇన్నింగ్స్ ముగిసింది. దీంతో తొలిసారి విదేశీ గడ్డపై సిరీస్ క్లీన్‌స్వీప్ దిశగా మరో అడుగు ముందుకేసింది కోహ్లీ సేన. రెండు సెషన్లు కూడా పూర్తి ఆడలేకపోయింది ఆతిథ్య జట్టు.

అంతకు ముందు 329/6 ఓవర్ నైట్ స్కోరుతో రెండోరోజు ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విరాట్ సేన.. మరో 158 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓవర్ నైట్ ఆటగాడు వృద్ధిమాన్ సాహా(16) ఆదిలోనే ఏడో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ 339 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్ చక్కటి భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ 62 పరుగుల భాగస్వామ్యాన్ని సాధించడంతో భారత స్కోరు నాలుగు వందలు దాటింది. పాండ్య దూకుడుగా ఆడగా.. కులదీప్ అతడికి అండగా నిలిచాడు. 26 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కులదీప్ అవుట్ అయిన కొద్ది సేపటికి మొహ మ్మద్ షమీ(8) తొమ్మిదో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తరుణంలో హార్దిక్ పాండ్య దూకుడుగా ఆడాడు. కేవలం చివరి వికెట్ మాత్రమే మిగిలి ఉండటంతో సాధ్యమైనన్ని పరుగులు సాధించాలనే లక్ష్యంతో చెలరేగి ఆడాడు. వికెట్ కోసం బ్యాట్స్‌మెన్ చుట్టూ మూగిన లంక ఫీల్డర్లు.. పాండ్య ధాటికి బౌండరీ లైన్ వద్ద బంతి కోసం కాపు కాయాల్సి వచ్చింది. లంక స్పిన్నర్ పుష్పకుమార వేసిన ఇన్నింగ్స్ 116 ఓవర్‌లో హార్దిక్ బౌండరీల వర్షం కురిపించాడు. వన్డే తరహా ఆట తీరుతో రెచ్చిపోయిన పాండ్య.. 8 ఫోర్లు, 7 సిక్సర్లతో లంక బౌలర్లకు చుక్కలు చూపించాడు. తొలి రెండు బంతుల్ని బౌండరీలుగా మలిచిన హార్దిక్.. ఆపై మూడు బంతుల్ని సిక్సర్లు కొట్టాడు. దాంతో ఆ ఓవర్‌లో 26 పరుగుల్ని హార్దిక్ పిండుకున్నాడు. ఓవరాల్‌గా 86 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో హార్దిక్ శతకం సాధించాడు. హార్దిక్ తొలి హాఫ్ సెంచరీ సాధించ డానికి 61 బంతులు తీసుకోగా, రెండో హాఫ్ సెంచరీకి 25 బంతులు



మాత్రమే ఎదుర్కోవడం విశేషం. ఈ సిరీస్ ద్వారానే టెస్టుల్లో అరంగేట్రం చేసిన హార్దిక్.. ఆడుతున్న మూడో టెస్టులోనే సెంచరీ సాధించడం మరో విశేషం. 96 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 108 పరుగులు సాధించి చివరి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. టెస్టుల్లో ఒకే ఓవర్‌లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా పాండ్య రికార్డు క్రియేట్ చేశాడు. ఉమేశ్ యాదవ్ రూపంలో చివరి వికెట్‌ను కాపాడుకుంటూ.. హార్దిక్ టెస్టుల్లో తొలి సెంచరీ సాధించాడు. సెహ్వాగ్ తర్వాత విదేశీ గడ్డపై ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత ఆటగాడిగా పాండ్య రికార్డు నెలకొల్పాడు. వీరూ 2006లో కరేబియన్ గడ్డ మీద విండీస్‌పై 78 బంతుల్లోనే శతకం పూర్తి చేయగా.. హార్దిక్ ఈ మ్యాచ్‌లో చివరి వికెట్ అండతో 86 బంతుల్లో సెంచరీ చేశాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి వేగంగా సెంచరీ చేసి న భారత ఆటగాడిగా పాండ్య నిలిచాడు. టెయిలెండర్లతో సహకారంతో పాండ్య ఆడిన అద్భుత ఇన్నింగ్స్ కారణంగా భారత్.. మరో 150 పరుగులు అదనంగా చేయ గలిగింది. లంక స్పిన్ బౌలర్లు లక్షణ్ సండకన్ ఐదు వికెట్లతో రాణించగా, పుష్పకు మార మూడు వికెట్లు సాధించాడు. పేసర్ విశ్వ ఫెర్నాండ్ రెండు వికెట్లు తీశాడు.

4,౯,6,6,6,0తో హార్దిక్ రికార్డు



హార్దిక్ పాండ్య.. కేవలం 86 బంతుల్లోనే టెస్టుల్లో తొలి సెంచరీ చేశాడు పాండ్య. అందులో 7 సిక్సర్లు, 8 ఫోర్లు ఉన్నాయి. వేగవంతమైన శతకం బాదిన హిట్టర్ హార్దిక్ పాండ్య భారత్ తరపున అరుదైన రికార్డు నెలకొల్పాడు. 23 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌తో జరిగిన ఓ టెస్టులో ఒకే ఓవర్‌లో కపిల్‌దేవ్ వరుసగా నాలుగు సిక్సర్లు కొట్టి 24 పరుగులు రాబట్టాడు. తాజాగా పల్లెకలె టెస్టులో శ్రీలంక స్పిన్నర్ పుష్పకుమార బౌలింగ్‌లో హార్దిక్ పాండ్య వరుసగా 4, 4, 6 ,6 ,6 బాది 26 పరుగులతో ఆ రికార్డుని బద్దలుకొట్టాడు. భారత్ 322/6తో ఉండగా జట్టు స్కోరు బాధ్యతలు తీసు హార్దిక్ పాండ్య (108: 96 బంతుల్లో 8పోర్లు, 7సిక్సులు) చివరి వికెట్‌గా 487 పరుగుల వద్ద వెనుదిరిగాడు.ఇక ఎనిమిదో స్థానంలో ఆడుతూ.. అత్యంత వేగంగా సెంచరీ చేసిన ఇండియన్ బ్యాట్స్‌మన్‌గానూ పాండ్య నిలిచాడు. టెస్టు చరిత్రలో ఒకే ఓవర్‌లో 28 పరుగులు బాదిన క్రికెటర్‌గా వెస్టిండీస్ దిగ్గజ హిట్టర్ బ్రియాన్ లారా (4,6,6,4,4,4) అగ్రస్థానంలో ఉన్నాడు. తొలి రెండు ఫోర్లు బాదిన అనంతరం.. క్రీజు వెలుపలకి వస్తూ హ్యాట్రిక్ సిక్సర్లు బాదిన పాండ్య.. చివరి బంతిని హిట్టింగ్ చేయలేకపోవడంతో అరుదైన నెం.1 రికార్డు ముంగిట ఆగిపోయాడు. ఒకవేళ చివరి బంతి సిక్స్‌గా వెళ్లుంటే 32 పరుగులతో అన్ని రికార్డులు బద్దలైపోయేవి.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: శిఖర్ ధావన్ (సి) చండిమల్ (బి) పుష్పకుమార 119, లోకేష్ రాహుల్ (సి) కరుణరత్నె (బి) పుష్పకుమార 85, చతేశ్వర్ పుజారా (సి) మాథ్యూస్ (బి) సందకన్ 8, విరాట్ కోహ్లీ (సి) కరుణరత్నె (బి) సందకన్ 42, అజింక రహానె (బి) పుష్పకుమార 17, రవిచంద్రన్ అశ్విన్ (సి) డిక్‌వెల్లా (బి) విశ్వ ఫెర్నాండో 31, వృద్ధిమాన్ సాహా (సి) దిల్‌రువాన్ పెరెర (బి) విశ్వ ఫెర్నాండో 16, హార్దిక్ పాండ్య (సి) దిల్‌రువాన్ పెరెరర (బి) సందకన్ 108, కులదీప్ యాదవ్ (సి) డిక్‌వెల్లా (బి) సందకన్ 26, మొహమ్మద్ షమీ (సి అండ్ బి) సందకన్ 8, ఉమేష్ యాదవ్ నాటౌట్ 3.

ఎక్స్‌ట్రాలు: 24, మొత్తం: 487 ఆలౌట్

వికెట్ల పతనం: 188-1 (లోకేష్ రాహుల్), 219-2 (శిఖర్ ధావన్), 229-3 (చతేశ్వర్ పుజారా), 264-4 (అజింక రహానె), 296-5 (విరాట్ కోహ్లీ), 322-6 (రవిచంద్రన్ అశ్విన్), 339-7 (వృద్ధిమాన్ సాహా), 401-8 (కులదీప్ యాదవ్), 421-9 (మొహమ్మద్ షమీ), 487-10 (హార్దిక్ పాండ్య)

బౌలింగ్: విశ్వ ఫెర్నాండ్ 26-3-87-2, లహిరు కుమార 23-1-104-0, డిముత్ కరుణరత్నె 7-0-30-0, దిల్‌రువాన్ పెరెర 8-1-36-0, లష్యన్ సందకన్ 35.3-4-132-5, మలింద పుష్పకుమార 23-2-82-3.

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: డిముత్ కరుణరత్నె (సి) సాహా (బి) షమీ 4, ఉపుల్ థరంగ (సి) సాహా (బి) షమీ 5, కుశాల్ మెండిస్ రనౌట్ (అశ్విన్/కులదీప్ యాదవ్) 18, దినేష్ చండిమల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 48, ఏంజెలో మాథ్యూస్ ఎల్బీ (బి) హార్దిక్ పాండ్య 0, నిరోషన్ డిక్‌వెల్ స్టంప్ సాహా (బి) కులదీప్ యాదవ్ 29, దిల్‌రువాన్ పెరెర (సి) హార్దిక్ పాండ్య (బి) కులదీప్ యాదవ్ 0, మలింద పుష్పకుమార (బి) కులదీప్ యాదవ్ 10, లష్యన్ సందకన్ (సి) ధావన్ (బి) అశ్విన్ 10, విశ్వ ఫెర్నాండో (బి) కులదీప్ యాదవ్ 0, లహిరు కుమార నాటౌట్ 0, **ఎక్స్‌ట్రాలు: 11, మొత్తం: 135 ఆలౌట్.**

వికెట్ల పతనం: 14-1 (ఉపుల్ థరంగ), 23-2 (డిముత్ కరుణరత్నె), 38-3 (కుశాల్ మెండిస్), 38-4 (ఏంజెలో మాథ్యూస్), 101-5 (నిరోషన్ డిక్‌వెల్లా), 107-6 (దిల్‌రువాన్ పెరెర), 125-7 (దినేష్ చండిమల్), 125-8 (మలింద పుష్పకుమార), 135-9 (విశ్వ ఫెర్నాండో) 135-10 (లష్యన్ సందకన్)

బౌలింగ్: మొహమ్మద్ షమీ 6.5-1-17-2, ఉమేష్ యాదవ్ 3.1-0-23-0, హార్దిక్ పాండ్య 6-1-28-1, కులదీప్ యాదవ్ 13-2-40-4, రవిచంద్రన్ అశ్విన్ 8.4-2-22-2.


శ్రీలంక రెండో ఇన్నింగ్స్: డిముత్ కరుణరత్నె బ్యాటింగ్ 12, ఉపుల్ థరంగ (బి) ఉమేష్ 7, మలింద పుష్పకుమార బ్యాటింగ్ 0, **మొత్తం: 19/1.**

వికెట్ల పతనం: 15-1 (ఉపుల్ థరంగ)

బౌలింగ్: మొహమ్మద్ షమీ 4-2-7-0, రవిచంద్రన్ అశ్విన్ 6-4-5-0, ఉమేష్ యాదవ్ 2-0-3-1, కులదీప్ యాదవ్ 1-0-4-0.



హైదరాబాద్‌లో జరిగిన మహావీర్ టేబుల్ టెన్నిస్ స్టేట్ ర్యాంకింగ్ టోర్నీ విజేత నైనా జైస్వాల్. ఆమె ఆదివారం జరిగిన ఫైనల్లో 4-2 తేడాతో ప్రణీత (హెచ్‌వీఎస్ అకాడమీ)పై గెలిచింది.




శ్రీనగర్: 71వ స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో శ్రీనగర్ భక్షి మైదానంలో సైనిక విన్యాసాల్లో అపశృతి. మోటార్ సైకిల్ ఫీట్‌లో గాయపడిన డేర్‌డెవిల్ సంజీవ్.

పంద్రాగస్టు ఫీట్స్...

71వ స్వాతంత్ర్య వేడుకలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమాలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు జోరందుకున్నాయి. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు అటు త్రివిధ దళాల సైన్యం, ఇటు ఎన్‌సీసీ క్యాడెట్లు రకరకాల విన్యాసాలను కసరత్తు చేస్తున్నారు. మరోవైపు జాతీయతను ప్రతిబింబించే విశిష్ట కార్యక్రమాలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. మువ్వన్నెల పతాకం, జాతీయ భావనతో కూడిన పలు రకాల విన్యాసాలు ప్రదర్శించే క్రమంలో ఆదివారం పలుచోట్ల నిర్వహించిన రిహార్సల్స్ దృశ్యమాలికలు కనులవిందుగా నిలిచాయి.



న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఎర్రకోట వద్ద విద్యార్థుల రిహార్సల్స్. జాతీయ పతాకం, భారత్ అనే అక్షరాల ఆకృతిలో ఢిల్లీ విద్యార్థుల డ్రెస్ రిహార్సల్ దృశ్యం.



మాంట్రెక్స్: స్విట్జర్లాండ్‌లోని జెనీవా సరస్సు తీరంలో నిర్వహించిన "వాటర్ రింగ్స్" జిమ్నాస్టిక్స్ క్రీడాపోటీల్లోని దృశ్యమిది. ఓ మహిళా అథ్లెట్ రింగింగ్ జంప్ చేస్తూ లేక్‌లోకి డైవ్ చేస్తున్న విన్యాసాన్ని ఫొటోగ్రాఫర్ ఇలా క్లిక్ మనిపించాడు.




భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని నగరం భోపాల్‌లోని మోతీలాల్ నెహ్రూ మైదానంలో ఆదివారం ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌లో కవాతు చేస్తున్న ఎన్‌సీసీ బృందం.



జబల్‌పూర్: స్వాంతత్ర్య వేడుకలకు సైనిక సిబ్బంది రిహార్సల్ ఫీట్. జబల్‌పూర్‌లోని గ్రెనేడియర్ రెజిమెంట్ సెంటర్ పరేడ్ మైదానంలో డేర్‌డెవిల్ స్టంట్స్ దృశ్యం.

ఆంధ్రప్రభ క్రీడాప్రభ







అయ్యో..!

● కండరాల గాయంతో 4x100 రిలే ఫైనల్ మధ్యలోనే తప్పుకున్న బోల్ట్
● చివరి పరుగులో విషాదం ● అభిమానుల నిర్వేదం

ఉసేన్ బోల్ట్.. పరుగుల రారాజు.. కెరీర్‌లో తన చివరి పరుగు తీయబోతున్నాడు. శనివారం రాత్రి .. వేదిక.. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్. ఈ ఛాంపియన్‌షిప్‌లో లెక్కకు మించి పసిడి పతకాలు కొల్లగొట్టిన పరుగుల జగజ్జెట్టి. అభిమానుల గుండెల్లో కొలువుదీరిన దేవుడు. 100 మీటర్ల పరుగులో ఎనిమిదేళ్ల క్రితమే రికార్డు స్థాపించిన మేటి పరుగుల వీరుడు. ఇక్కడ చివరిసారిగా కాంస్యంతోనే సరిపెట్టుకున్నా.. అతణ్ని ఇంకా వెర్రిగా ఆరాధించే అభిమానులు మైదానంలో ఊపిరిబిగబెట్టుకొని బోల్ట్ ఎపుడు వస్తాడో అనుకుంటూ ఉద్వేగంతో ఎదురుచూస్తున్న వేళ.. బోల్ట్ చివరిదైన 4x100 రిలే పరుగు కోసం జమైకా బృందంతో లండన్ మైదానంలోకి అడుగుపెట్టగానే ఉవ్వెత్తున ఎగసిన అభిమానుల కోలాహలం. ఒకటే హర్షధ్వానాలు. బోల్ట్ చిత్రాలతో సందడి. సందడిని ఆస్వాదిస్తూ.. ఆనందిస్తూ.. అభివాదం చేస్తూ.. సమయం కోసం ఎదురుచూస్తున్న పరుగుల భగీరథుడు. సమయం రానే వచ్చింది. యువకులతో కూడిన జమైకా బృందం బ్యాటన్‌తో పరుగు ఆరంభించింది. బ్యాటన్‌ను లక్ష్యానికి సురక్షితంగా చేర్చడం కోసం అనుభవజ్ఞుడైన ఉసేన్ మూడో స్థానంలో బ్యాటన్‌ను సహచరుడి నుంచి అందుకున్నాడు. ట్రాక్‌పై కొంత దూరం పరుగెత్తగానే అనూహ్యంగా ఎడమ కాలి పిక్క కండరం పట్టేయడంతో కుంటడం ఆరంభించాడు. దీంతో పరుగు వేగం మందగించి ట్రాక్‌పై పడిపోయాడు. వెనుక ఉన్న జపాన్ బృందానికి బోల్ట్ దారిచ్చాడు. ఈ అనూహ్య పరిణామానికి మైదానంలో 60 వేలకు పైగా ఉన్న అభిమానులు షాక్ తిన్నారు. పరుగుల చిరుతకు చివరి మజిలీలో ఇలాంటి చేదు అనుభవం ఎదురుకావడం వారు జీర్ణించుకోలేకపోయారు.. బోల్ట్‌కు వెంటనే ప్రాథమిక చికిత్స జరిగింది. వీల్ చైర్‌లో వెళ్లేందుకు అతను నిరాకరించాడు. శక్తిని కూడదీసుకొని లేచి సహచరులు వెంటరాగా బోల్ట్ కుంటుకుంటూ ఫినిషింగ్ లైన్ వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి చికిత్స కోసం స్టేడియంలోపలికి వెళ్లిపోయాడు. ట్రాక్‌ఫీల్డ్‌ను దేదీప్యమానంగా వెలిగించిన.. డోపింగ్ మచ్చలేని పరుగుల మహారాజు చివరి మజిలీ ఈ విధంగా విషాదంతో ముగియడం అభిమానుల్ని కలచివేసింది.

ఆలస్యం వల్లే గాయం: బ్లేక్

లండన్: రిలే రేసు ఆరంభం ఆలస్యం కావడం వల్లే బోల్ట్‌కు గాయం అయిందని జమైకా రిలే జట్టు సభ్యుడు యొహాన్ బ్లేక్ ఆరోపించాడు. దీంతో తన ఉజ్వల కెరీర్‌ను ఘనంగా ముగించాల్సిన బోల్ట్ నిరాశాజనకంగా వీడ్కోలు పలికాడని ఆవేదనతో అన్నాడు. బాగా చలి వాతావరణంలో ఎక్కువ సేపు జట్టు వేచివుండడం వల్లనే బోల్ట్‌కు గాయమైందని అన్నాడు. పురుషుల 5000 మీటర్ల పరుగు పతకాల ప్రదానోత్సవం తర్వాత రేసు ఆరంభమైంది. దీంతో రేసు బాగా ఆలస్యమైంది.

పూర్తి పేరు:
ఉసేన్ సెయింట్ లియో బోల్ట్
ఎత్తు:
6 అడుగుల 5 అంగుళాలు
బరువు:
94 కిలోలు
పుట్టిన తేదీ:
21 ఆగస్టు 1988
దేశం:
జమైకా



అభిమానులకు కృతజ్ఞతలు

"మీ ప్రేమకు నా కృతజ్ఞతలు. నా అభిమానుల్ని నేను ఎంతగానో ప్రేమిస్తాను" అంటూ సోషల్ మీడియా బోల్ట్ ట్వీట్ చేశాడు.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్ స్వర్ణాలు

- ✓ 100 మీ. 9.58 సెకన్లు - బెర్లిన్ 2009
- ✓ 100 మీ. 9.77 సెకన్లు - మాస్కో 2013
- ✓ 100 మీ. 9.79 సెకన్లు - బీజింగ్ 2015
- ✓ 200 మీ. 19.19 సెకన్లు - బెర్లిన్ 2009
- ✓ 200 మీ. 19.40 సెకన్లు - డిగు 2011
- ✓ 200 మీ. 19.66 సెకన్లు - మాస్కో 2013
- ✓ 200 మీ. 19.55 సెకన్లు - బీజింగ్ 2015
- ✓ 4x100 మీ. 37.31 సెకన్లు - బెర్లిన్ 2015
- ✓ 4x100 మీ. 37.04 సెకన్లు - డిగు 2011
- ✓ 4x100 మీ. 37.36 సెకన్లు - మాస్కో 2013
- ✓ 4x100 మీ. 37.36 సెకన్లు - బీజింగ్ 2015

ఒలింపిక్స్‌లో పసిడి పతకాలు

2008 బీజింగ్	2012 లండన్	2016 రియో
100మీ. 9.69 సెకన్లు 200మీ.19.30 సెకన్లు	100 మీ. 9.63 సెకన్లు 200 మీ. 19.32 సెకన్లు 4X100 మీ. 36.84 సెకన్లు	100 మీ. 9.81 సెకన్లు 200 మీ. 19.78 సెకన్లు 4X100 మీ. 37.27 సెకన్లు

ప్రపంచ రికార్డులు

100 మీ. 9.58 సెకన్లు ప్రపంచ ఛాంపియన్ షిప్ - బెర్లిన్ 2009	200 మీ. 19.19 సెకన్లు ప్రపంచ చాంపియన్‌షిప్ - బెర్లిన్ 2009	4X100 మీ. 36.84 సెకన్లు ఒలింపిక్స్ - లండన్ 2012

బోల్ట్ ఎప్పుడేమన్నాడంటే....

"ప్రవర్తనే అన్నిటికంటే కీలకం. మనం ఎదుగుతున్నపుడు వీధిలో ఎవరు కనిపించినా గుడ్ మార్నింగ్ చెప్పాలి. ప్రతి ఒక్కరికీ. ఎవరినీ విడిచిపెట్టకూడదు"
.. తానంటే అందరికీ ఎందుకంత అభిమానమో వివరించడానికి బోల్ట్ చెప్పిన మాటలివి. తన తల్లిదండ్రులు తనను అలా పెంచారని అన్నాడు.

"మనం వేగంగా పరిగెత్తితే చూడాలని వస్తారు. పరుగే కాదు వేడుక కూడా చూడాలనుకుంటారు. అందుకే నా విన్యాసాలతో వారికి కావలసింది ఇస్తా"

"నేనిపుడు దిగ్గజాన్ని. గొప్ప అథ్లెట్‌ను కూడా. మైకేల్ జాన్సన్ స్థాయి అథ్లెట్‌ను"
- 2012 లండన్ ఒలింపిక్స్‌లో 100మీ, 200 మీ.లలో పసిడి పతకాలు గెలిచిన తర్వాత బోల్ట్.

"రాణి ఎలిజబెత్ నాకు నైట్‌వుడ్ ఇచ్చినట్లయితే నేను సర్ ఉసేన్ బోల్ట్‌నవుతా. ఆ మాట వినసొంపుగా ఉంది" - మో ఫరాతో పాటు తనకూ నైట్‌వుడ్ ఇస్తారనుకుంటున్నపుడు.

బోల్ట్ గురించి దిగ్గజాల మాటల్లో...

"బోల్ట్‌తో సరిపోల్చగల అథ్లెట్ లేనేలేడు. అతను ప్రపంచ సూపర్‌స్టార్"
- దిగ్గజ అథ్లెట్ మైకేల్ జాన్సన్

"అతను దిగ్గజం. స్ఫూర్తిప్రదాత. ఆల్‌టైమ్ అత్యుత్తమ స్ప్రింటర్"
- ఐఓసీ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ రోగే.

"ఇన్ని కోట్ల మందిలో బోల్ట్ కంటే వేగంగా పరిగెత్తేవాడు లేడు"
- జమైకాలో అతణ్ని కలిసినపుడు అమెరికా అప్పటి అధ్యక్షుడు ఒబామా అన్న మాటలు.

"బోల్ట్ ఇపుడు జమైకాకు చెందిన అతిపెద్ద రాయబారి. ప్రజల్ని విశేషంగా ఆకట్టుకునే తీరుతో అతనిపుడు బ్రాండ్ జమైకాకు ఊపుతెచ్చాడు.
- జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్‌నెస్

ఇప్పటికీ అతనే అత్యుత్తమం: గాట్లిన్

లండన్: ఉసేన్ బోల్టే ఇప్పటికీ అత్యుత్తమ అథ్లెట్ అని జస్టిన్ గాట్లిన్ ప్రశంసించాడు. రిలేలో గాయం కారణంగా అర్థాంతరంగా తప్పుకున్న బోల్ట్‌కు అతను జోహార్ చేశాడు. ''ఇలాంటి ప్రమాదాలు సాధారణమే. ఈ సంఘటనకు చాలా విచారిస్తున్నాను. ప్రపంచంలో ఇప్పటికీ అతనే అత్యుత్తమ అథ్లెట్. కొద్ది మాసాల్లోనే బోల్ట్ తిరిగి వస్తాడు. ఇది బోల్ట్‌కు వీడ్కోలు సమయం. దాని గురించి నేను ఉద్వేగంతో ఉన్నాను. వార్మప్ ప్రాంతంలో మేం ఒకరికొకరం పలకరించుకున్నాం. ఉసేన్ గొప్ప అథ్లెట్'' అని గాట్లిన్ తెన్నాడు. 100 మీటర్ల పరుగులో బోల్ట్‌ను ఓడించి గాట్లిన్ స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే.

4x100 మీటర్ల పరుగు విజేత ఇంగ్లాండ్

● అమెరికాకు రజతం

లండన్: ఉసేన్ బోల్ట్ గాయంతో తప్పుకున్న 4-100 రిలే రేసు స్వర్ణాన్ని ఇంగ్లాండ్ జట్టు గెలుచుకుంది. బ్రిటన్ బృందం రేసును 37.47 సెకన్లలో పూర్తి చేసి పసిడిని, అమెరికా జట్టు 37.52 సెకన్లలో పరుగెత్తి రజతాన్ని, జపాన్ 38.04 సెకన్లలో ముగించి కాంస్యాన్ని వశం చేసుకున్నాయి.

5000 మీ. పరుగులో మో ఫరాకు రజతం

5000 మీటర్ల పరుగులోనూ స్వర్ణం కొల్లడదామనుకున్న మో ఫరాకు నిరాశే ఎదురైంది. ఫరా కూడా తన చివరి రేసును ఘనంగా ముగిద్దామనుకున్నాడు. కానీ రజతంతో తృప్తిపడాల్సి వచ్చింది.





12వ స్థానంలో దేవిందర్

లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్ చేరిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కిన పంజాబ్ త్రోయర్ దేవిందర్ సింగ్ కాంగ్ తుది పోరులో నిరాశపరిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో అతను జావెలిన్‌ను 80.02 మీటర్ల దూరం విసిరి 12వ స్థానంలో నిలిచాడు. మూడో ప్రయత్నంలో ఆయన ఆ దూరాన్ని అందుకున్నాడు. జోహాన్నెస్ వెటర్ (జర్మనీ-89.89 మీ.) జాకుబ్ (చెక్-89.73 మీ.), పీటర్ (చెక్ 88.32 మీ.) స్వర్ణ, రజత, కాంస్యాలు గెలిచారు.



మరో బోల్ట్ ఎక్కడ?

"నా పేరు బోల్ట్. నేను మెరుపు బోల్ట్‌ను"..

"ఐ యామ్ లైట్నింగ్ బోల్ట్.. ఐ యామ్ నాట్ ఫ్లాష్ గోర్డాన్ ఆర్ ఏనీబడీ. మై నేమ్ ఈజ్ బోల్ట్, లైట్నింగ్ బోల్ట్" ... ఇంత ఘనంగా, ఆత్మవిశ్వాసంతో చాటుకున్న అథ్లెట్ చరిత్రలో మరెవరైనా ఉన్నారా? ఖచ్చితంగా లేరు. బీజింగ్ ఒలింపిక్స్ 200 మీటర్ల పరుగులో మైకేల్ జాన్సన్ ప్రపంచ రికార్డును బద్దలుగొట్టిన బోల్ట్ తన ఆగమనాన్ని ఘనంగా ప్రకటించుకున్న తీరిది.

లండన్: ప్రపంచ స్థాయిలో 19 పసిడి పతకాలు.. వాటిలో 13 వ్యక్తిగతంగా సాధించినవి. బీజింగ్ ఒలింపిక్స్ నుంచి ట్రాక్ అండ్‌ఫీల్డ్‌ను జేగీయమానంగా వెలిగించిన పరుగుల చిరుత. పరుగుకే పరుగు నేర్పిన మెరుపు వీరుడు. అరుదైన విన్యాసాలతో క్రీడాభినుల హృదయాలను కొల్లగొట్టిన పరుగుల రేడు. డోపింగ్ మకిలి అనేకమంది అథ్లెట్లకు అంటు కున్నా.. ఆ జాడ్యాన్ని తన సమీపానికైనా చేరనీయని మేరునగధీరుడు... ఉసేన్ బోల్ట్. క్రమశిక్షణకు మారుపేరైన బోల్ట్ స్థానాన్ని భర్తీ చేయగల ధీరుడెవ్వడు. ప్రపంచ అథ్లెటిక్ ట్రాంక్ అండ్ ఫీల్డ్ బోల్ట్ వారసుడి కోసం వెదుకుతోంది. ఏడీ .. ఎక్కడ బోల్ట్ వారుసుడు.. అంటూ ఆశగా అన్వేషిస్తోంది. బోల్ట్ నెలకొల్పిన ప్రపంచ రికార్డులు ఇంకా పదిలంగానే ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బోల్ట్ రికార్డుల్ని అధిగమించగలిన వాళ్లు దుర్బిణి వేసినా కానరాలేదు. 100 మీటర్ల స్ప్రింట్‌లోకాని.. 200 మీటర్ల పరుగులోని కాని అతనికి సాటిరాగల వారు లేనేలేరు. 100 మీటర్ల స్వర్ణం గెలిచిన గాట్లిన్.. 200 మీటర్ల పసిడి వశం చేసుకున్న రామిల్ గులియేవ్ కాని బోల్ట్ రికార్డుకు ఆమడదూరంలో నిలిచారు. రియో ఒలింపిక్స్‌లో బోల్ట్ 200 మీటర్ల పరుగు పందెంలో బోల్ట్ తిరుగులేని విధంగా స్వర్ణం గెలిచినపుడు రామిల్ పోటీలో చివరిగా వచ్చాడు.


ట్రాక్‌ను వీడేముందు అభిమానులకు బోల్ట్ అభివాదం

అసలు వస్తాడా?: అసలు బోల్ట్‌ను తలదన్నేవాడు అసలు వస్తాడా? వేడ్ వాన్ నీకెర్క్.. బోల్ట్‌ను మరిపిస్తాడని మీడియా అతణ్ని ఆకాశానికి ఎత్తినా.. అతను అభిమానుల ఆశల్ని నెరవేర్చలేకపోయాడు. బోల్ట్ రికార్డుల్ని తిరగరాయడం మాట అటుంచి 200 మీటర్ల పరుగులో పసిడినే గెలవలేకపోయాడు.

అంకెల్లో బోల్ట్

9.58- బోల్ట్ 2009 ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో 100 మీ. రేసులో ప్రపంచ రికార్డు.

22- మైకేల్ జాన్సన్ 22 ఏళ్ల క్రితం 19.32 సెకన్లలో 200 మీ. రేసును పూర్తిచేసి నెలకొల్పిన ప్రపంచ రికార్డును బోల్ట్ 22 ఏళ్ల తర్వాత బీజింగ్ (2008)లో 19.19 సెకన్లతో బద్దలుగొట్టాడు.

19- ఉసేన్ తన కెరీర్‌లో గెలిచిన స్వర్ణాలు.

27.79 - 60- 80 మీటర్ల మధ్య గంటకు బోల్ట్ పరుగు వేగం (మైళ్లలో).

7- ప్రత్యేక ఈవెంట్లలో బోల్ట్ నెలకొల్పిన సందర్భాలు

6- ఉసేన్ ఆరుసార్లు ఐఏఏఎఫ్ ఉత్తమ అథ్లెట్‌గా ఎంపికయ్యాడు.

240- ఫోర్బ్స్ లెక్కల ప్రకారం ఏడాదికి బోల్ట్ సంపాదన సుమారు రూ. 240 కోట్లు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.